www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 27-10-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 210 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి పూర్తి; నక్షత్రం: మఖ మ. 12.24 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా.9.24-11.12; దుర్ముహూర్తం: సా.4.10-4.56; అమృతఘడియలు: ఉ.9.44-11.30; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.42 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆన్‌లైన్ అంగడి.. దోపిడీ

కూరగాయల ధరలు మూడింతలు అధికం

బెంబేలెత్తుతున్న కొనుగోలుదారులు

హేతుబద్ధత లేకుండా అడ్డగోలు రేట్లు

ఇష్టానుసారంగా నిర్ణయిస్తున్న కంపెనీలు

నియంత్రణ లేని ప్రభుత్వ యంత్రాంగం

తమ పరిధి కాదంటున్న విభాగాలు

హైదరాబాద్ కొండాపూర్‌లో ఉండే నితిన్, కావ్య దంపతులు ఐటీ ఉద్యోగులు. ఉదయాన్నే ఆఫీస్‌కు బయల్దేరి సాయంత్రం ఆరున్నర తర్వాతే ఇంటికి తిరిగొస్తుంటారు. శని, ఆదివారాలు సెలవు ఉన్నప్పటికీ.. పని ఒత్తిడి బడలిక నుంచి విశ్రాంతి కోసం, పిల్లలతో గడపటం కోసం ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే ఉంటారు. కుటుంబానికి కావాల్సిన నిత్యావసర సరుకులు, కూరగాయలను ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేస్తుంటారు. ఎప్పటిలాగే శనివారం కూరగాయల కోసం ఆన్‌లైన్‌లో చూస్తే.. రేట్లు భారీగా అనిపించాయి. కిలో దొండకాయ రూ.132, క్యారెట్ రూ.118, టమాట రూ.94, వంకాయ రూ.128 ఉన్నాయి. ఇంత ధరలున్నాయేమని.. ఓ సంచీ తీసుకొని రైతుబజార్‌కు వెళ్లి చూస్తే.. అక్కడి ధరలకు ఆన్‌లైన్ ధరలకు పోలికే లేదు. దీంతో ఇక మీదట ఆన్‌లైన్ ఆర్డర్లను తగ్గించి.. బయటకు వెళ్లి స్వయంగా కొనుక్కురావటమే మేలని నితిన్, కావ్య నిర్ణయించుకున్నారు. 14

ఆంధ్రజ్యోతి పరిశీలనలో శనివారం కూరగాయల ధరలు (కిలోకు)

కూరగాయలు	హోల్‌సేల్	రైతుబజార్	జెప్టో	స్విగ్గీ	బిగ్‌బాస్కెట్	బ్లింకిట్
బీరకాయ	50	55	114	100	99	98
ఆలుగడ్డ	32	37	57	56	50	56
దోసకాయ	35	40	108	98	78	86
మిర్చి	60	65	150	140	100	120
వంకాయ	30	35	128	112	84	84
టమాట	32	35	94	88	72	92
దొండకాయ	30	35	120	132	80	104
క్యారెట్	40	45	118	104	90	118
ఉల్లిగడ్డలు	30	34	71	68	68	70
బీన్స్	110	115	264	280	206	352
క్యాబేజీ (ఒకటి)	13	16	46	36	32	36
సొరకాయ (కిలో)	14	17	50	40	44	35



స్కిల్స్ వర్సిటీపై రాష్ట్ర ప్రభుత్వం, మేఘా ఫౌండేషన్ ఒప్పంద కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, మేఘా ఎండీ పీవీ కృష్ణారెడ్డి, సీఎస్ శాంతికుమారి

4 నుంచి కులగణన

80 వేల మంది ఎన్యుమరేటర్లతో ఇంటింటి సర్వే.. ప్రశ్నావళికి మంత్రివర్గం ఆమోదం

1 నుంచి గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక.. ఉద్యోగులకు ఒక డీఏ విడుదలకు ఓకే

జీవో 317, 46లపై అసెంబ్లీలో చర్చించి ముందుకు

రూ.24,269 కోట్లతో మెట్రో రెండో దశకు ఆమోదం

ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో రహదారుల నిర్మాణం

యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

నిర్ణయాల్ని వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం

భూములు, భవనాల అనుమతుల్లో పారదర్శకత

2 లక్షల దాకా రుణమాఫీ పూర్తి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

దీపావళి పటాసుల కన్నా ముందే రాజకీయ బాంబు పేలుతుంది: పొంగులేటి

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాలని నిర్ణయించిన కులగణన నవంబరు 4న ప్రారంభం కానుంది. ఇందుకోసం 80 వేల మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ప్రతి ఎన్యుమరేటర్ 150 ఇళ్లలో సర్వే చేయనున్నారు. నవంబరు 19వ తేదీ వరకు ఈ సర్వే కొన సాగుతుంది. ఇందుకు సంబంధించిన ప్రశ్నావళిని రాష్ట్ర మంత్రివర్గం శనివారం ఆమోదించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఐదు గంటలపాటు జరిగిన మంత్రివర్గ సమావేశంలో కులగణనతో పాటు ఉద్యోగులకు ఒక డీఏ విడుదల చేయాలన్న నిర్ణయానికి ఆమోదం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలకుగాను ఒక డీఏను దీపావళి పండుగ సందర్భంగా విడుదల చేయాలని నిర్ణయించారు. దీంతోపాటు స్పౌజ్, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, పరస్పర బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేయాలన్న నిర్ణయాన్ని ఆమోదించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి విడతగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 మంది పేదలకు ఇళ్లను అందించాలని నిర్ణయానికీ ఆమోదం తెలిపారు. దీపావళి మరుసటి రోజు సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ పథకం ప్రారంభం కానుంది. ఈ పథకం లబ్ధిదారులను నవంబరు 1 నుంచి

మిగతా 13వ పేజీలో...

స్కిల్స్ యూనివర్సిటీకి 200 కోట్లు 'మేఘా' విరాళం

భవనాల నిర్మాణం, మౌలిక వసతుల బాధ్యత

ప్రభుత్వంతో మేఘా ఫౌండేషన్ ఒప్పందం

వర్సిటీ మాస్టర్ ప్లాన్‌ను అందించిన సంస్థ

అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం

వారంలో డిజైన్లు ఖరారు చేయండి.. 13

8న పనులు ప్రారంభించండి: సీఎం రేవంత్

ఫోన్ ట్యాపింగ్, భూ ఆక్రమణ కేసుల్లో

నాటి నేతలపై నజర్!

అధికారులకు ఆదేశాలిచ్చిన వారికి నోటీసులు

కేసుల నమోదు.. రాజకీయ కోణంలో దర్యాప్తు

ఫోన్ ట్యాపింగ్ ప్రధాన నిందితుడిని

అమెరికా నుంచి రప్పించేందుకు యత్నాలు

భూ బదలాయింపు వ్యవహారంలో ప్రస్తుత, మాజీ ఐఏఎస్ అధికారుల ప్రమేయం!

ఈడీకి అమోయ్ కుమార్ బాధితుల క్యూ

తాజాగా వట్టినాగులపల్లివాసుల ఫిర్యాదు



హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. గత మార్చిలో నమోదైన ఈ కేసులో దర్యాప్తు అధికారులు ఇప్పటికే నలుగురు పోలీసు అధికారులను అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుతోపాటు మరో వ్యక్తి కోసం చట్టపరంగా ముందుకెళ్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో వందలాది మంది సాక్షులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. దర్యాప్తులో లభించిన సమాచారంతో త్వరలోనే రాజకీయ నాయకుల కోణంలో విచారణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇటీవల అధికార పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్‌తో ప్రమేయం ఉన్న అప్పటి అధికార పార్టీ నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేసి

మిగతా 13వ పేజీలో...



సిరిసిల్లలో ఎస్పీ అఖిల్ కాళ్లు మొక్కుతున్న కానిస్టేబుల్

39 మంది కానిస్టేబుళ్ల సస్పెన్షన్

టీజీఎస్పీ సిబ్బందిపై పోలీసు శాఖ చర్య

ఆందోళనలను ప్రేరేపిస్తున్నారని వేటు

నిరసనలను సహించం: డీజీపీ జితేందర్

వెట్టి నుంచి మాకు విముక్తి కల్పించండి..

బెటాలియన్లలో మట్టి పనులు చేయిస్తున్నారు

వాగులో ఇసుక, క్యాంపులో పైపులు మోస్తున్నాం

ఎస్పీ కాళ్లు మొక్కి.. కానిస్టేబుళ్ల కంటతడి

సిరిసిల్ల, హనుమకొండ, నల్లగొండలో నిరసన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని వివిధ బెటాలియన్లలో జరుగుతున్న ఆందోళనలను పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. సెలవుల విషయంలో ఇదివరకు ఉన్న పద్ధతినే అమలు చేస్తామని ప్రకటించినా.. నిరసనలు ఆగకపోవడంతో ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ ఉద్యోగంలో ఉండి ధర్నాలు, ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న వారు, న్యూస్ చానెల్స్‌కి ఇంటర్వ్యూలు ఇస్తూ, సోషల్ మీడియాలో పోస్టింగ్స్ చేస్తూ.. ఆందోళనలను ప్రేరేపిస్తున్న వారిని

మిగతా 12వ పేజీలో...

అక్టోబరులోనూ అదే తీరు

24% తగ్గిన రిజిస్ట్రేషన్ రాబడి.. హైడ్రా నేపథ్యంలో ఆచితూచి కొనుగోళ్లు

ఎన్ఆర్ఐల కొనుగోళ్లు తగ్గడం, గృహ రుణాల వడ్డీల పెరుగుదల ప్రభావం



హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానాకు రిజిస్ట్రేషన్లతో వచ్చే ఆదాయం తగ్గుతోంది. ఈ తగ్గుదల రాబడిలో కోతకు దారితీస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో వరుసగా సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రిజిస్ట్రేషన్ల ఆదాయం గతేడాదితో పోల్చితే బాగా తగ్గిపోయింది. ఈ ఏడాది సెప్టెంబరులో ఆదాయం గత ఏడాది ఇదే నెల (రూ.1,162 కోట్లు)తో పోల్చితే 26.15 శాతం తగ్గి రూ.857.83 కోట్లుగా నమోదైంది. అలాగే అక్టోబరులోనూ (26వ తేదీ వరకు) గతేడాది ఇదే నెల రాబడి రూ.1,221.82 కోట్లతో పోల్చితే 24.4 శాతం తగ్గి రూ.923.30 కోట్లకు చేరుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మే (18.06 శాతం), సెప్టెంబరు (26.15 శాతం), అక్టోబరు (24.4 శాతం) నెలల్లో రిజిస్ట్రేషన్ల ఆదాయం గత ఏడాదితో పోల్చితే తగ్గిపోయింది. అయితే ఏప్రిల్ ఆదాయంలో 2.5 శాతం, జూన్‌లో 9.58 శాతం, ఆగస్టులో 0.77 శాతం పెరుగుదల నమోదైంది. జూలై నెలలోనే ఆదాయం గత ఏడాదితో పోల్చితే ఏకంగా 38.06 శాతం పెరగడం విశేషం. ఇక దస్తావేజుల రిజిస్ట్రేషన్

మిగతా 3వ పేజీలో...



13

ఇంటికే ఆర్టీసీ కార్గో

హైదరాబాద్‌లో రేపటి నుంచి

త్వరలో రాష్ట్రమంతటా..: పొన్నం

14

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంప్రదింపుల్లో ఉన్నారు

కేటీఆర్ పక్కనున్నోళ్లే మాట్లాడుతున్నారు

ఆయన తప్పులకు పదేళ్లు జైల్లో పెట్టాలి

మహారాష్ట్ర ఎన్నికల తర్వాత కమిటీలు

ప్రతిపక్ష నేతగానూ కేసీఆర్ ఫెయిల్

పొంగులేటి పేల్చే బాంబుకోసం నిరీక్షణ

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్



13

అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకే!

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరింది అందుకే

కాంగ్రెస్ పార్టీపై ప్రేమతో రాలేదు

ప్రభుత్వాన్ని పడగొడతామన్న కిషన్‌రెడ్డి,

కేటీఆర్ బెదిరింపుల వల్లే చేర్చుకున్నాం

మధుయాష్కీ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

గంగారెడ్డి కుటుంబానికి పరామర్శ





ఇరాన్‌పై దాడికి బయల్దేరుతున్న ఇజ్రాయెలీ ఫైటర్‌జెట్

ఇజ్రాయెల్ ప్రతీకారం

ఇరాన్‌పై 100 యుద్ధ విమానాలతో దాడి

తెల్లవారుజామున 3 నగరాలపై 3 గంటల పాటు

టెహ్రాన్, ఇలం, ఖుజెస్థాన్ సైనిక స్థావరాలే లక్ష్యం

క్షిపణి, డ్రోన్ తయారీ, ప్రయోగ కేంద్రాలే టార్గెట్

తొలుత ఇరాన్ రేడార్, ఎయిర్ డిఫెన్స్ ధ్వంసం

పకడ్బందీగా 'డేస్ ఆఫ్ రెపెంటెన్స్' ఆపరేషన్

ఇద్దరు సైనికుల మృతి.. ప్రతిదాడి తప్పదు: ఇరాన్

ప్రపంచదేశాల మిశ్రమ స్పందన

టెహ్రాన్, టెల్‌అవీవ్, బీరుట్, అక్టోబరు26: ఈ నెల ఒకటిన 180కిపైగా భారీ బాలిస్టిక్ క్షిపణులతో తమపై విరుచుకుపడిన ఇరాన్‌పై ఇజ్రాయెల్ 25 రోజుల తర్వాత ప్రతీకారం తీర్చుకుంది. సుమారు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇరాన్‌లోని 20 లక్ష్యాలపై వైమానిక దాడులతో విరుచుకుపడింది. శనివారం రాత్రి రెండు గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకూ మూడు గంటల పాటు వంద యుద్ధవిమానాలతో ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తో పాటు ఇలం, ఖుజెస్థాన్‌లలోని

మిగతా 2వ పేజీలో...

నువ్వా.. నేనా

సుదీర్ఘంగా.. సంక్లిష్టంగా.. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ





- అన్ని రాష్ట్రాల మద్దతున్నవారే ప్రెసిడెంట్ కావాలనే లక్ష్యంతో ఎలక్టోరల్ కాలేజీ విధానం.. కానీ స్వింగ్ రాష్ట్రాలే కీలకం
- మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లలో 119 స్వింగ్ రాష్ట్రాలవే
- 2016 ఎన్నికల్లో.. ఆ ఏడు రాష్ట్రాలూ దక్కించుకున్న ట్రంప్
- 2020లో వాటిల్లో ఆరింటిని కైవసం చేసుకున్న జో బైడెన్
- ఈసారి ఆ రాష్ట్రాల్లో ట్రంప్, కమల మధ్య హోరాహోరీ పోరు

పేరుకు అధ్యక్ష ఎన్నికలేగానీ.. అమెరికా ప్రజల ఓట్లు ఎక్కువగా సాధించిన అభ్యర్థి ప్రెసిడెంట్ కారు. ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఎక్కువగా వచ్చిన అభ్యర్థి మాత్రమే శ్వేత సౌధానికి అధిపతి అవుతారు! అదేదో సినిమాలో డైలాగులాగా.. "జనం ఓట్లు ఎన్నొచ్చాయన్నది కాదన్నయ్యా.. ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఎన్నొచ్చాయనేదే లెక్క" అన్నమాట! ఉదాహరణకు.. 2016 ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ కన్నా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌కు 28.6 లక్షల ఓట్లు ఎక్కువ వచ్చాయి! కానీ.. ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఎక్కువ వచ్చిన ట్రంపే అధ్యక్షుడయ్యారు! "విన్నర్ టేక్స్ ఆల్" అనే విధానం వల్ల జరిగే మ్యాజిక్ ఇది. అమెరికాలో అధ్యక్ష అభ్యర్థిని ఎంచుకునే ప్రక్రియ కూడా చాలా సుదీర్ఘంగా ఉంటుంది. ఆ కథాకమామీషూ.. అధ్యక్ష ఎన్నికల్లో సిత్రాలపై ప్రత్యేక కథనం

ఎన్నికలంటే.. ప్రజలే తమ ప్రభువులను ఎన్నుకునే ప్రజాస్వామ్య పండగ! అయితే, ఎన్నికలు ఒక్కో దేశంలో ఒక్కోలా జరుగుతాయి. మనదేశంలో 51 శాతం ఓట్లు వచ్చిన అభ్యర్థి విజయం సాధిస్తే.. అమెరికాలో ఒక రాష్ట్రంలో ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థికి, ఆ రాష్ట్రంలోని ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు మొత్తం దఖలు పడతాయి. అలా ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఎక్కువ వచ్చిన అభ్యర్థి 'అంకుల్ శామ్ (అమెరికన్లు ముద్దుగా తమ అధ్యక్షుణ్ని ఇలాగే పిలుచుకుంటారు. 'మరి ఒక మహిళ ప్రెసిడెంట్ అయితే?' అంటారా అని అడిగితే.. ఇప్పటిదాకా మహిళలెవరూ ప్రెసిడెంట్ కాలేదు కాబట్టి ఆ మీమాంస వారికి రాలేదు. ఈసారి కమలా హ్యారిస్ గెలిస్తే.. ఆ సందేహం వచ్చే అవకాశం ఉంది) అవుతారు. అసలు అధ్యక్ష అభ్యర్థిగా బరిలో ఉండడానికే అక్కడ చాలా పెద్ద తతంగం ఉంటుంది. మనదగ్గర ఎన్నికల షెడ్యూలు వెలువడగానే.. రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తాయి. కానీ.. అమెరికాలో అధ్యక్ష పదవి రేసులో ఉండడానికే సుదీర్ఘ ప్రక్రియ ఉంటుంది. పార్టీ నుంచి ప్రెసిడెన్షియల్ క్యాండిడేట్‌గా పోటీ పడేందుకు ఒకరికన్నా ఎక్కువ మంది ముందుకొస్తే వారిలో ఎవరిని అభ్యర్థిగా ఎంచుకోవాలో నిర్ణయించుకునేందుకు ప్రైమరీలు, కాకస్‌లు నిర్వహిస్తారు. వీటిలో కాకస్ అంటే.. పార్టీ సభ్యులు బృందాలుగా విడిపోయి చర్చలు, ఓట్ల ద్వారా ఉత్తమ అభ్యర్థిని ఎంచుకుంటారు. ప్రైమరీలంటే.. తమకు నచ్చిన అధ్యక్ష అభ్యర్థికి బ్యాలెట్ ద్వారా ఓటు వేసి మద్దతు తెలిపే ప్రక్రియ. ఈ ప్రైమరీలు, కాకస్‌లు ముగిశాక.. ప్రతి పార్టీ అంతర్గతంగా జాతీయ స్థాయి సదస్సు నిర్వహించి తమ అభ్యర్థిని ఎంచుకుని, ప్రకటిస్తుంది. సదరు అధ్యక్ష అభ్యర్థులు.. తమ రన్నింగ్ మేట్‌ను (అంటే ఉపాధ్యక్ష అభ్యర్థిని) ప్రకటిస్తారు. అనంతరం అసలు ఎన్నికల ప్రచారం షురూ అవుతుంది. అన్ని పార్టీల అధ్యక్ష అభ్యర్థులూ దేశమంతా తిరుగుతూ ప్రజల మద్దతు పొందేందుకు ప్రచారం చేస్తారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, దేశ రక్షణ, విదేశాంగ విధానం, తదితర అంశాలపై తమ అభిప్రాయాలు, విధానాలను బహిరంగంగా తెలుపుతారు. ఇందుకోసం ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య మూడు ముఖాముఖీ చర్చలు జరుగుతాయి. ఆ డిబేట్లలో ఆయా అభ్యర్థుల వైఖరి, వారి ఆలోచనసరళి ఆధారంగా చాలా మంది తటస్థులు తాము ఎవరికి మద్దతు ఇవ్వాలో తేల్చుకుంటారు. ఆ తర్వాత అసలు దశ.. నవంబరులో మొదటి సోమవారం తర్వాత వచ్చే మంగళవారం (తొలి మంగళవారం కాదు) పోలింగ్ జరుగుతుంది. ఉదాహరణకు నవంబరు 1వ తేదీ మంగళవారం అయితే.. ఆ నెలలో వచ్చే మొదటి సోమవారం 7వ తేదీ అవుతుంది. అప్పుడు.. అధ్యక్ష ఎన్నికను నవంబరు 8న నిర్వహిస్తారు. అలా ఈసారి నవంబరులో మొదటి సోమవారం తర్వాత వచ్చే మంగళవారం 5వ తేదీ అయ్యింది. కాబట్టి ఆరోజు ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లూ చేశారు.

ఎలక్టర్లకు ఓటు..

ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేసేది నేరుగా అధ్యక్ష, ఉపాధ్యక్షులకు కాదు. రిపబ్లికన్ లేదా డెమోక్రాటిక్ లేదా ఇతర, స్వతంత్ర పార్టీల ప్రతినిధులకు ఓటేస్తారు. ఆ ప్రతినిధులను 'ఎలక్టర్'లంటారు. మనదేశంలో.. జనాభా ఆధారంగా రాష్ట్రాల ఎంపీల సంఖ్య ఉన్నట్టే, అమెరికాలోని 50 రాష్ట్రాలకూ కాంగ్రెస్‌లో ఉన్న ప్రతినిధుల సంఖ్య ఆధారంగా ఎలక్టర్ల సంఖ్య ఉంటుంది. ఉదాహరణకు.. క్యాలిఫోర్నియా రాష్ట్రానికి అత్యధికంగా 55 మంది ఎలక్టర్లున్నారు. టెక్సాస్‌కు 38 మంది ఎలక్టర్లున్నారు. ఇలా 50 రాష్ట్రాలకూ కలిపి మొత్తం 538 మంది ఎలక్టర్లుంటారు. వీరిలో 270 మంది మద్దతు పొందినవారు అధ్యక్ష పీఠాన్ని అధివసిస్తారు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేంటంటే.. మెయిన్, నెబ్రాస్కా రాష్ట్రాలు మినహా మిగతా రాష్ట్రాల్లో విషయంలో గెలిచిన పార్టీకే మొత్తం ఎలక్టోరల్ ఓట్లు దక్కుతాయి (విన్నర్ టేక్స్ ఆల్). ఉదాహరణకు క్యాలిఫోర్నియా ప్రజల్లో సగానికంటే ఎక్కువ మంది డెమొక్రాట్ అభ్యర్థికి ఓటు వేస్తే.. మొత్తం 55 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లూ డెమొక్రాట్ల ఖాతాలో పడిపోయినట్టే. దీనివల్ల.. ఓట్లు ఎక్కువ వచ్చినా కొందరు అభ్యర్థులు అధ్యక్షులు కాలేకపోయారు. 2000 సంవత్సరంలో అల్‌గోర్, 2016లో హిల్లరీ ఇలాగే ప్రజల ఓట్లు ఎక్కువ వచ్చినా, ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు తక్కువ రావడంతో పరాజితులుగా మిగిలిపోయారు.

కంచుకోటలు..

మనదగ్గర పార్టీలకు కంచుకోటలుగా పేరుబడిన నియోజకవర్గాలు ఉన్నట్టే.. అమెరికాలో కూడా కొన్ని రాష్ట్రాలు డెమొక్రాట్లకు, కొన్ని రాష్ట్రాలు రిపబ్లికన్లకు కంచుకోటల్లా పేరొందాయి. అలా ఏ పార్టీవైపు ఇదమిత్థంగా మొగ్గుచూపని రాష్ట్రాలు ఏడున్నాయి. వాటిని 'స్వింగ్' రాష్ట్రాలంటారు. శ్వేతసౌధంలో ఎవరు కూర్చోవాలో నిర్ణయించే ఆ ఏడు రాష్ట్రాలూ.. ఫ్లోరిడా (29), పెన్సిల్వేనియా (20), ఒహాయో (18), మిషిగన్ (16), ఉత్తర కరొలినా (15), అరిజోనా (11), విస్కాన్సిన్ (10). ఈ ఏడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 119 ఎలక్టోరల్ ఓట్లు ఉన్నాయి. అయోవా (6) కూడా అలాంటిదే. ఈ రాష్ట్రాల్లో పోలింగ్ డీ అంటే డీ అన్నట్టుగా ఉంటుంది. దీని వల్ల అక్కడ ఓట్ల లెక్కింపు కూడా బాగా ఆలస్యమవుతుంటుంది. 2016 ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడు రాష్ట్రాల్లోనూ క్లీన్‌స్వీప్ చేశారు. మిగతా రాష్ట్రాల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్ గట్టి ప్రభావం చూపినా.. ఈ ఏడు రాష్ట్రాల్లోని 119 ఎలక్టోరల్ ఓట్లను కోల్పోవడం ద్వారా అధ్యక్ష పీఠానికి దూరమయ్యారు. ట్రంప్ కంటే ఆమెకు 28.68 లక్షల ఓట్లు అధికంగా వచ్చినా.. విజయానికి కావలసిన 270 ఎలక్టరల్ ఓట్లు పొందడంలో విఫలమయ్యారు. ఈసారి స్వింగ్ రాష్ట్రాల్లో కమల, ట్రంప్ మధ్య పోరు హోరాహోరీగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సుదీర్ఘంగా..

అధ్యక్ష ఎన్నికలు జరిగిన తీరు ఆధారంగా.. గెలిచేది ఎవరనే విషయంపై రాజకీయ విశ్లేషకులు 24 గంటల్లోనే ఒక నిర్ణయానికి వస్తారు. కానీ.. అధికారికంగా కొంత ప్రక్రియ మిగిలే ఉంటుంది. అది నవంబరు రెండోవారం నుంచి డిసెంబరు రెండో వారం దాకా జరుగుతుంది. డిసెంబరులో రెండో బుధవారం తర్వాత వచ్చే సోమవారంనాడు (ఈ ఏడాది అది డిసెంబరు 16 అయింది) ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు (ఎలక్టర్లు) తమతమ రాష్ట్రాల్లో సమావేశమై అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులకు ఓటేస్తారు. అంటే.. అధ్యక్ష అభ్యర్థిని నేరుగా ఎంచుకునే ప్రక్రియ జరిగేది ఆ రోజన్నమాట. ఎలక్టర్లు ఓటు వేసిన 9 రోజుల లోపు ఆ ఓట్లన్నీ (సర్టిఫికెట్స్ ఆఫ్ ఓట్స్) సెనెట్ అధ్యక్షుడికి చేరాలి. జనవరి 6న.. మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించే కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ఎలక్టోరల్ ఓట్లను లెక్కించి, విజేత ఎవరో సెనేట్ అధ్యక్షుడు ప్రకటిస్తారు. జనవరి 20న అధ్యక్ష, ఉపాధ్యక్షులు బాధ్యతలు స్వీకరిస్తారు. అప్పుడు కొత్త ప్రెసిడెంట్.. 'రాజు వెడలె రవితేజములలరగ..' అన్న చందంగా సగర్వంగా శ్వేతసౌధంలోకి అడుగుపెడతారు.

- సెంట్రల్ డెస్క్

ముందస్తు ఓటింగ్

అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగేది నవంబరులో మొదటి సోమవారం తర్వాత వచ్చే మంగళవారమే! కానీ.. దానికి నెలన్నర ముందు నుంచే 'ఎర్లీ ఓటింగ్' పేరుతో ముందస్తుగా ఓటు వేసే అవకాశాన్ని పౌరులకు కల్పిస్తారు. ఈ 'ముందస్తు ఓటింగ్ రెండు రకాలుగా జరుగుతుంది. ఒకటి.. మెయిల్ బ్యాలెట్ల ద్వారా, రెండోది మామూలు పోలింగ్ కేంద్రాల ద్వారా. ఈసారి అక్టోబరు 20 నాటికే 2.1 కోట్ల మంది అమెరికన్లు ముందస్తుగా ఓటును వినియోగించుకోవడం విశేషం.

లోకం తీరు



అధ్యక్షుడు+ఉపాధ్యక్షుడు= టికెట్

ఇద్దరు వ్యక్తులను కలిపి చెప్పడానికి మనం 'ద్వయం' అన్నట్టే.. అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులిద్దరినీ కలిపి 'టికెట్'గా వ్యవహరిస్తారు!

కుబేరులు.. అటూ ఇటూ!

పారిశ్రామికవేత్తలు, బాగా డబ్బున్న వ్యాపారులు రాజకీయ పార్టీలకు విరాళాలు ప్రకటించడం మనకు కొత్తేం కాదు! అమెరికాలోనూ అంతే. టెస్లా, స్పేస్ఎక్స్ వంటి సంస్థలతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అపర కుబేరుడు ఈలన్ మస్క్ రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌కు మద్దతుతో పాటు ఆర్థిక సాయమూ ప్రకటిస్తే.. మరో కుబేరుడు, మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కమలకు పరోక్ష మద్దతు ప్రకటించారు. వీరే కాదు.. ఎంతోమంది బిలియనీర్లు వీరిద్దరిలో తమకు నచ్చినవారికి మద్దతుగా విరాళాలిచ్చారు. అయితే, ట్రంప్‌తో పోలిస్తే.. ఎక్కువ మంది బిలియనీర్ల మద్దతు కమలాహ్యారిస్‌కే ఉండడం గమనార్హం. ఫోర్బ్స్ ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 81 మంది కోటీశ్వరుల మద్దతు కమలకు ఉండగా, ట్రంప్‌కు ఆర్థికంగా అండగా నిలుస్తున్న కుబేరులు 51 మంది దాకా ఉన్నారు. కమలకు మద్దతిస్తున్న బిలియనీర్లలో 28 మంది కనీసం 10 లక్షల డాలర్లు ఆమెకు విరాళంగా ప్రకటించారు. ఆమెకు మద్దతుగా ఉన్నవారిలో ప్రపంచ ప్రఖ్యాత సినీ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బెర్గ్ కూడా ఉండడం విశేషం. ఇక ట్రంప్‌కు మద్దతుగా నిలిచిన కోటీశ్వరుల్లో 26 మంది ఆయనకు 10 లక్షల డాలర్లు అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చారు. ఆయనకు ఈలన్ మస్క్, మిరియం అడెల్సన్, డిక్ యుహ్లీన్ అనే ముగ్గురు కోటీశ్వరుల నుంచి వచ్చిన విరాళమే 22 కోట్ల డాలర్లు కావడం గమనార్హం. అమెరికాలోని 971 మంది పెట్టుబడిదారులైన మిలియనీర్లు, బిలియనీర్లను ప్రశ్నించగా.. వారిలో 57 శాతం మంది కమల వైపు మొగ్గుచూపారు. 43 శాతం మందే ట్రంప్ కావాలన్నారు.

రూ.5,323 కోట్లు!

కమలా హ్యారిస్ ఫండ్‌రైజింగ్ కమిటీ ఇప్పటిదాకా ఆమె ఎన్నికల ప్రచారం కోసం జూలై నుంచి సెప్టెంబరు చివరినాటికి 63.3 కోట్ల డాలర్ల విరాళాలు సేకరించాయి. అంటే మన కరెన్సీలో దాదాపు రూ.5323 కోట్లు. అంతకుముందు బైడెన్ అభ్యర్థిగా ఉన్న సమయంలో వచ్చిన విరాళాలను కూడా కలుపుకొంటే ఆ మొత్తం దాదాపుగా రూ.8 వేల కోట్లు. అదే సమయంలో.. ట్రంప్ నిధుల సేకరణ 14.5 కోట్ల డాలర్లే. అంటే.. దాదాపు రూ.3,090 కోట్లే!!

వీళ్లూ ఉన్నారు

అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నవారిలో ట్రంప్, కమలా హ్యారిసే కాదు.. వేరే పార్టీలకు చెందినవారు, స్వతంత్రులు కూడా ఉన్నారు. గ్రీన్ పార్టీకి చెందిన జిల్ స్టీన్, లిబర్టేరియన్ పార్టీకి చెందిన చేజ్ ఒలివర్ వంటివారు కూడా ఉన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ తమ్ముడి కుమారుడు రాబర్ట్ ఎఫ్ కెనెడీ జూనియర్ స్వతంత్ర అభ్యర్థిగా నిలిచారు. కానీ, ఆ తర్వాత ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు.

ఔషధం కాదు.. విషం!

- కాల్షియం, విటమిన్ డీ3, పారాసిటమాల్ మాత్రలు నాసిరకం
- 49 మందులు నాణ్యత పరీక్షల్లో విఫలం: సీడీఎస్‌సీవో

న్యూఢిల్లీ, అక్టోబరు 26: అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడాల్సిన ఔషధాలు ఇప్పుడు విషంగా మారి ప్రజలు ప్రాణాలు తీస్తున్నాయి. దేశంలో నాసిరకం, నకిలీ మందులు విచ్చలవిడిగా చెలామణీ అవుతున్నాయి. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులకు సాధారణంగా వేసుకొనే పారాసిటమాల్ మాత్రల నుంచి కాల్షియం సప్లిమెంట్లు, విటమిన్ ట్యాబ్లెట్ల వరకూ నాసిరకంగానే ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా సేకరించిన దాదాపు 3వేల ఔషధాల నమూనాల్లో 49 మందులు నాణ్యతా ప్రమాణాలకు తగినట్లుగా లేవని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) వెల్లడించింది. సెప్టెంబరు నెలకు సంబంధించిన క్వాలిటీ రిపోర్టును ఆ సంస్థ తాజాగా విడుదల చేసింది. నిర్ధారించిన నాణ్యతా ప్రమాణాలు లేని మందుల్లో నొప్పి నివారణకు విస్తృతంగా వినియోగించే పారాసిటమాల్ ట్యాబ్లెట్లు (కర్ణాటక యాంటీబయాటిక్స్ అండ్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్), మెట్రోనిడాజోల్ (హిందుస్తాన్ యాంటీబయాటిక్స్), డెంపెరిడోన్ (రెయిన్‌బో లైఫ్ సైన్సెస్) ట్యాబ్లెట్లతో పాటు ఆక్సిటోసిన్ (పుష్కర్ ఫార్మా) ఇంజెక్షన్లు ఉన్నాయి. వీటితో పాటు మెట్‌ఫార్మిన్ (స్విస్ బయోటెక్ పేరెంటరల్స్), కాల్షియం 500 ఎంజీ, విటమిన్ డీ3 (లైఫ్ మాక్స్ క్యాన్సర్ లేబొరేటరీస్), పీఏఎన్ 40 (అల్కెమ్ ల్యాబ్స్) మాత్రలు సైతం ఈ జాబితాలో ఉన్నాయి. ఎక్కువ మంది వినియోగించే మందులు నాణ్యతా ప్రమాణాలు అందుకోవడంలో విఫలం కావడంపై సీడీఎస్‌సీవో ఆందోళన వ్యక్తం చేసింది. నాసిరకంగా ఉన్నట్లు గుర్తించిన ఈ 49 మందులను రీకాల్ చేసినట్లు పేర్కొంది. మరోవైపు వైద్యులు సాధారణంగా సూచించే కాల్షియం సప్లిమెంట్ షెల్కాల్ 500, యాంటాసిడ్ పీఏన్ డీ, ప్రొస్టేట్ చికిత్సలో ఉపయోగించే యూరిమాక్స్-డీ, ఆస్టియోపోరోసిస్ బాధితులకు ఇచ్చే డెకా-డ్యూరబోలిన్ 25 ఇంజెక్షన్ నకిలీవని సీడీఎస్‌సీవో నివేదిక తెలిపింది.

బాంబు బెదిరింపులకు వేదికగా నిలవొద్దు

- విమానాలకు బెదిరింపుల నేపథ్యంలో సోషల్ మీడియాకు కేంద్రం సూచనలు

న్యూఢిల్లీ, అక్టోబరు 26: విమానాలకు బాంబు బెదిరింపులు తామరతంపరగా పెరిగిపోతున్న నేపథ్యంలో సోషల్ మీడియా కంపెనీలకు కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ శనివారం పలు సూచనలు జారీ చేసింది. నకిలీ బెదిరింపుల వంటి తప్పుడు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తమ వేదికలపై నుంచి తొలగించాలని పేర్కొంది. షేరింగ్, ఫార్వర్డ్, రీపోస్ట్, రీట్వీట్ వంటి ఆప్షన్ల వల్ల కూడా బెదిరింపులు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని, కాబట్టి, ఈ తరహా సమాచారం ఇతరులకు అందుబాటులో లేకుండా చూడాలని తెలిపింది. సదరు బెదిరింపులు భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి వ్యతిరేకమైనవని, సోషల్ మీడియా ద్వారా అటువంటి నేరాలకు పాల్పడే వ్యక్తుల వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐటీ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, తమ వద్ద ఉన్న సమాచారాన్ని వీలైనంత తొందరగా (72గంటల్లోపు) దర్యాప్తు సంస్థలకు అందజేయాలని పేర్కొంది. ఖాతాదారుల పోస్టులకు బాధ్యత వహించాల్సిన అవసరం లేకుండా సోషల్ మీడియా సంస్థలకు ఐటీ చట్టం, 2021 రక్షణ కల్పిస్తున్న విషయాన్ని కేంద్రం ఈ సూచనల్లో ప్రస్తావించింది. అయితే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వేదికగా నిలుస్తున్నప్పుడు ఈ రక్షణ ఉండదని, అటువంటప్పుడు ఆయా సంస్థలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

నవంబరు 26న పార్లమెంటు ప్రత్యేక భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 26: కేంద్ర ప్రభుత్వం నవంబరు 26న పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి నవంబరు 26 నాటికి 75 వసంతాలు పూర్తవుతున్న నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ ఉమ్మడి సమావేశం జరగనుంది. ఈ మేరకు శనివారం కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. నవంబరు 26న పార్లమెంటులోని సంవిధాన్ సదాన్‌లో ఉభయ సభల సంయుక్త సమావేశం జరగనుందని అధికారులు తెలిపారు. 1949 నవంబరు 26న భారత రాజ్యాంగాన్ని ఆమోదించగా 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125వ పుట్టిన రోజు 2015 ఏప్రిల్ 14 సందర్భంగా నవంబరు 26ను జాతీయ న్యాయదినోత్సవంగా కేంద్రం ప్రకటించింది.

అక్రమంగా ఉంటున్న భారతీయుల్ని వెనక్కి పంపిన అమెరికా

వాషింగ్టన్, అక్టోబరు 26: అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను ఒక చార్టర్డ్ విమానంలో భారత్‌కు పంపినట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) వెల్లడించింది. అక్టోబరు 22న వీరిని వెనక్కి పంపామని, భారత ప్రభుత్వ సహకారంతోనే ఇది జరిగిందని శుక్రవారం పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 1.60 లక్షలకు పైగా అక్రమ వలసదారులను డీహెచ్‌ఎస్ వెనక్కి పంపింది. అక్రమ వలసదారులను వెనక్కి పంపడానికి 145కి పైగా దేశాలకు 495కి పైగా అంతర్జాతీయ విమానాలను వినియోగించింది. భారత్‌తోపాటు కొలంబియా, ఈక్వెడార్, పెరూ, ఈజిప్ట్, మారిటానియా, సెనెగల్, ఉజ్బెకిస్థాన్, చైనా వంటి దేశాలకు చెందిన వారిని డీహెచ్‌ఎస్ వెనక్కి పంపింది. అక్రమ వలసలను తగ్గించడానికి అమెరికా తీసుకుంటున్న చర్యల్లో ఇదీ ఒకటిగా ఉంది.

ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా అనంత్‌నాథ్

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా కారవాన్ మ్యాగజీన్ ఎడిటర్ అనంత్‌నాథ్ వరుసగా రెండోసారి ఏకపక్షంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధానకార్యదర్శిగా మాజీ ఔట్‌లుక్ ఎడిటర్ రూబెన్ బెనర్జీ, ట్రెజరర్‌గా ది ట్రిబ్యూన్ మాజీ సీనియర్ అసోసియేట్ ఎడిటర్ కేవీ ప్రసాద్ ఎన్నికైనట్లు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

ఇరాన్‌లో పోలీసు కాన్వాయ్‌పై దాడి

- 10 మంది అధికారుల మృతి

దుబాయి, అక్టోబరు 26 : ఇరాన్ దక్షిణ ప్రాంతంలోని బలూచ్ ప్రావిన్స్‌లో పోలీసుల కాన్వాయ్‌పై శనివారం జరిగిన దాడిలో 10 మంది అధికారులు మృతి చెందారు. ఇరాన్ రాజధాని టెహరాన్‌కు 1,200 కిలో మీటర్ల దూరంలోని గోహర్ కు ప్రాంతంలో ఈ దాడి జరిగింది. రెండు భద్రతా సిబ్బంది వాహనాలను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరగడంతో వాటిలోని వారు మృతి చెందినట్లు సమాచారం. ఈ దాడి చేసిందెవరో తెలియలేదు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ శనివారం తెల్లవారు జాము నుంచి దాడులు ప్రారంభించిన తర్వాత ఈ ఘటన జరగడం గమనార్హం.

ఇజ్రాయెల్ ప్రతీకారం

(మొదటి పేజీ తరువాయి)

క్షిపణి, డ్రోన్ తయారీ, ప్రయోగ కేంద్రాలు, సైనిక స్థావరాలపై అత్యాధునిక ఎఫ్-35 యుద్ధ విమానాలతో బీభత్సం సృష్టించింది. తొలుత ఇరాన్ రాడార్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను దెబ్బతీసి ఆ తర్వాత క్షిపణి తయారీ కర్మాగారాలపై ఏకధాటిగా బాంబులు కురిపించిన విమానాలు తిరిగి సురక్షితంగా ఇజ్రాయెల్ చేరుకున్నాయి. అనంతరం ఇరాన్‌పై తమ 'డేస్ ఆఫ్ రెపెంటెన్స్' ఆపరేషన్ ముగిసిందని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డానియల్ హగరి ప్రకటించారు. ఇరాన్ ప్రతిదాడి చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరాన్‌పై దాడికి ముందే ఇజ్రాయెల్ అమెరికాకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా, ఇరాన్‌పై దాడిలో నలుగురు మహిళా పైలట్లు పాల్గొన్నారు.

ప్రతిదాడి చేస్తామన్న ఇరాన్

గాఢ నిద్రలో ఉండగా ఇజ్రాయెల్ ఒక్కసారిగా జరిపిన దాడులతో ఇరాన్ ఉలిక్కిపడింది. ఇంతలోనే తేరుకుని.. ఇజ్రాయెల్ వైమానిక దాడులను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ అడ్డుకోవడం వల్లే నష్టం పరిమిత స్థాయిలో జరిగిందని తెలిపింది. దాడుల్లో తమ దేశానికి చెందిన ఇద్దరు సైనికులు అమరులయ్యారని ఇరాన్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌పై ప్రతిదాడి తప్పదని, సరైన సమయంలో దాడి చేస్తామని తెలిపింది. తమ దేశ ప్రయోజనాలను కాపాడుకునే విషయంలో హద్దులు చూడకుండా, ఎందాకైనా వెళ్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ స్పష్టం చేశారు. వాస్తవానికి తాము అక్టోబరు ఒకటిన జరిపిన దాడికి ఇజ్రాయెల్ తప్పకుండా ప్రతిదాడి చేస్తుందని ఊహించిన ఇరాన్ ముందస్తుగా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను సిద్ధం చేసుకుంది. వైమానిక దళాలను కూడా అప్రమత్తం చేసింది. అయినా ఊహించని రీతిలో ఇజ్రాయెల్ అర్ధరాత్రి వేళ మెరుపుదాడి చేసింది.

పరిమిత దాడితో సరిపెట్టిన ఇజ్రాయెల్

ఇరాన్‌లోని చమురు క్షేత్రాలు, అణు స్థావరాల జోలికి పోకుండా ఇజ్రాయెల్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. కేవలం సైనిక స్థావరాలు, క్షిపణి, డ్రోన్ తయారీ కేంద్రాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించింది. దీంతో పౌరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తపడింది. అమెరికా ఎన్నికల వేళ కావడంతో ఇజ్రాయెల్ చమురు క్షేత్రాలను లక్ష్యం చేసుకోలేదని విశ్లేషకులు చెబుతున్నారు. చమురు క్షేత్రాలను లక్ష్యంచేసుకుంటే చమురు ధరలు పెరిగి అమెరికా, యూరప్ దేశాలకు సంకటంగా మారే అవకాశం ఉండటంతో ప్రస్తుతానికి ఇజ్రాయెల్ సంయమనం పాటించిందని చెబుతున్నారు.

'ఆపరేషన్ ఒపేరా'ను గుర్తు చేసిన తాజా దాడి

ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడిని ఇరాక్‌పై 1981లో జరిపిన 'ఆపరేషన్ ఒపేరా'ను గుర్తు చేసింది. 1981 జూన్ ఏడున ఇరాక్‌లో 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒసిరాక్ న్యూక్లియర్ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ ఎఫ్-16ఏ యుద్ధ విమానాలు ధ్వంసం చేశాయి. జూన్ 7న సాయంత్రం 4 గంటలకు ఆపరేషన్ ప్రారంభించి గంటన్నరలో అంటే ఐదున్నరకల్లా టార్గెట్‌ను ధ్వంసం చేసి ఎదురుదాడిని తప్పించుకుని సురక్షితంగా ఇజ్రాయెల్ చేరుకున్నాయి. ఇరాన్‌పై తాజా దాడిని కూడా ఐడీఎఫ్ అత్యంత చాకచక్యంగా నిర్వహించింది. 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇరాన్ లక్ష్యాలపై ఎఫ్-35 యుద్ధ విమానాలు 3 గంటల పాటు బాంబుల వర్షం కురిపించి సురక్షితంగా ఇజ్రాయెల్ చేరుకున్నాయి. కాగా, ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడి నేపథ్యంలో హెజ్‌బొల్లా కన్నెర్ర చేసింది. ఇజ్రాయెల్ హైఫా సమీపంలోని క్రయోట్‌లో ఉన్న జనావాసాలపై రాకెట్ల వర్షం కురిపించింది.



ఇరాన్‌పై దాడిలో పాల్గొన్న ఇజ్రాయెల్ మహిళా పైలట్

ఇజ్రాయెల్ దాడిపై దేశాల మిశ్రమ స్పందన

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడిపై ప్రపంచదేశాల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. దాడిని కొన్ని దేశాలు ఖండించగా మరికొన్ని సమర్థించాయి.

అన్ని వర్గాలు సంయమనం పాటించాలి. చర్చలు, దౌత్యమార్గాల ద్వారా పరిష్కారానికి యత్నించాలి - భారత్

తమ పౌరుల ఆత్మరక్షణార్థం దాడి జరిపేందుకు ఇజ్రాయెల్‌కు హక్కు ఉంది. తాజా ఆపరేషన్‌లో మేము పాల్గొనలేదు. ఇరాన్ ప్రతిదాడి జరపకపోవడమే మంచిది - అమెరికా

ఇరాన్ దురాక్రమణనుంచి తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది. ఇరాన్ ప్రతి దాడి ఆలోచనలు చేయవద్దు - బ్రిటన్

ఉద్రిక్తతలను పెంచే చర్యలు ఇరాన్ చేపట్టవద్దు. అప్పుడే మధ్యప్రాచ్యంలో శాంతియుత పరిస్థితులు నెలకొంటాయి - జర్మనీ

ఉద్రిక్తతలు పెరగకుండా అన్ని పక్షాలూ సంయమనం పాటించాలి - ఫ్రాన్స్

దాడి ఆందోళన కలిగిస్తోంది. అన్ని వర్గాలు సంయమనం పాటించాలి - రష్యా

మధ్య ప్రాచ్యంలో ఘర్షణలు తీవ్రతరం కావడాన్ని ఆమోదించబోం - సౌదీ అరేబియా

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇజ్రాయెల్ చర్యలు ఈ ప్రాంతాన్ని యుద్ధంలోకి నెట్టేశాయి - టర్కీ

ఉద్రిక్తతలు తగ్గించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలి - ఈజిప్ట్

మధ్యప్రాచ్యంలో సుస్థిరత కోసం అంతర్జాతీయ స్థాయిలో చర్యలు తీసుకోవాలి. గాజా, లెబనాన్‌లో తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలి - ఇరాక్

తాజా ఉద్రిక్తతలకు ఇజ్రాయెలే కారణం. వెంటనే ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశం ఏర్పాటు చేసి మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరతల కోసం చర్యలు తీసుకోవాలి - పాకిస్థాన్

ఇజ్రాయెల్ దాడి ద్వారా ఇరాన్ సార్వభౌమాధికారానికి విఘాతం కలిగింది - హమాస్

గళమెత్తిన బంగ్లా హిందువులు



చిట్టగాంగ్‌లో వేలాదిమందితో భారీ ర్యాలీ

- మైనారిటీల హక్కుల రక్షణకు ఆందోళన
- తాత్కాలిక ప్రభుత్వానికి 8 డిమాండ్లు

ఢాకా, అక్టోబరు 26: రాజకీయ సంక్షోభంతో అధికారం చేతులు మారిన బంగ్లాదేశ్‌లో.. హిందువులు గళమెత్తారు. షేక్ హసీనా ప్రభుత్వం అనంతరం తొలిసారి భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది శుక్ర, శనివారాల్లో చిట్టగాంగ్‌లోని వీధుల్లోకి వచ్చారు. మైనారిటీల హక్కులను పరిరక్షించాలని నినాదాలు చేశారు. సనాతన జాగరణ మంచ్ ఆధ్వర్యంలో సాగిన ఈ ఆందోళనలో మొహమ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వానికి తమ భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు సహా 8 డిమాండ్లు విధించారు. మైనారిటీలపై దాడులకు పాల్పడినవారిని త్వరగా శిక్షించేందుకు ట్రైబ్యునల్ ఏర్పాటు, అల్లర్ల బాధితులకు పరిహారం, పునరావాసం కల్పన, మైనారిటీల రక్షణ చట్టం, విద్యా సంస్థలు, వసతి గృహాల్లో మైనారిటీలు ప్రార్థనలు-పూజలు చేసుకునేందుకు ప్రత్యేక వసతులు, హిందూ, బుద్ధిస్ట్, క్రిస్టియన్ సంక్షేమ ట్రస్ట్‌ల బలోపేతం బంగ్లా మైనారిటీల ప్రధాన డిమాండ్లు. దుర్గా పూజ ఉత్సవాలకు ఐదు రోజుల సెలవు, సంస్కృతం, పాలీ విద్యల బోర్డును ఆధునికీకరించాలని కోరుతున్నారు. కాగా, ఆగస్టు 5న హసీనా ప్రభుత్వం పడిపోయాక ఆందోళనకారులు బంగ్లాదేశ్‌లోని మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. చర్యలు తీసుకుంటామని తాత్కాలిక ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఇటీవలి కాలంలో ఆస్తుల లూటీతో పాటు భౌతిక దాడులూ పెరిగిపోయాయి. కాగా, బంగ్లా హిందువులు అక్కడి నుంచి పారిపోకూడదని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే అన్నారు. వారి రక్షణకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. బంగ్లా హిందువుల భద్రతకు ఐక్యరాజ్యసమితి హామీ ఇవ్వాలని కోరారు

2 నుంచి సాగర్-శ్రీశైలం లాంచీ!



లాంచీ ప్రయాణం సాగే మార్గంలో కృష్ణా నది అందాలు

» ఉదయం 10 గంటలకు తొలి లాంచీ

» పర్యాటకశాఖ అధికారుల సన్నాహాలు

నాగార్జునసాగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీ నుంచి ఏపీలోని నంద్యాల జిల్లా శ్రీశైలం వరకు నీటిపై లాంచీ ప్రయాణం నవంబరు 2 నుంచి షురూ కానుంది. ఆ రోజు ఉదయం 10 గంటలకు తొలి లాంచీ సాగర్ నుంచి శ్రీశైలం బయలుదేరుతుంది. ఇందుకోసం పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 550 అడుగులకు పైగా నీరు ఉన్నప్పుడు మాత్రమే లాంచీలు నడుస్తాయి. ప్రస్తుతం 589 అడుగుల నీటి నిల్వ ఉండటంతో లాంచీ ప్రయాణానికి వీలు ఏర్పడింది. పర్యాటకులను సాగర్ హిల్‌కాలనీ లాంచీస్టేషన్ నుంచి శ్రీశైలం వరకు, శ్రీశైలం నుంచి సాగర్‌కు (ఏదో ఒక వైపు) లాంచీలో తీసుకెళ్తారు. దీనికి గానూ పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ. 1600 వసూలు చేస్తారు. రెండు వైపులా పెద్దలకు రూ. 3వేలు, పిల్లలకు రూ. 2400గా టికెట్ వసూలు చేస్తారు. ఈ ప్యాకేజీలో లాంచీలో కేవలం మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తారు. నవంబరు 2 నుంచి ప్రారంభమయ్యే ఈ లాంచీ ప్రయాణ అవకాశాన్ని భక్తులు, పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని పర్యాటకశాఖ మార్కెటింగ్ జీఎం అంజిరెడ్డి కోరారు. ఈ నెల 28 నుంచి టికెట్లను బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పర్యాటక శాఖ కార్యాలయం హైదరాబాద్ సమాచార కేంద్రం నంబరు 9848540371 లేదా సాగర్ లాంచీ స్టేషన్ నంబరు 7997951023ను గానీ సంప్రదించవచ్చని సూచించారు.

డిసెంబరులో 'యాదాద్రి' 3 యూనిట్లలో వెలుగులు

» కేంద్ర విద్యుత్ అథారిటీ వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం(వైటీపీసీ)లోని మూడు యూనిట్లు డిసెంబరులో అందుబాటులోకి రానున్నాయని కేంద్ర విద్యుత్ అథారిటీ(సీఈఏ) నివేదిక వెల్లడించింది. చెరో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1, 2లలో నవంబరులో ట్రయల్‌రన్ ప్రారంభం కానుందని, ఆ తర్వాత డిసెంబరులో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో ట్రయల్ రన్ ప్రారంభమవుతుందని ప్రకటించింది. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదుయూనిట్లు కలుపుకొని మొత్తం 4వేల మెగావాట్ల సామర్థ్యంతో నల్లగొండలోని దామరచర్లలో వైటీపీసీ నిర్మాణం జరుగుతున్న విషయం విదితమే. రాష్ట్రంలో జెన్‌కో థర్మల్ సామర్థ్యం 4042.5 మెగావాట్లు కాగా.. డిసెంబరు కల్లా అదనంగా మూడు యూనిట్లు చేరితే 6442.5 మెగావాట్లకు చేరనుంది. అన్ని యూనిట్లు పూర్తయితే 8042 మెగావాట్లకు చేరుతుంది. రాష్ట్రంలోని థర్మల్ ప్లాంట్లు అన్ని కలిపితే 4042 మెగావాట్లుగా ఉండగా... ఒక్క యాదాద్రిలోనే 4 వేల మెగావాట్ల ప్లాంట్ కడుతుండటం గమనార్హం.

పండుగ వాతావరణంలో టీడీపీ సభ్యత్వ నమోదు

హైదరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం పండుగ వాతావరణంలో ప్రారంభమైంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు.. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి 2024-26కు పార్టీ సభ్యత్వ నమోదును వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సమన్వయ కర్త కంభంపాటి రామ్మోహన్‌రావు, జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న, రాష్ట్ర నాయకులు కాట్రగడ్డ ప్రసూన, బండి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి సరఫరాపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబరు

» త్వరలో అందుబాటులోకి: సీతక్క

» మిషన్ భగీరథ పథకంపై అధికారులతో మంత్రి సమీక్ష

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీళ్లపై ప్రజలకు నమ్మకం కలిగించాలని అధికారులకు మంత్రి సీతక్క సూచించారు. ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో అధికారులతో మంత్రి సీతక్క శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా గ్రామీణ మంచి నీటి సరఫరా వ్యవస్థపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎక్కడా తాగు నీటి సరఫరాలో సమస్య రానీయకూడదని ఆదేశించారు. మంచినీటి సరఫరాపై ఫిర్యాదులకు త్వరలో టోల్ ఫ్రీ నెంబరు అందుబాటులోకి తెస్తామని సీతక్క తెలిపారు. వేల కోట్లు ఖర్చుపెట్టిన తర్వాత బోర్లు, ఆర్వో ప్లాంట్లపై ప్రజలు ఆధారపడుతున్నారని ఆ విధానం పోయేలా మిషన్ భగీరథ సిబ్బంది పని చేయాలన్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి

» జంతర్‌మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం మహాధర్నా

న్యూఢిల్లీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టాలని బీసీ నేతలు డిమాండ్ చేశారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి బీసీలకు చట్టసభలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ జంతర్‌మంతర్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో మాజీ ఎంపీలు ఆర్.కృష్ణయ్య, వీహెచ్, రాపోలు ఆనంద్ భాస్కర్‌తో పాటు కాంగ్రెస్ నేత రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రైవేటు రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని వీహెచ్ డిమాండ్ చేశారు. బీసీలకు మాత్రం చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని 30 ఏళ్లుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని రాపోలు ఆనంద్‌భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అములు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వానరాలపై విష ప్రయోగం ?

» వేములవాడలో ఒకే చోట 50 కోతుల కళేబరాలు లభ్యం

వేములవాడ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఘోరం జరిగింది. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని పొదల్లో ఒకే చోట సుమారు 50 కోతుల కళేబరాలు శుక్రవారం కనిపించాయి. గుర్తుతెలియని వ్యక్తులు విష ప్రయోగం చేసి కోతులను హతమార్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోతుల మృతిపై గౌతమ్ అనే జంతు ప్రేమికుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. కోతుల కళేబరాలకు పోస్టుమార్టం చేయించి, ఖననం చేశారు.

జ్వరంతో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

» కుటుంబీకుల ఆందోళన

ఇంద్రవెల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జ్వరంతో ఓ విద్యార్థిని మృతి చెందింది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. అయితే మృతికి పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకులు ఆందోళనకు దిగారు. ఇంద్రవెల్లి మండలం వాల్గోడకు చెందిన మడావి గంగోత్రి(14) ఇంద్రవెల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. శుక్రవారం స్కూల్‌లో నిర్వహించిన పరీక్షలు రాసింది. సాయంత్రం వేళ ఆమెకు జ్వరంతో పాటు విరేచనాలు కావడంతో శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్‌లోకి రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందింది. విషయం తెలిసి విద్యార్థిని కుటుంబీకులు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నేతలతో కలసి ఘటనా స్థలికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఐటీడీఏ ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్ వాహనాన్ని అడ్డుకున్నారు. అక్కడికి చేరుకున్న ఉట్నూర్ పోలీసులు ఆదివాసీ సంఘాల నేతలకు సర్ది చెప్పారు. మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తానని, ఐటీడీఏ ద్వారా 2 లక్షల సబ్సిడీ రుణం మంజూరు చేస్తామని ఐటీడీఏ ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ లిఖిత పూర్వక హామీనిచ్చారు. ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో మృతురాలి కుటుంబీకులు ఆందోళన విరమించారు.

అక్టోబరులోనూ అదే తీరు

(మొదటి పేజీ తరువాయి)

విషయానికి వస్తే.. 2023-24 ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 11.52 లక్షల దస్తావేజులు రిజిస్టర్ కాగా 2024లో ఇదే కాలంలో 10.16 లక్షల దస్తావేజులు రిజిస్టర్ అయ్యాయి. ఆదాయం విషయానికి వస్తే 2023-24 ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు రూ.8,451.09 కోట్లు రాగా ఈ ఏడాది ఇదే కాలంలో రూ.8,213.81 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాదితో పోల్చితే రాబడి రూ.237.28 కోట్లు తగ్గింది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఏడు నెలలకు రిజిస్ట్రేషన్లతో నిర్దేశించుకున్న రాబడి లక్ష్యం రూ.9,936 కోట్లు కాగా.. వచ్చిన ఆదాయం రూ..8,213.81 కోట్లు మాత్రమే. అంటే లక్ష్యంలో రూ.1,722.19 కోట్ల మేర లోటు ఏర్పడిందన్నమాట. రిజిస్ట్రేషన్లు తగ్గడానికి ఆ శాఖ అధికారులు పలు కారణాలు చెబుతున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కనున్న జిల్లాల్లో అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగేవని.. హైడ్రా రంగ ప్రవేశం నేపథ్యంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సమస్యలులేకుండా కొనుగోలు చేయాలనే కారణంతో ఆచితూచి వ్యవహరిస్తుండటం, విదేశాల్లో ఉంటున్న తెలుగువారు చేసుకునే రిజిస్ట్రేషన్లతో గతంతో పోల్చితే ఈ ఏడాది కొంత మేర తగ్గడం, బ్యాంకుల గృహరుణాల వడ్డీలు పెరగడం, మూసీ సుందరీకరణ, ప్రభుత్వ పెట్టుబడులు, ప్రాధాన్యతలు వంటి కారణాల వల్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గిందని అధికారులు భావిస్తున్నారు.

7 నెలల ఆదాయ వివరాలు...

నెల	2023-24 ఆదాయం (రూ.కోట్లలో)	2024-25 లక్ష్యం (రూ.కోట్లలో)	2024- 25 ఆదాయం (రూ.కోట్లలో)	వృద్ధి (శాతంలో)
ఏప్రిల్	1,087	1,279	1,115	2.58
మే	1,317	1,544	1,079	-18.06
జూన్	1,180	1,544	1,293	9.58
జూలై	1,187	1,451	1,639	38.06
ఆగస్టు	1,296.73	1,123	1,306.68	0.77
సెప్టెంబరు	1,161.54	1,451	857.83	-26.15
అక్టోబరు	1,221.82	1,544	923.30 (26 వరకు)	-24.4
మొత్తం	8,451.09	9,936	8,213.81	

రోడ్డు ప్రాజెక్టులకు అటవీ అనుమతుల్లో జాప్యం

» కేంద్రం తీరుతో ఆగిపోయిన 59 ప్రాజెక్టులు

» అనుమతుల సాధనకు ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ మధ్య సమన్వయానికి బృందం

» సమీక్షలో మంత్రులు కోమటిరెడ్డి, సురేఖ

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అటవీ అనుమతుల మంజూరులో కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రంలో 59 రోడ్డు ప్రాజెక్టులు ఆగిపోయాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం సచివాలయంలోని మంత్రి కోమటిరెడ్డి చాంబర్‌లో ఇరువురు సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి అనేక రోడ్లకు అనుమతులు సాధించినా అటవీ అనుమతుల్లేక ఆగిపోవడంతో.. కొత్త రోడ్ల మంజూరు కోసం అడగడం ఇబ్బందిగా మారిందని కోమటిరెడ్డి తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని జాతీయ రహదారులను మంజూరు చేయించాలంటే ఇప్పటికే మంజూరైన రోడ్లను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణమే అటవీ అనుమతులు సాధించేందుకు శాఖల మధ్య సమన్వయం కోసం అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీనిని పర్యవేక్షణకు ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఎస్‌ఈ స్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమించనున్నట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. డీఎఫ్‌వోల స్థాయిలో ఉన్న 11 అటవీ అనుమతుల ఫైళ్ల ఆలస్యంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ఫైళ్ల క్లియరెన్స్‌లో ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డికి హామీ ఇచ్చారు. అనుమతులను వేగంగా సాధించేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా పర్యవేక్షణ అధికారులను నియమించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డోబ్రియల్‌కు ఆదేశాలు జారీ చేశారు. డిసెంబరు చివరికల్లా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌పై ఒక స్లాబ్‌ను పూర్తి చేయాలని మోర్త్ ఆర్వో కృష్ణప్రసాద్, ఎస్‌ఈ ధర్మారెడ్డికి మంత్రి కోమటిరెడ్డి సూచించారు.

మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చొద్దు

» హైదరాబాద్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ముషీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చొద్దని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుతాన్ని కోరారు. శనివారం ముషీరాబాద్‌లో వివిధ అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటని, కానీ ఇక్కడి ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ, అధ్వానపు రోడ్లు, వెలగని వీధి దీపాలు తదితర సమస్యలతో నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హైదరాబాద్‌లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందని ప్రభుత్వం వెంట నే మేలుకోకపోతే రానున్న రోజుల్లో డ్రైనేజీ వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులకు పలు మార్లు టెండర్లకు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అన్నారు. హైలెవల్ మీటింగ్ ఏర్పా టు చేసి హైదరాబాద్ అభివృద్ధికి వెంటనే నిధులు విడుదల చేయాలని కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్ గోపీకి అరుదైన గౌరవం

గువాహటి సాహిత్యోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానం



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్. గోపీకి అరుదైన గౌరవం దక్కింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన సాహిత్య ఉత్సవాలలో ఒకటైన గువాహటి లిటరరీ ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయనకు ఆహ్వానం అందింది. నవంబరు 8, 9వ తేదీల్లో జరగనున్న ఆ సాహిత్య పండుగలో 'అస్సామీతో పాటు ఇతర ప్రాచీన హోదా కలిగిన భారతీయ భాషలు' అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేయనున్నారు. ఇదే వేడుకలో ఎన్. గోపీ రచించిన 'జల గీతం' దీర్ఘ కవిత్వానికి ప్రఖ్యాత కవయిత్రి పూరబి చోరా అస్సామీ అనువాదం 'నీర్‌గీత్' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు 'జలగీతం' సంపుటి 12 భాషల్లోకి అనువాదమైంది. ఇదే పుస్తకాన్ని ప్రొ. మాణిక్యాంబ హిందీలోకి అనువదించగా, అది కేంద్ర అనువాద పరిషత్ ఉత్తమ పురస్కారానికి ఎంపికయింది.

మేడారం మినీ జాతర తేదీలు ఖరారు

2025 ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు గిరిజన పండుగ

మేడారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మం డలం మేడారం మినీ జాతర తేదీలను అమ్మవార్ల పూజారులు శనివారం ప్రకటించారు. పూజారులు సమావేశమై మాఘశుద్ధ పౌర్ణమి గడియలను పరిశీలించి 2025 ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు నాలుగు రోజు ల మినీ సంబురం జరపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 2025 ఫిబ్రవరి 12న బుధవారం ప్రథమ పూజలు మండ మెలిగె కార్యక్రమం, ఫిబ్రవరి 13, 14, 15వ తేదీల్లో రహస్య పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆశ్వయుజ పౌర్ణమి మొదలుకొని దీపావళి తరువాత రెండు రోజుల వరకు గోండు గ్రామీణులు తమ తమ వెసులుబాటు, స్తోమత, ఉత్సాహాన్ని బట్టి ఐదు నుంచి పదిహేను రోజుల వరకు జరుపుకునే దండారి పండుగే గుస్సాడి నృత్యోత్సవాలు. ఈ పండుగ సందర్భంలోనే గోండులు తమ ఇళ్లను, తమను బాగా అలంకరించుకోవడం పరిపాటి. గోండుల అందాలను చూడాలన్నా, వారి గ్రామ సౌందర్యాలను చూడాలన్నా అందుకు దండారి పండుగ సమయమే సరైనది. ప్రకృతిలోని జీవ లయను అనుకరిస్తూ పరమేశ్వరునిపట్ల భక్తిపూర్వక ఆరాధనా భావాన్ని వ్యక్తం చేసే గుస్సాడి నృత్యాలు గోండుల సామూహిక జీవన సౌందర్యానికి ప్రతిబింబాలు.

ప్రకృతి, పరమేశ్వరుడు, గుస్సాడి నృత్య లయ

హిందువులు ఆశ్వయుజ మాసం (అక్టోబర్)లో దసరా, దీపావళి పండుగలను జరుపుకుంటే ఇవే పండుగలను గోండు గిరిజనులు ‘దివాడి’ మాసంలో జరుపుకుంటారు. హిందువుల పండుగలకు, గోండుల పండుగలకు మధ్య చాలా భిన్నత్వం ఉంది. హిందువుల దీపావళి పండుగలో భాగంగా మొదటి రోజు భోగి కాల్చడం, తరువాత రోజున నరక చతుర్థి పేరున దీపాలు వెలిగించి, టపాసులు, బాణాసంచా కాల్చడం ప్రధాన అంశాలు కాగా... గోండులు దీపావళి పండుగ జరుపుకునే మాసానికే ‘దివాడి’ అని పేరు పెట్టుకొని భోగి, దివాడి, దివాడి అనంతర రోజులలో ‘దండారి పండుగ’ పేరిట ‘గుస్సాడి నృత్యోత్సవాలు’ జరుపుకుంటారు. గుస్సాడి నృత్యాలు తెలంగాణలో ఇంకా వైభవంగా వర్ధిల్లుతున్నాయి. తెలుగు ప్రజలు అందరరూ, ముఖ్యంగా నర్తకులు ఆ వైభవ విశేషాలను, ప్రత్యేకతలను తెలుసుకోవడం చాల అవసరం.

దండారి పండుగను పద్ధతి ప్రకారమైతే ఐదు రోజులు జరుపుకుంటారు. మొదటి రోజైన భోగినాడు గుస్సాడీ నర్తకులు, వారి సహాయకులైన పోరిక్‌లు వేషధారణ చేసుకుంటారు. గుస్సాడీలు నటరాజ శివుడిలాగా, పోరిక్ (మగపిల్లలే ఆడపిల్లలుగా అభినయించడం)గా తయారవుతారు. వీరందరు నృత్యం చేయాలి కాబట్టి వారికి నృత్య పద్ధతులను (చాల్‌లు) సూచించే ‘కోల వెహె’ కూడా ఆ రోజే తయారవుతాడు. ఈయన మాత్రం తెల్లగుడ్డను తల చుట్టూ చుట్టుకొని వెనుక వైపు ముడి వేసుకుంటాడు.

వీరందరూ ఆ రోజు నుంచి స్నానం చేయకుండా పండుగ అయిపోయే వరకు నిష్ఠగా ఉండాలి. అలా ఉంటామని ‘కుద్ద తిరివల్’ పేరిట ప్రమాణం చేయాలి. అంటే... గోండు పటేల్ (తెగ పెద్ద) ఇంటి ముందర పందిరి కింద తవ్విన బద్ది (రంధ్రం)లో ఒకరి తరువాత ఒకరు తమ కుడి కాలు మడమ పెట్టి తమ చుట్టు తాము ఒకసారి తిరగాలి. అదొక విజయ ఘట్టం, పవిత్ర సూచన కాబట్టి ఇతర గోండులు కుద్ద తిరిగిన వారికి అభినందనలు తెలుపుతారు.

విశేషమేమిటంటే ఈ భోగి దినాన్ని మాత్రం ఒక్కో గోండు గ్రామవాసులు ఒక్కోలాగ నిర్ణయించుకుంటారు. అంటే అందరికీ భోగి ఒకే రోజు ఉండదు. ఎవరి అనుకూలతలను బట్టి వారు నిర్ణయించుకుంటారు. దండారి పండుగను జరిపే గ్రామాలు మరో గ్రామానికి ఆతిథ్యం ఇస్తారు, ఇంకో గ్రామానికి అతిథులుగా వెళ్తారు. మరి కొందరు గోండు గ్రామస్థులు గోదావరి ఒడ్డున ఉన్న పద్మల్పురి కాకో వంటి దేవతల దర్శనానికి వెళ్తారు. ఇలాంటి పలు అంశాలను దృష్టిలో పెట్టుకొని భోగి రోజును ఒక్కో గ్రామ వాసులు ఒక్కో రోజుగా నిర్ణయించుకుంటారు.

భోగినాడు గుస్సాడీలు, పోరిక్‌లు ధరించే ఆహార్యం, వాయిద్యాలను కలిపి ‘ఏత్మసూర్’ (ఆత్మ దైవం) పేరిట పూజించి, ‘పాతి భోజనం’ పేరిట ఒక పెద్ద తలె (ప్లేట్)లో గుస్సాడీలు, పోరిక్‌లు కలిసి ‘సహ’ విందు భోజనం చేసిన తరువాత అందరూ కలిసి రాత్రి వరకు ఉత్సాహంగా నృత్యం చేస్తారు. రెండవ రోజు నుంచి ఒక గ్రామ గుస్సాడీల బృందం తమను ఆహ్వానించిన ఆతిథ్య గ్రామానికి దండుగా వెళ్తారు. కాబట్టి ఈ పండుగను ‘దండారి’ అంటారు. గుస్సాడీలను పవిత్రులు, దైవ సమానులుగా భావిస్తారు కాబట్టి వారికి కావలసిన ఏర్పాట్లు చేయడానికి ‘డియ్యార్’లు అనే బృంద సభ్యులను నియమిస్తారు. వీరు దండారి ఊరికి వెళ్ళే ముందు కుద్దు తిరుగుతారు. అలా తిరిగిన తరువాత వీరు కూడా పండుగ ముగిసే వరకు స్నానం చేయకుండా నిష్ఠగా ఉండాలి. మగవారు దండారి పోవడం దీపావళికి ముందే జరగాలి.

ఈ పండుగలో నర్తించే ‘డియ్యాన్’లు అనే స్త్రీలు మాత్రం దివాడికి ముందు కుద్దు తిరుగరాదు, దండారికి పోరాదు. దివాడి తెల్లారి కుద్దు తిరుగవచ్చు, నృత్యం చేయవచ్చు. అయితే ఈ స్త్రీలు కుద్దు తిరిగిన తరువాత దండారి పండుగ అయిపోయే వరకు స్నానం చేయకుండా నిష్ఠగా ఉండాలి. మధ్యలో బహిష్టు / ముట్టు అయినా కూడా స్నానం చేయకుండా అలాగే ఉండాలి.

ఒక రోజు ఒక గ్రామం వారు మరో గ్రామానికి వెళ్తే మరో రోజు ఇంకో గ్రామం వారిని అతిథులుగా తమ గ్రామానికి ఆహ్వానిస్తారు. డియ్యార్‌లు అతిథులకు మర్యాదలు చేస్తారు.



భోజనాలు అయిన తరువాత అతిథులుగా వచ్చినవారు, ఆతిథ్యం ఇచ్చిన వారు అందరూ కలిసి రాత్రంతా గుస్సాడీ నృత్యం చేస్తారు. స్త్రీలు వలయాకారంలో ‘డియాన్’ నృత్యం చేస్తుండగా వారికి వెలుపల గుస్సాడీలు నర్తిస్తూ తిరుగుతుంటారు. నర్తకులు, ప్రత్యేకించి యువకులు అందరు తమ తమ నృత్య ప్రావీణ్యతలను ప్రదర్శిస్తారు. తద్వారా అతిథి గ్రామ అమ్మాయిల మనసును దోచుకోగలిగితే తదనంతరం వారి పెద్దలు వరసైనవారికి పెండ్లి చేస్తారు. అర్ధరాత్రి సమయానికి గుస్సాడీ నృత్యాలు బాగా ఊపందుకుంటాయి. సాధారణంగా పద్ధతి ప్రకారం నర్తించే గుస్సాడీలు అకస్మాత్తుగా ప్రేక్షకుల మధ్యలోకి దూసుకొచ్చి తమ చేతిలో ఉన్న ‘రోకల్’ అనే కట్టెతో పొడుస్తూ ప్రేక్షకులకు గిలిగింతలు కలిగిస్తారు. అలాంటి ఊహించని చర్యలకు కొందరు ప్రేక్షకులు భయపడడం కద్దు.

గుస్సాడీ నృత్యాన్ని మాత్రం ఒక క్రమ పద్ధతి ప్రకారమే ప్రదర్శిస్తారు. గుస్సాడీ నృత్యంలో ‘ఏడుం చాల్’ (ఏడు రకాల నృత్యాలు) ఉంటాయి. మొదటి నృత్యాన్ని ‘సూర్ చాల్’ అంటారు. అంటే ప్రారంభ (షురూ) నృత్యం అని. ముగ్గురు నలుగురు డప్పులను ‘చుంచనకుం చుంచనకుం...’ అంటూ మంద్ర గతిలో వాయిస్తుండగా గుస్సాడీలు రెండు మూడు వరుసలలో నిలబడి తమ చేతుల్లో ‘గంగరాం సోట’ (సన్నటి రోకలి కర్ర)ను ముందుకు, ఆ పక్కకు, ఈ పక్కకు చూపుతూ ఎగురుకుంటూ ముందుకు వస్తారు. ఇది నమస్కార పూర్వక నృత్యం.

‘గుస్సాడి చాల్’ అనే రెండవ నృత్యంలో ‘డినడిడ్డనకనక డినడిడ్డనకనక...’ అనే డప్పు శబ్దాలకు అనుగుణంగా వరుసలుగా ఉన్న గుస్సాడీలు కొద్దిగా వంగి తమ కుడి చేతిలోని రోకల్‌ను, తమ కుడి కాలును ఒకేసారి అటూ ఇటూ మారుస్తూ నర్తిస్తారు. ‘మహదేవన చాల్’ అనే మూడవ నృత్యంలో ‘జన్ జన్ జజ్జనక, జన్ జన్ జజ్జనక...’ అనే డప్పు దరువుకు అనుగుణంగా నృత్యం చేస్తారు. సూర్ చాల్, గుస్సాడీ చాల్, మహదేవన చాల్ అనే ఈ మొదటి మూడు నృత్యాలు శివారాధన నృత్యాలు కాగా తరువాతి మూడు నృత్యాలు పశుపక్ష్యాదుల అనుకరణ నృత్యాలు.

నాల్గవ నృత్యమైన ‘ఉరుం చాల్’లో గుస్సాడీలు ఉడుము ఆటను ప్రదర్శిస్తారు. ముందుగా డిప్పీలు తీస్తున్నట్లు అరచేతులను, కాళ్ళ మునివేళ్ళను భూమి మీద ఆనించి ‘దడ్డనకుండం దడ్డనకుండం...’ అనే డప్పు శబ్దాలకు స్పందిస్తూ అదే స్థితిలో పైకి ఎగిరి ఒకసారి తలను ఎడమ వైపు, మరోసారి కుడి వైపు తిప్పుతూ నర్తిస్తారు. ఈ నృత్యాన్ని ప్రదర్శించేందుకు గుస్సాడీలకు చాలా శక్తి, ప్రావీణ్యం ఉండాలి. ‘హెడ్గ చాల్’ అనే ఐదవ రకపు నృత్యంలో గుస్సాడీలు వరుసల్లో నిల్చుని ఎడమ చంకలో రోకల్ పెట్టుకొని వంగి ‘డంనకడంచిక డంనకడంచిక...’ అనే డప్పు శబ్దాలకు అనుగుణంగా ఎలుగుబంటి వలె ఎగురుతూ ముందుకు కదుల్తుంటారు. ‘మల్సూరి చాల్’ అనే ఆరవ రకపు నృత్యంలో వరుసల్లో నిల్చున్న గుస్సాడీలు తమ కుడిచేత రోకల్ పట్టుకుని కొద్దిగా వంగి ‘రగ్గినకరధింకన రగ్గినకరధింకన...’ అనే డప్పు శబ్దాలకు అనుగుణంగా ఓసారి కుడి వైపునకు, మరోసారి ఎడమ వైపునకు ‘నెమలి’ వలె గెంతుతారు. ‘సాక్రి చాల్’ అనేది గుస్సాడీ నృత్యాల్లో ఏడవది, చివరిదీనూ. దీనికంటే ముందటి నృత్యాలలో క్రమంగా వేగాన్ని పెంచుకుంటూ వస్తారు. ఈ చివరి నృత్యంలో నృత్య వేగాన్ని పరాకాష్ఠకు చేరుస్తారు. వరుసల్లో నిల్చున్న గుస్సాడీలు కొంచెం వంగి రెండు చేతులతో రోకల్ పట్టుకొని దానిని ముందుకు చూపుతూ ‘చుంచనక చుంచనక...’ అనే డప్పు శబ్దాలు వేగంగా ధ్వనించగా వాటికి అనుగుణంగా అంతే వేగంగా తిరుగుతూ నర్తిస్తారు. అలా కొంతసేపు నర్తించిన తరువాత ‘నకరనకర డంటనకర నకరనకర డంటనకర...’ అనే డప్పు శబ్దాలకు అనుగుణంగా మరింత వేగంగా గొలుసు (ఇంగ్లీషు అక్షరం ఎస్) ఆకారంలో తిరుగుతూ నర్తిస్తూ చివరిగా వచ్చే పెద్ద ‘ధం’ శబ్దానికి స్పందనగా పైకి ఎగిరి దూకి నృత్యాన్ని ఆపేస్తారు.

ఇలా దండారి పోయి, దండారిని ఆహ్వానించి అందరూ కలిసి ఆడుకున్న తరువాత, కొత్త గుస్సాడీలకు, పోరిక్‌లకు, డియ్యార్‌లకు, డియాన్‌లకు నృత్యాలు నేర్పించిన తరువాత, సుమారుగా దివాడి తెల్లారి అందరూ కలిసి గోండు పటేల్ ఇంటికి, ఆ తరువాత గ్రామంలోని ప్రతి గోండు ఇంటింటికి వెళ్ళి మాన్ కోల (ఆహ్వానం), సార్ కోల (వీడ్కోలు) నృత్యాలు చేసి, మధ్య మధ్యలో ఇతర నృత్యాలు చేసి, ఏత్మసూర్ పేన్, జంగుబాయి పేన్, ఆకి పేన్, అవ్వల పేన్ మొదలైన దేవతలకు భక్తితో పాటలు పాడి హారతులిస్తూ ప్రతి ఇంటి నుంచి వడ్లను స్వీకరించి, వాటిలో కొన్నింటిని ఇచ్చినవారికే దేవుడి ప్రసాదంగా ఇస్తారు. ఈ కార్యక్రమాన్ని ‘హారతులు జమచేయడం’ అంటారు. చివరి ఐదవ రోజున ‘కోలబోడి’ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆ రోజు కూడా అందరూ మనస్ఫూర్తిగా ఆడుకున్న తరువాత ఏత్మసూర్ పేన్‌కు అర్పణగా కోడిని కోసి అందరూ మొక్కుకొని పండుగను ముగిస్తారు.

ఆశ్వయుజ పౌర్ణమి మొదలుకొని దీపావళి తరువాత రెండు రోజుల వరకు గోండు గ్రామీణులు తమ తమ వెసులుబాటు, స్తోమత, ఉత్సాహాన్ని బట్టి ఐదు నుంచి పదిహేను రోజుల వరకు దండారి పండుగను జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంలోనే గోండులు తమ ఇళ్లను, తమను బాగా అలంకరించుకుంటారు. కాబట్టి గోండుల అందాలను చూడాలన్నా, వారి గ్రామ సౌందర్యాలను చూడాలన్నా అందుకు దండారి పండుగ సమయమే సరైనది.

• డా. ద్యావనపల్లి సత్యనారాయణ

(ఈ వ్యాసరచనకు సహకరించిన సిడాం అర్జు మాస్టర్, కనక సుదర్శన్‌లకు కృతజ్ఞతలు)

అధునాతనం ఈ సనాతనం!

ఇప్పటి సంగతి తెలియదు కానీ, ఓ నలభై యాభై ఏళ్ల కిందట చాలా మంది యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ముఖ్యంగా తెలుగు ప్రొఫెసర్లు, సంప్రదాయవాదులుగానే ఉండేవాళ్లు. క్లాసుల్లో పాఠాలు కూడా అట్లాగే చెప్పేవాళ్లు. అటువంటి ఒక తెలుగు ఆచార్యుడు, ఏదో పాఠం చెబుతూ కారల్ మార్క్స్ పేరు ఎత్తుకున్నారు. ఆశ్చర్యకరంగా, ప్రశంసించడం మొదలుపెట్టారు. ఇంతకీ ఆయన మార్క్స్‌లో కనిపెట్టిన గొప్ప గుణం ఏమిటంటే, నూటాయాభై ఏళ్ల పాతవాడవడం. అంత పూర్వపు కాలంలోనే, అంత గొప్పగా చదువుకుని కొత్త సిద్ధాంతం చెప్పాడు అని మార్క్స్‌ను మెచ్చుకున్నారు. ఆ అధ్యాపకుడి తన్మయం, సిద్ధాంతం గురించి కాదు, మార్క్స్ ప్రాచీనత గురించి.

పాతకు ఎప్పుడూ అటువంటి ఫాలోయింగ్ ఉంటుంది. అట్లాగని, ఎప్పుడూ ఒకే ‘పాత’ ఉండదు. ఎప్పటికప్పుడు కొత్త ‘పాత’ కూడా ఏర్పడుతుంది. హాయిగా ఉండేదనిపించే గతం మీద మనిషికి బెంగగా ఉంటుంది. వర్తమానం మీద విసుగ్గా ఉంటుంది. గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్ అనాలనిపిస్తుంది. కొత్తొక వింత పాతొక రోత అని వెక్కిరించాలనిపిస్తుంది.

పాతను ప్రేమించాలంటే, గడచిన యుగాల గురించి, చరిత్ర గురించి పెద్దగా తెలియనక్కరలేదు. గతించిపోయిన విలువలు తిరిగి రావాలని ఉంటుంది కానీ, అలనాటి జీవనసరళి యథాతథంగా కావాలని అందరూ కోరుకోరు. ఆధునిక ప్రయాణసాధనాలూ, యంత్ర సదుపాయాలూ లేని కాలంలోకి వెళ్లాలంటే, విశ్వనాథ సత్యనారాయణకు కూడా విముఖతే ఉంటుంది. తంత్రిలో విద్యుత్ ప్రవహింపజేసిన మహాశక్తి ఏది వంటి ఎదురు ప్రశ్నలేవో వేశారు కానీ, ఆయన కరెంటును కాదనలేదు.

ఛాందసవాదుల్లో అతి కొద్దిమంది మాత్రమే అరచేతులు అడ్డుపెట్టి మార్పును ఆపాలని, గడియారాన్ని వెనక్కు తిప్పాలని గట్టిగా ప్రయత్నం చేస్తారు. అత్యధికులు మాత్రం, గతాన్ని ఒక భావనగా మార్చేసి, ఆరాధిస్తూ, ప్రచారం చేస్తూ, భౌతిక జీవితంలో వర్తమానపు పోకడలోనే వ్యవహరిస్తుంటారు. ఎవరి వల్ల సమాజానికి ఎంత నష్టం, ఎంత లాభం అన్నది ఆసక్తికరమైన చర్చ. కానీ, గతారాధకులందరినీ, ఛాందసులుగా లెక్కగడితే మాత్రం తప్పులో కాలువేసినట్టే.

సనాతనవాదం ఈ మధ్య చాలా వార్తలలోకి వచ్చింది. ఈ సనాతనం అంటే నికార్సయిన నిర్వచనం ఏమిటో ఎవరికీ తెలియదు. మార్పులేనిది, నిరంతరమైనది, శాశ్వతమైనది అని అర్థాలున్న ‘సనాతనం’, దేన్ని సూచిస్తున్నదన్న విషయంలో ఒక స్థిరమయిన ఏకాభిప్రాయం ఏర్పడలేదు. కానీ, సనాతనాన్ని విమర్శించేవారు మాత్రం, సనాతనులంటే, గతించిపోయిన చెడుగులను అన్నిటినీ తిరిగి తేవడానికి ప్రయత్నిస్తున్నవారిగా చిత్రిస్తున్నారు. చాతుర్వర్ణ వ్యవస్థను, అంటరానితనాన్ని, సతీసహగమనాన్ని, బాల్యవివాహాలను తిరిగి సమాజంలోకి తేవాలనుకుంటున్నారా అని సనాతనవాదులను ప్రశ్నిస్తున్నారు.

సనాతనవాదులకు తామెందుకు సనాతనాన్ని సమర్థిస్తున్నదీ పెద్దగా తెలియదు. భారతదేశంలో హిందూ మతం ప్రాచీనమైనదని, ఆ మతధర్మం సహస్రాబ్దాల పరీక్షకు నిలిచిందని, దానికి ప్రమాదం వస్తే తాము నొచ్చుకుంటామని, ఆగ్రహిస్తామని సనాతనవాదులు చెబుతుంటారు. ఘర్షణాత్మక సంవాద సందర్భాల్లోనే వారికి సనాతనవాదం స్ఫురణకు రావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. సాధారణ సందర్భాలలో ఎవరూ సనాతనవాదాన్ని బోధించి, ప్రచారం చేయడం పెద్దగా చూడము. ఎందుకంటే, ఏయే అంశాలు సనాతనం అవుతాయో, హిందూమతం కీలకసారాంశం ఏమిటో చెప్పమంటే వారు సరైన సమాధానం ఇవ్వగలగడం కష్టమే. నిజానికి, ఒకే రకమైన సమాధానం ఇంకా రూపొందలేదు. ధర్మం అనే మాట వేదాల్లోనే ఉంది కానీ, ‘సనాతన ధర్మ’ అనే జంట పదాల ప్రయోగం బౌద్ధంలోనే మొదలు. బౌద్ధం ప్రకారం, సత్యమే సనాతనధర్మం. మహాభారతంలో అనేక చోట్ల సనాతన ధర్మం అనే మాటలు కనిపిస్తాయి. సత్యం అనే అర్థంతో పాటు, ఇంకా అనేక సందర్భాలలో వేరు వేరు అర్థాలలో ఆ ప్రయోగం చూడవచ్చు. వేరు వేరు సనాతన ధర్మాలున్నాయన్న ప్రస్తావన కూడా భారతం ఆదిపర్వంలో ఉన్నది.

ఏ సాంస్కృతిక జీవనంలో అయినా ఒక అంతస్సూత్రం ఉండవచ్చు. అనేక కాలాల గుండా కొనసాగే ఒక సారాంశ విలువ ఉండవచ్చు. ఆ అర్థంలో సనాతన ధర్మం అనే మాట వాడడంలో తప్పేమీ లేదు. కానీ, చారిత్రకంగా చూసినప్పుడు, ఇప్పుడు హిందూమతంగా పిలుస్తున్నది ఒకనాడు వైదిక ధర్మంగా, అనంతరం అనేక ఆరాధనాశాఖలుగా, భక్తిమార్గాలుగా కొనసాగి, వలసపాలనలో ఏకీకరణ చెందింది. బ్రిటిష్ హయాంలోనే, భారతదేశానికి ఒక ఉమ్మడిగతాన్ని నిర్మించవలసిన అవసరం ఏర్పడింది. ఆ ఉమ్మడి గతాన్ని సనాతన ధర్మం లేదా సనాతన సంస్కృతిగా పిలవడం మొదలయింది. ఈ చారిత్రక ప్రయాణాన్ని పక్కన బెడితే, ప్రస్తుతం సనాతన ధర్మం అనేది సాంస్కృతిక మత జాతీయవాదానికి పునాదిభావనగా పరిణమించింది. ఇతరాన్ని నిర్వచించడం ద్వారా తనను నిర్వచించుకుంటున్నప్పుడు, ఒక తన్మయ, సగర్వ భావం కలిగించగలిగే గతానికి చెంది ఉండడం ఒక అవసరం అవుతుంది. దానికేమీ ప్రత్యేక నిర్వచనాలుండవు. ప్రస్ఫుటంగా కనిపించే భిన్నత్వాన్ని కొనసాగించే ప్రేరణ ఇవ్వడమే ఈ భావన ప్రయోజనం. నిజానికి సనాతనవాదం పేరుతో ఒక సమూహాన్ని ఎవరూ సమీకరించలేదు కానీ, ఒక దశాబ్దంగా భారతదేశంలో ఉన్న ప్రత్యేక సాంస్కృతిక పరిస్థితుల్లో రూపొందిన తీవ్ర జాతీయవాదులను, వారి సానుభూతిపరులనే సనాతనవాదులుగా అంతా పరిగణిస్తున్నారు.



ప్రగతిశీలురు, హేతువాదులు పొరబడుతున్నట్టు, ఈ సనాతనవాదులు ఆధునికతకు, ఆధునిక జీవనసరళికి వ్యతిరేకులు కారు. నిజానికి ఈ సనాతన భావనే ఆధునికమైనది. సనాతనవాదులెవరూ తమ పిల్లలను ఆధునికవిద్యకు, విదేశీ ఉద్యోగాలకు ఎడం ఉంచడం లేదు. ఎవరూ సాంప్రదాయిక దుస్తులు మాత్రమే ధరించడం లేదు. ప్రత్యేక సందర్భాలలో తప్ప మతపరమైన చిహ్నాలు ధరించడం లేదు. మొత్తం సమాజంలో ఎంత మేరకు ఉన్నదో వారిలో అంత మాత్రమే కులతత్వం ఉన్నది. అయినా, వారిలో కూడా కులాంతర వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. దురాచారాల సంస్కరణకు వారు విముఖంగా లేరు. ఆధునిక శాస్త్రవిజ్ఞానం

> ఏ సాంస్కృతిక జీవనంలో అయినా ఒక అంతస్సూత్రం ఉండవచ్చు. అనేక కాలాల గుండా కొనసాగే ఒక సారాంశ విలువ ఉండవచ్చు. ఆ అర్థంలో సనాతన ధర్మం అనే మాట వాడడంలో తప్పేమీ లేదు. కానీ, చారిత్రకంగా చూసినప్పుడు, ఇప్పుడు హిందూమతంగా పిలుస్తున్నది ఒకనాడు వైదిక ధర్మంగా, అనంతరం అనేక ఆరాధనాశాఖలుగా, భక్తిమార్గాలుగా కొనసాగి, వలసపాలనలో ఏకీకరణ చెందింది. బ్రిటిష్ హయాంలోనే, భారతదేశానికి ఒక ఉమ్మడిగతాన్ని నిర్మించవలసిన అవసరం ఏర్పడింది. ఆ ఉమ్మడి గతాన్ని సనాతన ధర్మం లేదా సనాతన సంస్కృతిగా పిలవడం మొదలయింది.

వారు కూడా అధ్యయనం చేస్తున్నారు. ఆలోచనల్లో అపసవ్యత, అన్య మతస్థుల విషయంలో అసహనం పాలు ఎక్కువ ఉండవచ్చును కానీ, తక్కిన అన్ని విషయాల్లోనూ వారు సాధారణ ఆధునిక జీవనులే.

ఉదయనిధి స్టాలిన్ సనాతనవాదాన్ని నిర్మూలించాలన్నప్పుడు సంచలనం కలిగినమాట నిజమే కానీ, తమిళనాడు క్షేత్రంలో ఆ మాటకు ఉండే అర్థం, ప్రాసంగికత వేరు. బ్రాహ్మణాధిక్యానికి, ద్రావిడ వ్యతిరేకతకు గుర్తుగా సనాతనాన్ని ఉదయనిధి చూశారు. భారతీయ జనతాపార్టీ కానీ, దాని సహచర సాంస్కృతిక సంస్థలు కానీ ఆ ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకించాయి. కానీ, సనాతనవాదంలో సమర్థించవలసిన అంశాల గురించి వాదనలు చేయలేదు. ఉదయనిధి వంటి వారి వాదనలు, దాని ప్రతివాదనలు ప్రజలలో భావాల రీత్యా తీవ్ర విభజనను కలిగిస్తాయి, అందులో బీజేపీకి, దాని మిత్రులకు ప్రయోజనం ఉన్నది కనుక, ఆ వివాదాన్ని కొనసాగిస్తూ పోయారు. అంతిమంగా అది భావాల, విలువల పోరాటంగా కంటె, ఒక రాజకీయ పోరాటంగా పరిణమించింది.

సనాతనవాదాన్ని వ్యతిరేకించాలనుకునే వివిధ సిద్ధాంతవాదులు ఎవరైనా, ఎదుటివారిని, వారి మొత్తం రాజకీయార్థిక, సాంస్కృతిక వర్తమాన విధానాలకు విమర్శించాలి తప్ప, వారేదో ఆదిమయుగంలోకి సమాజాన్ని నడిపించే వారన్నట్టు వాదనలు నిర్మించడం మానుకోవాలి. సనాతనవాదాన్ని గాఢంగా నమ్మడం, ఆధునిక జీవనంలోని ప్రగతిశీల మార్పులను మందగింపజేయడమో, నిరోధించడమో చేసేమాట నిజమే. మొత్తంగా సామాజిక, రాజకీయ ప్రయాణాన్ని గుణాత్మకంగా ప్రభావితం చేస్తుంది కూడా. అంతేతప్ప, అది తిరిగి అస్పృశ్యతను, రాచరికాన్ని తిరిగి తీసుకురాదు. అంతర్గత సంస్కరణలను కూడా అడ్డగించదు. అయితే, అమెరికాలో రిపబ్లికన్ల వలె ఒకటి రెండు అంశాల్లో సాంప్రదాయికతను ప్రతీకాత్మకంగా బలవంతంగా కొనసాగించవచ్చు. అన్ని రకాల ఆధునిక వ్యవస్థలను, శాస్త్ర ప్రగతిని అనుభవించే రిపబ్లికన్లు గర్భస్రావ హక్కు విషయంలో పట్టింపుగా ఉంటారు, అలాగే, ఇతరుల కంటె ఎక్కువ వర్ణవివక్ష చూపుతారు.

ఒక పరంపర నిరంతరాయంగా ఉంది అనుకోవచ్చును కానీ, అది ఏ మార్పూ లేకుండా యథాతథంగా కొనసాగుతూ వచ్చిందని చెప్పలేము. ప్రపంచంలో ఏ మతమూ మార్పులు లేకుండా సాగలేదు. ఏ సమాజమూ విలువలలో మార్పులు చేర్పులు లేకుండా ప్రయాణించలేదు. శాశ్వతమైన విలువ ఏదైనా ఉందంటే అది మార్పు మాత్రమే. ఒక సుస్థిర ప్రాచీన ధర్మం ఉన్నదనీ, దానికి తాము చెంది ఉన్నామని, దానిని కాపాడుకోవాలనీ భావించడం ఒక సాంస్కృతికరాజకీయ అవసరం. వర్తమానంలోని వాస్తవికతకు చెంది ఉండడంలోని అసౌకర్యాన్ని, పరాయితనాన్ని తొలగించగలిగితే, మనిషికి ఈ పారంపరిక అగత్యం ఉండకపోవచ్చు. అంతేకాదు, పరంపర ఏకైకం కాదు. గతం నుంచి కొనసాగింపు ఒకే కోవలో ఉండదు. వర్తమాన ప్రత్యామ్నాయాలు మాట్లాడేవారు, గతంలోని ప్రత్యామ్నాయాలను కూడా అన్వేషించాలి. ఆలింగనం చేసుకోవాలి. అనేక మార్గాల మధ్య స్పర్ధ, ఘర్షణ సనాతన చరిత్రలో భాగమే.


సనాతనవాదాన్ని రాజకీయంగా, సైద్ధాంతికంగా వ్యతిరేకించాలనుకునేవారు, ఆ పనిని తప్పుడు ప్రాతిపదికల మీద చేయకూడదు. ప్రత్యర్థుల ఆలోచనా విధానాన్ని, రంగం మీదకు వచ్చిన సాంస్కృతిక భావనలను డీకోడ్ చేయడంలో విఫలం కావడం యుద్ధరంగంలో ఒక బలహీనత.

▪ కె. శ్రీనివాస్

వారి చరిత్ర ‘తడిసె రక్తమున, కాకుంటే కన్నీళులతో’...

ఐరోపా సందర్శకులకు అనేక నగరాల్లో కథెడ్రల్స్, మ్యూజియంలతో పాటు తప్పకుండా చూడాల్సిన టూరిస్టు ఆకర్షణల్లో యూదులు నివసించిన కాలనీలు, వాళ్ళ ప్రార్థనా స్థలాలు, వారి స్మశానాలు ఉంటాయి. ముఖ్యంగా మధ్య యూరోప్ నగరాలయిన ప్రాగ్, బుడాపెస్ట్, వియెన్నా, జెర్మనీలోని పలు పట్టణాల్లో వాటిని సందర్శించటం అనేకమంది యూరోపియన్లకు, యూదులకు, ఇతర తెల్లజాతి ప్రజలకు దాదాపు ఒక పుణ్య కార్యం. ఐరోపా దేశాలు ప్రపంచవ్యాప్తంగా అనేక ఖండాల్లో జరిపిన లెక్కలేనన్ని హింసాకాండల్లో తాము యూదులపై జరిపిన నరమేధానికి చాలా ప్రత్యేక స్థానం ఇస్తారని వలస దేశాల నుండి వెళ్ళే నల్లజాతి ప్రజలకి కొట్టొచ్చినట్లు అర్థమవుతుంది. వాటిని సందర్శించినప్పుడే పోలాండ్, ఆస్ట్రియా, హంగేరి, చెకోస్లోవేకియా లాంటి ఎన్నో దేశాలు తమ దగ్గరి యూదులను హిట్లర్‌కు అప్పగించి తమ చేతులకి మట్టి అంటకుండా అతని మారణహోమంలో తమ వంతు సహాయం చేశాయని, పారిశ్రామిక పద్ధతుల్లో నిర్వహించిన ఆ జాతి సంహారాన్ని సాధ్యమయినంత సులభతరం చేశాయని కూడా తెలుస్తుంది. కొంచెం లోతుకి వెళ్లి చూస్తే యూదుల పట్ల ద్వేషం అనేక శతాబ్దాలు యథేచ్ఛగా కొనసాగిందని మనకి అర్థమవుతుంది. హిట్లర్ పెద్ద ఎత్తున చేసాడు కాబట్టి ప్రపంచ చరిత్రలోకి ఎక్కింది తప్ప యూదులని వేధించటం అతడు కొత్తగా కనిపెట్టింది కాదని స్పష్టమవుతుంది.

ఐరోపా దేశాలలో ఒకప్పుడు యూదులు నివసించిన కాలనీలు, వాళ్ళ ప్రార్థనా స్థలాలు, వారి స్మశానాలు సైతం ప్రధాన పర్యాటక ఆకర్షణలుగా ఉన్నాయి. వాటిని సందర్శించటం అనేక మంది యూరోపియన్లకు, యూదులకు, ఇతర తెల్ల జాతి ప్రజలకు దాదాపు ఒక పుణ్య కార్యం! యూరోపియన్లు ప్రపంచ వ్యాప్తంగా జరిపిన లెక్కలేనన్ని హింసాకాండల్లో తాము యూదులపై జరిపిన నరమేధానికి చాలా ప్రత్యేక స్థానం ఇస్తారని వలస దేశాల నుండి వెళ్లే ప్రజలకి అర్థమవుతుంది.



జర్మనీలోని తురింగియా రాష్ట్రంలో, బెర్లిన్‌కు సమీపంలో ఉన్న ఎర్ఫర్టు అనే చారిత్రక పట్టణంలో ఫెలోషిప్‌పై ఉండటానికొచ్చిన నాకు ఈ చరిత్ర గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవటానికి ఒక అవకాశం లభించింది. నేనుండే హాస్టల్ పక్కనే ఆల్ట్ సినగాగ్ యూరోపులోనే ఇప్పటికీ నిలిచి ఉన్న అత్యంత పురాతన యూదుల ప్రార్థనా స్థలం. 11వ శతాబ్దంలో దీన్ని నిర్మించారు అంటే అంతకు ముందు నుండే ఇక్కడ యూదు సమూహం ఉండేదని అర్థమవుతుంది. ఈ పట్టణం, మధ్య ఐరోపాలో మత పరంగా, వ్యాపార పరంగా ప్రాముఖ్యత కలిగి, స్వతంత్ర ప్రతిపత్తితో ఏ రాజ్యంలో భాగం కాకుండా ఉండేది కాబట్టి ఐరోపాలో అనేక కట్టుబాట్ల మధ్య బ్రతికిన యూదుల సమూహం తమ జీవనం కోసం ఇక్కడ స్థిరపడ్డానికి చాలాసార్లు ప్రయత్నించారు. జర్మనీలోని మొదటి విశ్వవిద్యాలయం 1300ల్లో ఈ పట్టణంలోనే ఏర్పాటయింది. ప్రధానంగా వివిధ చర్చిలలో సభ్యులయిన మగ విద్యార్థులు ఆ విశ్వవిద్యాలయంలో చదువుకునేవాళ్ళు. ప్రొటెస్టెంట్ సంస్కర్త మార్టిన్ లూథర్ ఇక్కడే చదివి చాలా కాలం ఈ పట్టణంలోనే నివసించారు. వివిధ చర్చీల్లో ఆయన ప్రబోధాలు చేసేవాడు. ఎర్ఫర్టు ప్రొటెస్టెంట్ సంస్కరణలో భాగమై క్రైస్తవ మత ప్రజాస్వామీకరణ జరిగిన పట్టణాల్లో బహుశా ఒకటని చెప్పుకోవచ్చు.


మిగతా నగరాలతో పోలిస్తే ఇక్కడి యూదు సమూహం పెద్దదిగా ఉండేది. కొంత తక్కువ కట్టుబాట్లతో బ్రతికిందని అంటారు. వారి అవసరం పట్టణ వాసులకి ఉండటంతో కొన్నిసార్లు వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించి ఇక్కడ ఉండేలా చేశారు. అయితే ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలోనే వాళ్ళు బ్రతకాలి. మిగతా చోట్ల కంటే భిన్నంగా ఇక్కడ నగరం మధ్యలో కొంత ప్రాంతాన్ని వీరికి కేటాయించారు. పరిశోధకులు కూడగట్టిన వివరాల ప్రకారం ఆ స్థలం చిన్నది. క్రైస్తవుల ఇళ్లతో పోలిస్తే యూదుల ఇళ్ళు చిన్నవిగా ఉండేవి. వాళ్ళు నగరంలో ఏ చేతి పని గిల్డ్‌ల్లో భాగం అవ్వటం నిషేధం. కేవలం అప్పులివ్వటం, ఫైనాన్స్ చేసుకోవటానికి మాత్రమే వారికి పర్మిషన్ వుండేది. అనేకసార్లు వాళ్ళని ప్రత్యేక బ్యాడ్జి పెట్టుకోవాలనే నిబంధన తెచ్చారు. యూదులపై ప్రత్యేక పన్నులు ఉండేవి. అప్పుడప్పుడు కొన్ని పనులు చేసుకునే వెసులుబాటు ఇచ్చేవాళ్ళు. ఇక్కడ ముద్రణ, మాంసం కోసి అమ్ముకోవటం, బేకర్లుగా కొంత మంది యూదులు పనిచేసుకుని సంపాదించుకోవచ్చని పర్మిట్ ఇచ్చారు. తమ మత ఆచారాల ప్రకారం ఒక జంతువు నుండి కోషెర్ మాంసం కోసుకున్న తర్వాత మిగిలిన మాంసాన్ని ప్రత్యేక స్థలాల్లో మాత్రమే అమ్మాలి. ఎర్ఫర్ట్‌లో వాళ్లకి కేటాయించిన ఒక చిన్న గల్లీని పరిశోధకులు గుర్తించారు. అయితే క్రైస్తవులు వాళ్ళని యూదులని గుర్తించే విధంగా ప్రత్యేక టోపీలు పెట్టుకుని ఆ మాంసం అమ్ముకోవాలనే నిబంధన ఉండింది. ఎప్పుడు ఎవరు తరుముతారో తెలియక తమ దగ్గరున్న ధనాన్ని భూమిలో దాచి పెట్టుకుంటే, అది ఈ మధ్యనే బయటపడింది. అనేక అందమైన ఆభరణాలు, వందలాది వెండి ఫ్రెంచి నాణాలు సినగాగ్‌లో భద్రపరిచిన ఈ ఎర్ఫర్టు నిధిలో భాగం.

వివిధ నిబంధనలు, వివక్షలు, కట్టుబాట్లతో పాటు యూదులను మూడుసార్లు ఇక్కడి నుండి వెళ్లగొట్టడం జరిగింది. 1221లో మొదటిసారి ఒక క్రైస్తవుణ్ణి చంపి రక్తం తాగారనే నెపంతో క్రూసేడర్లు దాడుల్లో 22 మంది చనిపోయారు. యూదు మతాన్ని వదిలి క్రైస్తవాన్ని తీసుకోవాలని తెచ్చిన ఒత్తిడిని తట్టుకోలేక కొంతమంది తమని తామే చంపుకున్నారు. 1349లో ప్లేగు వ్యాధి భయాలు ప్రబలిన సమయంలో యూదులే బావుల్లో విషం కలిపారని దానివల్లే ప్లేగు వ్యాధి ప్రబలుతోందని దాడి చేసినప్పుడు దాదాపు 900 మంది హతమయ్యారు. కొంత మంది సినగాగ్‌లో పోరాడుతూ చనిపోతే, మరికొంత మంది ఆత్మాహుతి చేసుకుని చనిపోయారు. 1450ల్లో ప్రొటెస్టెంట్ సంస్కరణ ఉద్యమం, దానికి వ్యతిరేక ఉద్యమం వల్ల యూదులపై వివక్ష, పన్నులు తీవ్రం చెయ్యటంతో పాటు, వారికి ఉండే ప్రత్యేక రక్షణని వెనక్కి తీసుకోవటంతో ఇక్కడి నుండి మళ్ళా అందరూ తూర్పు ఐరోపాకి, లేకుంటే గ్రామీణ ప్రాంతాలకి పారిపోయారు. మళ్ళా 300 ఏళ్ల తర్వాత 1800ల మొదట్లో, ఫ్రాన్సు ఈ నగరాన్ని ఆక్రమించుకున్నప్పుడు మాత్రమే తిరిగొచ్చారు. 1800 చివర్లో వాళ్లకి కొన్ని హక్కులు లభించాయి. అయితే హిట్లర్ అధికారంలోకి వచ్చిన తర్వాత 1938లో ప్రార్థనా మందిరాన్ని ధ్వంసం చేసి దాన్ని ఒక సామాన్ల కొట్టుగా మార్చారు. 1940ల్లో తురింగియాలోని అన్ని ప్రాంతాల యూదులతో పాటు ఎర్ఫర్ట్ నుంచి కూడా 500 మంది యూదులను మృత్యు శిబిరాలకు పంపించారు.

క్రైస్తవులు ఎన్ని దాడులు చేసి ఎంత మంది యూదులను చంపినా సరే, వాళ్లకి ఏ శిక్షలు పడలేదు. ఇక్కడే కాదు, ఎక్కడా పడినట్లు దాఖలా లేదు. వారు యూదులకు బాకీలు ఉన్న అప్పులు అన్నీ మాఫీ చేసేవాళ్ళు, ఇరుగు పొరుగువాళ్ళు పారిపోయిన యూదుల ఇళ్ళూ, సామాన్లూ నాశనం చేసింది చెయ్యగా, మిగిలింది దోచుకునేవాళ్ళు. అలా ఈ పురాతన ప్రార్థనా స్థలం దూలాలు, ముక్కలు కూడా ఎర్ఫర్ట్‌లోని ఇళ్లల్లో కనిపించాయి. అయితే, ఈ శతాబ్దాల హింసకి 1945లో హిట్లర్ చనిపోయిన తర్వాత మొదటిసారి విరామం లభించింది. ఇక్కడికి ఒక అతి చిన్న యూదు సమూహం తిరిగొచ్చి పడిపోయిన ప్రార్థనా స్థలాన్ని తిరిగి కట్టించి, సామాన్ల కొట్టుగా మార్చిన ఇంకొక ప్రార్థనా స్థలాన్ని మ్యూజియంగా మార్చి యునెస్కో మాన్యుమెంట్‌గా గుర్తింపు తెచ్చేందుకు అర్జీ పెట్టుకున్నారు. పరిశోధనకు డబ్బిచ్చి అన్ని విషయాలూ తవ్వి తీయించారు. వీటిల్లో అనేక డాక్యుమెంట్లు బయటపడ్డాయి. మధ్య ఐరోపాలోనే అతి పెద్ద సుందరమైన హీబ్రూ బైబిళ్లు, పవిత్ర యూదు గ్రంథమైన తోరా అరుదయిన కాపీలు నాలుగయిదు బయటకొచ్చాయి.

ఇది కేవలం ఎర్ఫర్ట్ చరిత్ర మాత్రమే కాదు. దాదాపు తురింగియా రాష్ట్రంలో 60కి పైగా పట్టణాలు, గ్రామాల్లో పరిశోధకులు తవ్వి తీసిన వివరాలు చూస్తే అన్ని చోట్లా ఇదే చరిత్ర చిన్న చిన్న మార్పులతో మనకి కన్పిస్తుంది. అన్ని చోట్లా 200 ఏళ్ల నుండి 1000 ఏళ్ల పాటు యూదులు బ్రతికిన ఆనవాళ్లు ఉన్నాయి. ప్రతి చోటా క్రైస్తవ సమాజం వారిని అనేక కారణాలతో వేధించి, అనేకసార్లు బహిష్కరించి, తీవ్రమైన పన్నులు వేసి, వివక్ష చూపటం, అప్పుడప్పుడూ భౌతికంగా నిర్మూలించటం, తరిమేయటం ఇదే జరిగింది. అప్పిచ్చే వ్యాపారం చెయ్యటం వల్ల యూదులు వందల సార్లు తరమబడినా మళ్ళా నిలబడ్డారు కానీ ప్రధానంగా తమకంటూ ఒక చోటు లేకుండా శతాబ్దాల పాటు తిరిగారు. ఒక రాజ్యం బహిష్కరిస్తే ఇంకో చోటికి పారి పోవటం, పట్టణాలు బహిష్కరిస్తే గ్రామాలకి పారిపోవటం చేశారు. ఆస్తులు, ఇళ్లు, సమాధి స్థలాలు, విద్యాలయాలు, పవిత్ర గ్రంథాల ప్రతులు, ప్రార్థనా స్థలాలు అన్నింటినీ అనేకసార్లు పోగొట్టుకున్నారు. వాటిని క్రైస్తవ అధికారులు, పట్టణ అధికారులు, ఇరుగు పొరుగు వాళ్ళు స్వాహా చేసుకున్నారు. అనేకసార్లు నిందించబడ్డారు. ఆత్మహత్యలు చేసుకున్నారు. చివరికి హిట్లర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మృత్యు శిబిరాలకు లక్షల సంఖ్యలో పంపించబడ్డారు.

మధ్య ఐరోపాతో సహా అనేక ప్రాంతాల్లో కూడా ఇదే రకమైన చారిత్రక జ్ఞాపకాలు దొరుకుతాయి. ప్రాగ్, బుడాపెస్ట్, వియెన్నాలలో కొంత వెనకా ముందూ ఇదే



ఐరోపాలో సర్వత్రా ఉన్న యూదుల జ్ఞాపక చిహ్నాలు చూసినప్పుడు మనలో అనేక ప్రశ్నలు ఉదయిస్తాయి. ప్రజాస్వామిక, ఉదారవాద జాతి రాజ్యాలుగా ప్రసిద్ధి పొందిన ఐరోపా దేశాలు సంపూర్ణ రక్షణ కల్పిస్తామనే భరోసా యూదులకు ఇచ్చి తమ సమాజాలలోనే వారిని ఎందుకు నిలుపుకోలేదు? అసలు యూదులు ఐరోపా నుండి వెళ్ళిపోవటం అంటేనే ఐరోపా దేశాలన్నీ క్రైస్తవ రాజ్యాలని మళ్ళా నిరూపించటమే కాదూ? తెల్ల జాతి క్రైస్తవుల చేతుల్లో అమానుష హింస అనుభవించిన యూదులు తమని ఏ హింసకు గురిచెయ్యని, అరబ్బు పాలస్తీనా ప్రజల పట్ల క్రూరమైన పీడకులుగా ఎట్లా మారారు?

పరిస్థితి ఉండేదని టూరిస్టు గైడ్లు మనకి చూపిస్తారు. ఎవరెవరు ఎక్కడెక్కడ నుండి ఎట్లా పారిపోయారు, ఎట్లా చంపబడ్డారో అనే సూక్ష్మ చరిత్రలు కూడా చాలా రాయబడి వున్నాయి. ప్రాగ్ నగరంలో కాఫ్కా నివసించిన చిన్న ఇల్లు, ఆ నగరంలో 500 గజాల స్థలంలో 10,000 మందికి పైగా సమాధులు, ఖాళీ అయిన ఇళ్ళు... ఇవన్నీ ఎన్నెన్నో విషాద చరిత్రలను జ్ఞాపకం చేస్తాయి. యూరోపు అంతా ఏదో విధంగా నిండిన ఈ జ్ఞాపక చిహ్నాలు చూసి, వాటి గురించి చదువుతున్నప్పుడు, తెలుసుకుంటున్నప్పుడు మనలో అనేక ప్రశ్నలు ఉదయిస్తాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూదులకు సమాన హక్కులు ఇచ్చినా ఐరోపా నుండి వారు ఎందుకు వెళ్లిపోయారు? ప్రజాస్వామిక, ఉదారవాద జాతి రాజ్యాలుగా ప్రసిద్ధి పొందిన ఐరోపా దేశాలు, అమెరికా యూదులకు అటువంటి రక్షణ కల్పిస్తామనే భరోసా ఇచ్చి తమ సమాజాలలోనే వారిని ఎందుకు నిలుపుకోలేదు? అసలు యూదులు ఐరోపా నుండి వెళ్ళిపోవటం అంటేనే ఐరోపా దేశాలన్నీ క్రైస్తవ రాజ్యాలని మళ్ళా నిరూపించటమే కదా? అన్నింటి కన్నా ముఖ్యంగా, ఐరోపాలోని తమ తోటి తెల్ల జాతి క్రైస్తవుల చేతుల్లో అమానుష హింస అనుభవించిన యూదులు తమని ఏ హింసకు గురిచెయ్యని, తమతో ఏ సంబంధం లేని అరబ్బు పాలస్తీనా ప్రజల పట్ల క్రూరమైన పీడకులుగా ఎట్లా మారారు?

◆ ఎ.సునీత

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.


ఆంధ్రజ్యోతి ★
ANDHRAJYOTHY
గ్రేటర్ 5 వరంగల్
ఆదివారం 27 అక్టోబరు 2024



బల్దియా అదనపు కమిషనర్‌గా జోనా నియామకం

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఈసంపెల్లి జోనాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎం. దానకిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలలో భాగంగా ప్రస్తుతం వర్ధన్నపేట మున్సిపాలిటీలో స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న జోనాను వరంగల్ బల్దియాకు నియమిస్తూ అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం వరంగల్ నగర పాలక సంస్థలో అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న చింతకుంట్ల రాజేందర్‌రెడ్డిని సీడీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేశాలని ఆదేశాలు జారీ చేశారు.





ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాల ఆవరణ

కోటకు కొత్త అందాలు

- చెదిరిపోతున్న శిల్పకళకు నూతనత్వం
- రసాయనిక చర్యలతో పునరుజ్జీవం
- పూర్వ రూపం చెడిపోకుండా చర్యలు
- ఖిలావరంగల్‌కు పెరుగుతున్న పర్యాటకులు

8

కాకతీయ కాలం నాటి అద్భుత శిల్పసంపదకు నెలవు ఓరుగల్లు. కాలక్రమేణా కనుమరుగవుతున్న కళాసంపదను పూర్వరూపంలోనే భావి తరాలకు అందించేలా పురావస్తుశాఖ చర్యలు చేపట్టింది. రసాయనిక చర్యలతో గతంలో ఉన్న కళారూపాలు చెక్కుచెదరకుండా వాటిని పరిశుభ్రం చేసి నూతనత్వాన్ని ఆపాదింపజేశారు. అలా ఒకటి కాదు.. రెండు కాదు.. ఖిలావరంగల్ పడమర, మధ్య, తూర్పుకోటలతో పాటు శివారు ప్రాంతాల్లో ఉన్న బోలెడంత శిల్పసంపదకు నూతన సొబగులు అద్దారు. మధ్యకోటలోని దేవాలయాలు, నిర్మాణాలు, కట్టడాలు, శిల్పసంపదలు, శత్రురాజుల చేతుల్లో చెల్లాచెదురై మట్టి దిబ్బలుగా పడిఉన్న కోట సుందరంగా తీర్చిదిద్ది పునఃప్రతిష్ఠ కోసం సిద్ధమవుతోంది. అంతే కాదు మున్ముందు మరికొన్ని వందల సంవత్సరాలు చెక్కుచెదరకుండా కాపాడేలా కేంద్ర పురావస్తుశాఖ ఓ డీపీఆర్‌ను కూడా సిద్ధం చేసింది. ఇప్పటికే పలు అభివృద్ధి, సుందరీకరణ పనులతో వరంగల్ కోటకు సందర్శకుల సంఖ్య పెరుగుతోంది.

- ఖిలా వరంగల్

హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి పెంపు

- ములుగు గిరిజన వర్సిటీకి భూమి కేటాయింపు
- ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు
- మంత్రివర్గం నిర్ణయం

హనుమకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు జరిగాయి. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రస్తుత పరిధిని పెంచాలని నిర్ణయించారు. అయితే ఎటు నుంచి ఏఏ మండలాలను కలపడం ద్వారా ఈ రెండు జిల్లాల పరిధిని పెంచుతారనేది స్పష్టత లేదు. రెండు మండలాలను కలపడం ద్వారా హనుమకొండ జిల్లా, రెండు లేదా మూడు మండలాలను కలపడం ద్వారా వరంగల్ జిల్లా పరిధిని పెంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ములుగు జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన సమ్మక్క సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయానికి 211 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అలాగే ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ విలేకరుల సమావేశంలో ఈ నిర్ణయాలను వెల్లడించారు.

గత పాలకుల అసమర్థతతో.. అభివృద్ధిలో

20ఏళ్లు వెనక్కు

వరంగల్ అభివృద్ధిపై చర్చకు పిలిస్తే.. పారిపోయారు



8

- నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణంపై బహిరంగ చర్చకు ఇప్పటికీ సిద్ధమే
- నేను బ్రిడ్జిని కట్టించలేదని ఏ ఒక్కరు అన్నా రాజీనామాకు రెడీ
- కాళోజీ పేరుతో అధికారంలోకి వచ్చారు.. కళాక్షేత్రం పేరుతో దోచుకున్నారు
- కక్ష సాధింపే ఉంటే.. వినయ్‌భాస్కర్ వరంగల్‌లో ఉండేవారా?
- మూడు నెలల్లో కాజీపేట బ్రిడ్జి పూర్తి చేయిస్తా
- కార్పొరేషన్, యూనివర్సిటీ, ఎంజీఎం ప్రక్షాళనకే నా తొలి ప్రాధాన్యం
- 'ఆంధ్రజ్యోతి'తో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

గత పాలకుల అసమర్థత కారణంగా వరంగల్ నగరం అభివృద్ధిలో 20ఏళ్లు వెనక్కు వెళ్లిందని.. సరైన నాయకత్వం లేకపోవడం.. దృష్టిపెట్టక పోవడంతో కనీసం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కూడా తీసుకురాలేకపోయారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నేతల తీరును ఆక్షేపించారు. అలాంటి నేతలు ప్రజల కోసం పనిచేస్తున్న తమపై ఆరోపణలు ఎందుకు చేస్తున్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన పలు రాజకీయ, అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. తాను నయీంనగర్ వంతెన నిర్మాణం విషయంలో బహిరంగ చర్చకు పిలిస్తే.. వారు పిరికి పందల్లా పారిపోయారని ఎద్దేవా చేశారు. తనకు రాజకీయ కక్షలు లేవని, అభివృద్ధి కోసమే పని చేస్తున్నానని, వరంగల్ కార్పొరేషన్, కాకతీయ యూనివర్సిటీ, ఎంజీఎంలను ప్రక్షాళన చేయటమే తన మొదటి ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

- వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

మహిళలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలి
వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

7

ఫిబ్రవరిలో మేడారం మినీజాతర

- 12వ తేదీ నుంచి 15వరకు నిర్వహణకు నిర్ణయం

మేడారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వనదేవతలుగా ప్రసిద్ధి చెందిన సమ్మక్క సారలమ్మ, పగిడి ద్దరాజు, గోవిందరాజుల మినీ జాతరకు పూజా రులు తేదీలను అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో శనివారం ఖరారు చేశారు. అమ్మవార్ల ప్రాంగణంలో పూజారులు సమావేశమై మాఘ శుద్ధ పౌర్ణమి గడియలను పరిశీలించి 2025 ఫిబ్రవరి 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నాలుగు రోజుల మినీ సం బురం జరపను న్నట్లు తెలిపారు. ఈ సం దర్భంగా 2025 ఫిబ్రవరి 12 బుధవారం ప్రథ మ పూజలు మండె మెలుగు కార్యక్రమం, గ్రామంలోని దేవాలయాలు శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందన్నారు. అదేవి ధంగా రక్షతోరణాలు, ద్వారబంధాలు వంటి కార్యక్ర మాలు చేయనున్నట్లు తెలిపారు. 2025 ఫిబ్రవరి 13 గురువారం రహస్య పూ జలు 14 శుక్రవారం, 15 శనివారాల్లో ప్రత్యేక రహస్య పూజా కార్యక్రమాలు చేసి మినీ జాత రను ముగించనున్నమన్నారు. ఈ తేదీలను దేవా దాయ ధర్మాదాయ శాఖ అధికా రులకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమం లో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబో యిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, సం ఘం సభ్యులు కొక్కెర కృష్ణయ్య, పూజారు లు అరుణ్, రమేష్, బోజరావు, రమేష్, కాక కిరణ్, కాక అమృత పాల్గొన్నారు.

వర్గీకరణ అమలు చేయకపోతే.. రేవంత్‌రెడ్డి సర్కార్‌తో యుద్ధం చేస్తాం

- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మహాసభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

న్యూశాయంపేట, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోతే రేవంత్‌రెడ్డి సర్కార్‌తో యుద్ధం చేస్తామని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం రాత్రి ఉమ్మడి వరంగల్ జిల్లా మాదిగల ధర్మయుద్ధ మహాసభ జరిగింది. ఎంఆర్‌పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన జరిగిన మహాసభకు ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే అసెంబ్లీ సాక్షిగా దేశంలో మేమే మొదట ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని, అన్ని నోటిఫికేషన్‌లకు వర్తించేలా ఆర్డినెన్స్ తెస్తామని మోసపు మాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగాల

▸▸ మిగతా 7వ పేజీలో..


మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో నిరసన తెలుపుతున్న పోలీసు సిబ్బంది

'ఒకే రాష్ట్రం, ఒకే పోలీసింగ్' చేయాలి

- ఫోర్త్ బెటాలియన్‌లో పోలీసుల నిరసన
- ఆందోళనలు చేయవద్దన్న ఉన్నతాధికారులు

6


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్
- ముగిసిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు

6

పకడ్బందీగా ధాన్యం సేకరణ

బి. సంధ్యారాణి, పౌరసరఫరాల శాఖ డీఎం, వరంగల్



ముఖాముఖి

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు ?

డీఎం: వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేశారా ?

డీఎం: ప్రభుత్వం ఈసారి సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. అందుకు తగిన ఏర్పాట్లు చేశాం. రెండు రకాల వడ్లను ఒకే కేంద్రంలో కొనుగోలు చేస్తున్నాం. ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు.

ఆంధ్రజ్యోతి: కేంద్రాల వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు ?

డీఎం: అకాల వర్షాల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా టార్పాలిన్, గన్నీ సంచులు అందుబాటులో ఉంచుతున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు ఎక్కడైనా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారా ?

డీఎం: సంగెం, గీసుగొండ, రాయపర్తి, పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల్లో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. నవంబర్ మొదటి వారంలో ఎక్కువ సంఖ్యలో ప్రారంభిస్తాం.

- వరంగల్ కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

అహంకారంతో మాట్లాడితే ఊరుకోం

- కేసీఆర్ కూడా గతంలో ఇతర పార్టీల నుంచి చేర్చుకున్నారు
- కేటీఆర్‌పై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజం
- నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారనని స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అహంకారం, బలుపుతో మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. శనివారం ఘన్‌పూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2023 వరకు వివిధ పార్టీలకు చెందిన అనేక మంది ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకోవడం సంసారం.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం వ్యభిచారమా.. అని ప్రశ్నించారు. పార్టీ మారిన వారు రాజకీయ వ్యభిచారులు అని కేటీఆర్ మాట్లాడడం, ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. దశాబ్దాలుగా అనేక మంది పార్టీలు మారారని, చట్టం వచ్చిన తర్వాత కూడా ఫిరాయించారని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపుల పైన కోర్టులు స్పష్టమైన తీర్పులు ఇస్తున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల పైన హైకోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. కోర్టు తీర్పు ఏ రకంగా వచ్చినా ఎవరికి అనుకూలంగా వచ్చిన తీర్పును శిరసావహిస్తామన్నారు.

కేసీఆర్ కూడా పార్టీ ఫిరాయించాడు..

కేసీఆర్ తన రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్‌తో ప్రారంభించి.. తర్వాత టీడీపీ చేరాడని, ఆ తర్వాత టీఆర్‌ఎస్ పెట్టి బీఆర్‌ఎస్‌గా మార్చారని కడియం పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 10ఏళ్ల కాలంలో అనేక మంది ఎమ్మెల్యేలను చేర్చుకొని ఫిరాయింపులకు పాల్పడ్డారని అన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి రాజకీయ వ్యభిచారానికి పెద్దపెద్ద కార్యాలయాలను ప్రారంభించింది, ద్వారాలను తెరిచింది కేటీఆర్ అని మండిపడ్డారు. హరీశ్‌రావు తన కంటే ముందుకు వెళ్తున్నాడని, ప్రతీ రోజు మీడియాలో కనిపిస్తున్నాడని, దీంతో తను వెనుకబడి పోతున్నాననే భయంతో సభ్యత, సంస్కారం కోల్పోయి కేటీఆర్ మాట్లాడుతున్నాడని కడియం విమర్శించారు.

అభివృద్ధి కోసమే పార్టీ మారా..

తాను నియోజవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని కడియం తెలిపారు. తాను పార్టీ మారడాన్ని నియోజకవర్గ ప్రజలు సమ్మతించారని అందుకు నిదర్శనం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 55వేల మెజారిటీ రావడమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్న, అంబటి కిషన్‌రాజ్, నాగరబోయిన శ్రీరాములు, శిరీష్ రెడ్డి, గడ్డమీది సురేష్, నూకల ఐలయ్య, కనకం రమేష్, పోలెపల్లి రంజిత్ రెడ్డి, బూర్ల శంకర్, కోతి రాములు, పోగుల సారంగపాణి, దైద ఎలిషన్, రజాక్‌యాదవ్, తెల్లాకుల రామకృష్ణ, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల్లో లేఖ కలకలం!

- 2004 బ్యాచ్ సిబ్బంది తీరుపై ఆక్షేపణలు
- అజ్ఞాత వ్యక్తి లేఖతో తీవ్ర చర్చ

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఓ అజ్ఞాత వ్యక్తి విడుదల చేసిన లేఖ పోలీసు, పొలిటికల్ వర్గాల్లో కలకలం రేపింది. ఇటీవల ఓ మైనర్‌పై అత్యాచారాయ త్నానికి పాల్పడిన వీఆర్ సీఐ ఎం.రవికుమార్ ఉదంతాన్ని తీవ్రంగా ఖండించడంతో పాటు ఆయన్ను కఠినంగా శిక్షించాలని, నడిబజారులో కొట్టాలంటూ ఆ లేఖలో డిమాండ్ చేయడం చర్చనీయాంశమైంది. రవికుమార్ ఫొటోతో పాటు మెట్‌పల్లిలో పని చేసినప్పుడు రవికుమార్ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ ఆరోపించారు. ఇక 2004 బ్యాచ్‌కు చెందిన పోలీసులు ఒక నిధిని ఏర్పాటు చేసుకున్నారని, తమ బ్యాచ్‌కు చెందిన సీఐలే అన్నీ సర్కిళ్లలో ఉండేలా ఎమ్మెల్యేలకు డబ్బులు ఇచ్చి పోస్టింగులు తీసుకుంటున్నారని ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆ బ్యాచ్ వారే పోస్టింగులు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ బ్యాచ్‌లో కొందరు రూ.10 నుంచి రూ.50కోట్ల వరకు అక్రమ ఆస్తులు కూడపెట్టుకున్నారని, ఎనిమిదేళ్ల పోస్టింగులను పరిశీలిస్తే 2004 బ్యాచ్ వివరాలు వెలుగులోకి వస్తాయని. నిఘా వర్గాలు, ఉన్నతాధికారులు విచారణ చేపట్టితే మరిన్ని విషయాలు బహిర్గతమవుతాయని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ఈ లేఖ రాసిన అజ్ఞాత వ్యక్తి ఎవరనేది చర్చనీయాంశంగా మారగా.. ఈ లేఖ వెనుక ఉన్న ఆ అజ్ఞాత వ్యక్తి ఎవరనేది తెలుసుకునేందుకు నిఘా వర్గాలు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే కొందరు ఖాకీల తీరుతో ఆందోళనలో ఉన్న పోలీసులకు ఈ లేఖ పెద్ద సవాల్‌గా నిలుస్తోంది.

మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శరత్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో వరంగల్‌లోనే మొట్టమొదటిసారిగా అత్యంత క్లిష్టమైన చికిత్సను విజయవంతం చేసినట్లు సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.శరత్‌రెడ్డి తెలిపారు. మెడికవర్ ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్డియాక్ సింకోపితో బాధ పడుతున్న వరంగల్‌కు చెందిన 77 సంవత్సరాల వయసు ఉన్న విద్యాసాగర్‌రావుకు మెడికవర్ డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో ఈ చికిత్స చేశామన్నారు. విద్యాసాగర్‌రావు గుండె లయ సక్రమంగా లేకపోవడంతో పాటు రక్తనాళాలు పూడుకుపోవటం, హార్ట్‌వాల్వ్‌లో అవరోధాలు వంటి సమస్యలతో బాధపడుతూ ఎన్నో ఆస్పత్రులలో చికిత్స పొందినా నాయం కాలేదని, తమ ఆస్పత్రిలో అడ్మిట్ అయిన వెంటనే మెరుగైన చికిత్స అందించి రోగి ప్రాణాలు కాపాడామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ సృజన్ అల్లాడి, అనస్థీషియా డాక్టర్ అవనీశ్, మెడికవర్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

28,29 తేదీల్లో ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-19 ఆధ్వర్యంలో ఈ నెల 28, 29తేదీల్లో హనుమకొండ జేఎన్‌ఎస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా డీవైఎస్‌వో, అండర్-19 కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్కూల్ నుంచి జారి చేసిన బోనఫైడ్ సర్టిఫికెట్, పదోతరగతి పాస్ మెమో జిరాక్సులపై తమ కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకాలు చేయించుకొని హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9849210746, 9963336559, 8008469219 సెల్ నెంబర్లలో సంప్రదించాలని అశోక్‌కుమార్ సూచించారు.

'పోరాట సభను విజయవంతం చేయాలి'

బాలసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాళోజీ కళాక్షేత్రంలో ఈ నెల 28న కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో కళాక్షేత్రం ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ఉదయం 11 గంటలకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరగబోయే పోరాట సభను విజయవంతం చేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, ఎస్ఐఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం గళమెత్తిన గద్దర్, గూడ అంజన్న, సాయిచంద్, చిందు ఎల్లమ్మ, మిద్దె రాములు, చుక్క సత్తయ్య వంటి వారు తెలంగాణ కళలను దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లారని అన్నారు. అలాంటి కళాకారులను గుర్తించి వారి విగ్రహాలను ఏర్పాటు చేసి వారి గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మణితేజ, కుమార్, విజయ్, సంతోష్, మహేందర్, సిద్ధు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ది ప్రభుత్వ హత్యే

- గిరిజన యువకుడు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం
- ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, మధుసూదనాచారి



పాలకుర్తిలో జరిగిన మహాధర్నాలో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్, చిత్రంలో మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గిరిజన యువకుడు శ్రీనివాస్‌ది ప్రభుత్వ హత్యేనని ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. ఇటీవల జనగామ జిల్లా పాలకుర్తిలో గిరిజన యువకుడు శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోగా ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పాలకుర్తిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. అంతకుముందు శ్రీనివాస్ స్వగ్రామం కొండాపురంలోని మేకలతండాకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం పాలకుర్తిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీలు మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకూ శాంతిభద్రతలు దిగజారిపోతున్నాయని గిరిజనులు, దళితులు అన్ని వర్గాల ప్రజలకు రక్షణ కరువైందని, రాష్ట్రంలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని ఎద్దేవా చేశారు. శ్రీనివాస్ విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పోలీస్‌స్టేషన్ సాక్షిగా తను పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడని, ఈ విషయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు స్థానం లేదని, నిత్యం నేరాలు, ఘోరాలు పెరుగుతున్నాయని అన్నారు. గిరిజన యువకుడు శ్రీనివాస్ ఆత్మహత్య ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు.

శ్రీనివాస్ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలను హత్య చేస్తున్నా కనీసం పోలీసులు కేసులు పెట్టడం లేదన్నారు. పోలీసులు వారి విధులకు లోబడి వ్యవహరించాలని, ప్రస్తుతం పోలీస్ శాఖలో ఆ పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. కేసీఆర్ పాలనలో శాంతిభద్రతలకు పెద్దపీట వేశారని, ఎక్కడ ఎలాంటి అన్యాయం జరిగినా బాధితుల పక్షాన ప్రభుత్వం నిలిచేదని గుర్తు చేశారు. పోలీస్ శాఖకు పూర్తి అధికారాలు కల్పించి స్వతంత్రంగా విధులు నిర్వహించేలా కేసీఆర్ స్వేచ్ఛా వాతావరణం కల్పించాడని అన్నారు. రేవంత్‌రెడ్డి హోంశాఖను తన గుప్పిట్లో పెట్టుకొని పోలీసులను పావులుగా వాడుకుంటున్నాడని ధ్వజమెత్తారు.

మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం, అధికార పార్టీకి చెందిన నాయకుల ఒత్తిడితోనే తనకు న్యాయం జరగడం లేదని చనిపోయే ముందు శ్రీనివాస్ చెప్పినా పట్టించుకోలేదన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో డీసీపీకి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, పార్టీ నాయకులు గాంధీనాయక్, యాకూబ్, దేవేందర్, మహేందర్, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లపై సమీక్ష

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు26: (ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోళ్లపై మార్కెట్ అధికారులు, వ్యాపారులతో కలెక్టర్ సత్యశారద శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తిలో తేమ శాతం 15 నుంచి 25 శాతానికి పెరిగిందని, దీంతో సీసీఐ పత్తి కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. రైతులు, రాష్ట్ర కాటన్ అసోసియేషన్ తరఫున కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. కొందరు రైతులను రెచ్చగొట్టి వ్యాపారులపైకి ఉసిగొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి శక్తులను నిరోధించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తగిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, ఉపాధ్యక్షుడు నాగమల్ల ఓంకారేశ్వర్, పింగిళి మల్లారెడ్డి, జీ వేణుగోపాల్, అల్లె సంపత్, మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవికుమార్
- ముగిసిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవికుమార్

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు26: (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ అన్నారు. హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 జూనియర్ కళాశాలల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. ఈ వేడుకలకు రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో, అండర్-19 జూనియర్ కళాశాలల కార్యదర్శి గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జేఎన్‌ఎస్ వేదికగా గత రెండు రోజులుగా క్రీడా ఎంపిక పోటీలు పండగ వాతావరణంలో నిర్వహించామన్నారు. రెండో రోజు ఖోఖో, తైక్వాండో, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్, క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 1200మంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారు త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నిట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ హరి, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి, ఖోఖో సంఘం బాధ్యుడు శ్యాంప్రసాద్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు డీఎస్‌ఏ కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

'ఒకే రాష్ట్రం, ఒకే పోలీసింగ్' చేయాలి

ఫోర్త్ బెటాలియన్‌లో పోలీసుల నిరసన

ఆందోళనలు చేయవద్దన్న ఉన్నతాధికారులు



ఫోర్త్ బెటాలియన్‌లో నిరసన తెలుపుతున్న సిబ్బంది

శంభునిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఒకే రాష్ట్రం, ఒకే పోలీసింగ్ వ్యవస్థ ఉండాలని రాష్ట్రవ్యాప్తంగా టీజీఎస్పీ బెటాలియన్లలో ఆందోళనలు మిన్నంటుతున్నాయి. తమకు న్యాయం చేయాలనే నినాదాలతో మామునూరు ఫోర్త్ బెటాలియన్ మార్మోగింది. శనివారం మామునూరులోని టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్‌లోని ఏఆర్ఎస్‌లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఏక్ పోలీసింగ్ చేయాలని నిరసన వ్యక్తం చేశారు. 260 మంది సిబ్బంది బెటాలియన్ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు 14 రోజులు విధులు నిర్వహించిన తర్వాత సెలవులు ఇచ్చేవారని, ప్రస్తుతం 26 రోజులు వరుసగా విధులు నిర్వర్తించిన తర్వాత 4 రోజుల సెలవులు ఇచ్చేలా కొత్త నిబంధనలు అమలు చేస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి బెటాలియన్‌కు చేరుకున్నారు. కమాండెంట్ రామ్‌ప్రకాశ్, అసిస్టెంట్ కమాండెంట్‌లతో సమావేశమయ్యారు. ఆందోళన చేపట్టిన సిబ్బందితో సమావేశమై వారి డిమాండ్‌లను విన్నారు. పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. టీజీఎస్పీ పోలీసుల సమస్యలను ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్తామని సీపీ హామీ ఇచ్చారు. దీంతో పోలీసులు విధుల్లో చేరారు.

కాగా, ఈ నిబంధనలపై రాష్ట్ర వ్యాప్తంగా టీజీఎస్పీ బెటాలియన్ల సిబ్బంది కుటుంబ సభ్యులు రోడ్డెక్కడంతో పోలీసు ఉన్నతాధికారులు ఈ నిబంధనలను వెనక్కు తీసుకుంటూ ఉత్తర్వులు ఇచ్చారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం



సారంగపాణి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఈగ మల్లేశం

వర్ధన్నపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన బొమ్మగాని సారంగపాణి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం.. సారంగపాణి భౌతిక కాయంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట తూళ్ల కుమారస్వామి, సిలువేరు రాజు, కొండేటి మహేందర్, తుమ్మల రవీందర్, సుధాకర్, ఐత యాకాంతం, రాజు తదితరులు ఉన్నారు.

ఐనవోలు: నందనం సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు కోడలు శ్వేత ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను శనివారం కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం పరామర్శించి ఆమె చిత్రపటం వద్ద నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు సిలివేరు కుమారస్వామి, ప్రతాప్‌రావు, కరిమిళ్ల సంపత్‌రావు, తూళ్ల కుమారస్వామి, మాదారపు సంపత్‌రావు, చిమ్మని గోపి, రాజు నివాళి అర్పించారు.

విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


గురుకులంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మడికొండ, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో కడిపికొండ మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాల విషయంలో అవగాహన కల్పించారు. అలాగే స్వల్ప అనారోగ్యంతో ఉన్న విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి తగిన మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి, బి. సంతోష్, ఆశాలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓంకార్‌కు ఎంసీపీఐ(యూ) నివాళి

గిర్మాజీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం పోరాడటమే మద్దికాయల ఓంకార్‌కు ఇచ్చే ఘన నివాళి అని ఎంసీపీఐ(యూ) వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్ అన్నారు. శనివారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేగా ప్రజలకు చేసిన సేవలను పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జగదీశ్వర్ వివరించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) వరంగల్ నగర నాయకులు నగేష్, ప్రభాకర్, నర్సయ్య, రవి, మల్లికార్జున్, గోవర్ధన్, ఐలయ్యతదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌పై వర్క్‌షాపు


వర్క్‌షాపులో పాల్గొన్న వైద్యులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లలలో ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ సంభవించినప్పుడు వెంటిలేటర్స్ ఉపయోగించే విధానంపై వర్క్‌షాపు నిర్వహించారు. వరంగల్ గ్రావిడ్ హోం హస్పిటల్‌లో శనివారం నిర్వహించిన వర్క్‌షాపులో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ సురేశ్‌లు ప్రసంగించారు. నియోనేటల్ కేర్ యూనిట్ పీడియాట్రిక్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ వెంటిలేటర్స్ ఉపయోగించే విధానం, నూతన పోకడలు వైద్యులకు వివరించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన పిల్లల వైద్యులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

గిర్మాజీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ లక్ష్మీపురంలో రూ.45 కోట్లతో నిర్మాణమవుతున్న వరంగల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం సలహాదారుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ అబ్బనికుంటలోని తెలంగాణ రైతు భవనంలో తెలంగాణ రైతు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వెంకటనారాయణ మాట్లాడారు. రెండేళ్ల క్రితం రూ. 14కోట్లతో నిర్మాణం ప్రారంభమైన వరంగల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ వ్యయం రూ.45 కోట్లకు చేరుకుందన్నారు. ఇప్పటికైనా మార్కెట్ పెండింగ్ పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అంశాల్ రెడ్డి, నగేష్, ఎల్లయ్య, రవీందర్ పాల్గొన్నారు.

మామునూరు పీటీసీలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ పూజ

శంభునిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్పీ ఇంజారపు పూజ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. డీఎస్పీ రవీందర్, రమేష్, ఆర్ఐ చంద్రశేఖర్, మహేష్, మహేందర్, ఏఆర్ఎస్ఐ సంజీవ, ఏడీఐలు శ్రీకాంత్ బెన్సన్, ఎల్.ప్రసాద్, నరేందర్, భరత్, నాగరాజులతో పాటు 40 మంది అధికారులు, సిబ్బంది, రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రిన్సిపాల్ పూజ పండ్లు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం రక్తనిధి కేంద్రం డాక్టర్లు ఆశాదేవి, గాయత్రిదేవి, పీటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, ఫిజియో థెరపిస్టులు సంధ్య, వర్షిణి పాల్గొన్నారు.

ముగిసిన కృతి సదస్సు

వరంగల్ మెడికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇది మన భవిష్యత్, వైద్య నిపుణుల నిబద్ధతకు, నిర్వాహక బృందం నిరంతర కృషికి సంకేతమని కృతి కన్వీనర్ డాక్టర్ సుజీత్ ఆర్ పున్నం అన్నారు. కాకతీయ మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్న కృతి-2024 కార్యక్రమం రెండవ రోజు శనివారం అట్టహాసంగా ముగిసింది. విద్యార్థుల విద్యాపరమైన నిబద్ధత, విశేష సాంకేతిక చర్చలతో సజీవంగా కొనసాగింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు పోస్టర్లు, పేపర్లు ప్రదర్శించి పరిశోధనలో వారి వారి అవగాహనను తెలిపారు. డాక్టర్ శ్రీలత తుముల సర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌తో సీఎంఈ టాక్‌తో విద్యాపరమైన వాతావరణాన్ని సృష్టించారు. కృతి అధ్యక్షుడు డాక్టర్ కె.రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కృతి కార్యక్రమం వైద్య విభాగం, నవీనతకు అంకితమైన ఉత్సవమని పేర్కొన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ మాట్లాడుతూ వైద్య విద్యార్థుల మధ్య ఐక్యత, జ్ఞాన పరంపరను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. డాక్టర్ విజయ్ యెల్దండితో పరిశోధన ప్రధాన సీఎంఈ టాక్ జరిగింది. ప్రెస్టీజియస్ డాక్టర్ సీడీ ఆర్ మెమోరియల్ ఒరేషన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ కత్తుల, కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య సుంకరనేని, డాక్టర్ వేణు, డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ ప్రవీణ్, వైద్య ప్రముఖులు హాజరయ్యారు.

ముగిసిన ఖోఖో శిక్షణా శిబిరం


క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న రామినేని రాజేశ్

మడికొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 27నుంచి 29 వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు మడికొండలోని రామన్ స్కూల్‌లో 5రోజుల పాటు శిక్షణా శిబిరం నిర్వహించారు. శనివారం జరిగిన శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో రామన్‌స్కూల్ కరస్పాండెంట్ రామినేని రాజేష్ పాల్గొని క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాకారులు పాజిటివ్ దృక్పథంతో పోటీల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు రాజేందర్, సురేష్, స్కూల్ పీఈటీలు రామ్మూర్తి, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య విషయాల్లో జాగ్రత్త వహించాలి

▸ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఎంపీ కడియం కావ్య

మడికొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గైనకాలజిస్టులు మహిళల మానసిక, ఆరోగ్య సమస్యలపై జాగ్రత్త వహించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. శనివారం మడికొండలోని రెడ్డి కన్వెన్షన్‌లో జరిగిన తెలంగాణ చాప్టర్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ గైనకాలజీ 7వ వార్షిక సదస్సులో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు కౌమార దశ నుంచి గర్భిణులు, మెనోపాజ్ వరకు వివిధ దశలలో ఎదురయ్యే శారీరక, మానసిక సమస్యలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రక్త హీనత, పౌష్టికాహార లోపం, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయాలని తెలిపారు. కొవిడ్ తర్వాత డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలతో సతమతమవుతున్నారని వారి మానసిక సమస్యలపై దృష్టి సారించాలన్నారు. రానున్న రోజులలో ఆధునిక శస్త్ర చికిత్సలు, వ్యాధులపై పరిశోధనలు జరిపే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. అలాగే రిసెర్చ్, పరిశోధనలు చేయడానికి అధిక నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు ఆర్థికంగానే కాకుండా ఆరోగ్యంగా కూడాబలంగా ఉన్నప్పుడే నిజమైన సాధికారత సాధించినట్లని తెలిపారు. ఇంత మంచి సదస్సును వరంగల్ వేదికగా నిర్వహించినందు కు నిర్వాహకులను ఈసందర్భంగా ఎంపీ అభినందించారు. కార్యక్రమంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కర్నాకర్‌రెడ్డి, డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ జమునాదేవి, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ మధుచంద్ర, గైనకాలజిస్టులు పాల్గొన్నారు. సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన వాసు ఆర్గానిక్ డ్రగ్స్ స్టాల్ వైద్యులను ఆకట్టుకుంది. కంపెనీ డైరెక్టర్ ఆఫ్ సేల్స్ నందకిషోర్, మూర్తి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా వాసు కంపెనీ క్వాలిటీ డ్రగ్స్‌ను ప్రజలకు అందిస్తోందని తెలిపారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

▸ పీడీఎస్‌యూ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బండి కోటేశ్వర్‌రావు


సమావేశంలో ప్రసంగిస్తున్న బండి కోటేశ్వర్‌రావు

ఖిలావరంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని ఆ సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి బండి కోటేశ్వర్‌రావు కోరారు. శనివారం ఖిలావరంగల్ కోటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు ఖిలావరంగల్‌లోని ముదిరాజ్‌భవన్‌లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. పీడీఎస్‌యూ జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థి ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. తర్వాత పీడీఎస్‌యూ చరిత్రపై వక్తలు ప్రసంగిస్తారన్నారు. సాయంత్రం ఖిలావరంగల్ మెట్టు దర్వాజ నుంచి పడమరకోట అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థి స్థూపం ఆవిష్కరణ, అనంతరం బహిరంగసభ ఉంటుందన్నారు. విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యూ పూర్వ అధ్యక్షుడు రాచర్ల బాలరాజు, నాయకులు నలిగంటి విజయపాల్, బైరబోయిన ఐలయ్య, ఇనుముల కృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటలో పీడీఎస్‌యూ స్థూపం ఆవిష్కరణ

బిగియించిన పిడికిలి, పీడీఎస్‌యూ చిహ్నం ఉన్న స్థూపాన్ని పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత విద్యార్థులు నిర్మించారు. ఖిలావరంగల్ కోటలో ఆదివారం ఈ చిహ్నాన్ని ఆవిష్కరించనున్నారు.

కళలను కాపాడుకోవాలి

ఆటోనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కళలు అంతరించిపోకుండా కాపాడుకోవాలని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ డిస్ట్రిక్ట్ 192 గవర్నర్ చిప్ప వెంకటేశ్వర్లు అన్నారు. గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడలో అంతర్జాతీయ కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పేరిణి కళాకారులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామప్ప ఆలయంపై ఉన్న భంగిమల ఆధారంగా ఈ కళను నాట్యగురువు నటరాజ రామకృష్ణ ఎంతోమంది శిష్యులకు నేర్పి జీవం పోశారన్నారు. ఆయన శిష్యుడు గజ్జల రంజిత్‌కుమార్ అంతర్జాతీయ స్థాయిలో ఈ కళను తీసుకువెళ్లి అనేకమంది మన్ననలు పొందినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ కుసుమ లింగమూర్తి, వరంగల్ జిల్లా మల్టిపుల్ కో-ఆర్డినేటర్ గజ్జల ఓంకారలింగం, క్యాబినెట్ సెక్రటరీ పెంట కుమార్, ప్రెసిడెంట్ దోమల నాగేందర్, జోనల్ చైర్మన్ ఎండీ దస్తగిరి, రీజనల్ చైర్‌పర్సన్ పరికిపండ్ల రాంబాబు, గాదె రాధిక, గజ్జల నవ్యజ, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్ స్టాఫ్‌కు 46 గంటల వారాంతపు విశ్రాంతి ఇవ్వాలి

కాజీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రన్నింగ్ స్టాఫ్ సిబ్బందికి 46 గంటల వారాంతపు విశ్రాంతి ఇవ్వాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) అసోసియేషన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ టి. హనుమయ్య డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏఐఎల్ఆర్ఎస్ఏ డివిజనల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హనుమయ్య హాజరై మాట్లాడారు. లోకో రన్నింగ్ స్టాఫ్‌కు డ్యూటీ గంటలు గూడ్స్‌లో 8 గంటలకు, కోచింగ్‌లో 6 గంటలకు పరిమితం చేయాలన్నారు. రెండు వరుస రాత్రి డ్యూటీల తర్వాత రాత్రి విశ్రాంతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి జిలానీ భాష, ఓబీసీ అసోసియేషన్ డివిజనల్ అధ్యక్షుడు రెండ్లరమేశ్, సంఘ్ నాయకుడు పాక పాక రాజు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గంజాయి పట్టివేత

కాజీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సిద్దార్థనగర్‌లో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి గంజాయితో పట్టుబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కాశిబుగ్గకు చెందిన నల్లగుణ సాగర్ శుక్రవారం కాజీపేట సిద్దార్థనగర్ వద్ద కొందరు యువకులకు గంజాయి అమ్మేందుకు వచ్చి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. గమనించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని అతనివద్ద ఉన్న 230 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిచింనట్లు ఎస్సై లవణ్‌కుమార్ తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలు రూ. 5750 ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఉచితంగా లేజర్ చికిత్స

వరంగల్ మెడికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిరుపేద బాలుడికి ఖరీదైన లేజర్ చికిత్సను ఉచితంగా అందజేసినట్లు హనుమకొండలోని శ్రీ శ్రీనివాస కిడ్నీ సెంటర్ యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన సంధ్య, శివ దంపతుల 14 నెలల బాబు మస్తా సుహాస్ ప్రిన్స్‌కు కిడ్నీలో 18 ఎంఎం రాయి ఉందని వైద్యులు నిర్ధారించారు. ఆ రాయిని కిడ్నీకి రంధ్రం కాకుండా చికిత్స చేయాలంటే రూ. 3లక్షల 50వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ విషయంలో నాలుగు, ఐదు ఆస్పత్రులు తిరిగి తన వద్దకు వచ్చినట్లు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితులను చూసి అత్యంత అధునాతనమైన లేజర్ చికిత్సతో రాయిని ఉచితంగా తొలగించినట్లు తెలిపారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉన్నాడని డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.


మాట్లాడుతున్న డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి

ఆయుర్వేద అవగాహన ర్యాలీ

గిర్మాజీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా శనివారం వరంగల్‌లో ఆయుర్వేద వైద్యులు, వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, ప్రభుత్వ ఆయుర్వేద బోధనా ఆస్పత్రుల ఆధ్వర్యంలో లేబర్ కాలనీలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల వద్ద ర్యాలీని వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ అనసూయ, ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మావతి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్లు జగన్మోహనాచారి, కవిత, శ్రీదేవి, మధు, ఈశ్వర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ సాంబమూర్తి, వైద్య అధ్యాపకులు, విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆందోళన

హనుమకొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లోఉన్నాయని, మూడు సంవత్సరాల నుంచి బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేటు డిగ్రీ యాజమాన్యాలు కళాశాలలు నడుపలేమని బంద్ చేసి దీక్షలు చేపడుతున్నారన్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడంతో కిరాయిలు చెల్లించలేకపోతున్నారన్నారు. విద్యారంగ సమస్యను పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. అనంతరం విద్యా రంగ సంస్థలపై తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుపై వివాదం

బాలసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుపై వివాదం నెలకొంది. తాత్కాలిక దుకాణ యజమానుల నూతన కమిటీ సభ్యులు అక్రమాలకు పాల్పడుతున్నారని మాజీ కమిటీ సభ్యుడు దర్శన్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో దీపావళి బాణసంచా తాత్కలిక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 120 దుకాణాలు ఏర్పాటుచేయగా, యజమానులు ఒక కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ సభ్యులు కరెంట్ బిల్లు పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. దుకాణదారుల నుంచి లక్షల రూపాయలను వసూలు చేసినట్లు దర్శన్ సింగ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రక్తదానం చేసి ముగ్గురి ప్రాణాలు కాపాడుదాం

హనుమకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి మరో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆర్మడ్ రిజర్వు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఆర్మడ్ రిజర్వు, ట్రాఫిక్ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువకులు, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసినవారిని సీపీ వ్యక్తిగతంగా కలిసి అభినందించడంతో పాటు పండ్లు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం పోలీసు కమిషనర్ మాట్లాడుతూ పోలీసులు కేవలం శాంతి భద్రతలను రక్షించడమే కాదు సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రవీందర్, అదనపు డీసిపిలు సురేష్ కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారాయణ, ఆర్ఐలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సర్కార్‌తో యుద్ధం చేస్తాం..

5వ పేజీ తరువాయి

భర్తీ చేస్తూ నమ్మకద్రోహం చేస్తున్నాడన్నారు. రేవంత్ రెడ్డిని నమ్మితే ఎంత మోసం చేస్తాడో టీచర్ల ఉద్యోగాల నియామకాలతో తేలిపోయిందన్నారు. 11వేలకు పైగా ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వలన మాదిగ, మాదిగ ఉప కులాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగాలను భర్తీ చేయడమంటే మా జాతుల భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టడమేనన్నారు. మాదిగ కోటలో మంత్రిగా, ఎమ్మెల్యేలుగా మన జాతి బిడ్డలు ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా, తిరుగుబాటు చేయడం లేదన్నారు. వర్గీకరణ అయ్యేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలన్నారు. డిసెంబర్ 21న చలో హైదరాబాద్‌తో ధర్మయుద్ధ మహాప్రదర్శనతో రేవంత్ సర్కార్‌తో తాడోపేడో తేల్చుకుంటాని హెచ్చరించారు.

ఈ ధర్మయుద్ధ మహాసభలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న, బొడ్డు దయాకర్ మాదిగ, ఎంఎల్ఎఫ్ జాతీయ అధ్యక్షులు వీపీ రత్నం, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి మాదిగ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ, ఎంఆర్‌పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు రాగళ్ల ఉపేందర్ మాదిగ, జన్ను దినేష్ మాదిగ, పుట్ట రవి మాదిగ, మంద రాజు మాదిగ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దు

▸ జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్


సమావేశంలో మాట్లాడుతున్న వై.వి.గణేష్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉజ్వల భవిష్యత్ కలిగిన యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వై.వి గణేష్ మాట్లాడారు. యువకులు మత్తు పదార్థాలకు అలవాటుపడకుండా చూసుకోవడంలో తమ కుటుంబీకుల బాధ్యత కీలకమన్నారు. తమ పిల్లల ఆహార అలవాట్లపై ప్రతీ రోజు తల్లిదండ్రులు నిఘా పెట్టాలన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలు, కళాశాలల పరిసర ప్రాంతాలలో ఉన్న పాన్‌షాపులు, చిన్న చిన్న సిగరెట్ విక్రయ దుకాణాల పట్ల నిరంతర నిఘా ఉండేలా చూసుకోవాలన్నారు. రద్దీగా, కూడలిలో ఉన్న ప్రతి పాన్‌షాపు, సిగరెట్ విక్రయ దుకాణాల పట్ల పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని, అనుమానాస్పదంగా తిరిగే వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 100, టోల్‌ఫ్రీ 1908కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో సెంట్రల్ జోన్ అదనపు డీసీపీ సలీమా, పరకాల ఆర్డీఓ నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఏసీపీలు, పోలీస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా సందీప్

ఖిలావరంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పోలెపాక సందీప్‌ను నియమించినట్లు రాష్ట్ర కళాకారుల విభాగం కన్వీనర్ ఎల్లా పోశెట్టి శనివారం తెలిపారు. వరంగల్ జిల్లా దూపకుంటకు చెందిన సందీప్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, కన్వీనర్ ఎల్ల పోశెట్టి, వరంగల్ ఉమ్మడి జిల్లా కళాకారుల నాయకుడు గడ్డం సుధాకర్‌కు సందీప్ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు త్వరగా పూర్తిచేయించాలి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు26: (ఆంధ్రజ్యోతి) : ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు త్వరగా పూర్తి చేయించాలని మంత్రి కొండా సురేఖను లక్ష్మీపురం ఫ్రూట్ మర్చంట్స్ అసోసియేషన్ కోరింది. వరంగల్ లక్ష్మీపురం ఎఫ్ఎంఏ అధ్యక్షుడు వెల్ది సాంబయ్య ఆధ్వర్యంలో ప్రతినిధులు శనివారం ఓసిటీలోని క్యాంపు కార్యాయంలో మంత్రి సురేఖను కలిశారు. పాత కూరగాయల మార్కెట్ స్థలం పండ్ల మార్కెట్‌కు కేటాయించాలని సాంబయ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయించి త్వరగా వ్యాపారులకు అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు. పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు మంత్రి లేఖ రాశారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

పోచమ్మమైదాన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించని ఆస్పత్రులు, పాలి క్లినిక్‌లు, ల్యాబ్‌ల నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. వరంగల్ నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెం టర్లను శనివారం డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. శివనగర్‌లో రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న హెల్త్‌లైన్ డయాగ్నస్టిక్ సెంటర్, ఫోర్టు వరంగల్‌లో అర్హత లేకుండా ఆర్ఎంపీ నిర్వహిస్తున్న త్రివేణి డయాగ్నస్టిక్ సెంటర్లను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఎస్వో విజయలక్ష్మి, ఎల్‌డీ క ంప్యూటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు పరిమితంగా వాడాలి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో రసాయన ఎరువులు పరిమితంగా వాడాలని విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.రాములు అన్నారు. శనివారం వరంగల్ ప్రాంతీయ పరిశోధన కార్యాలయంలో నాబార్డు ఆర్థిక సాయంతో రాములు రైతులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులకు పలు విషయాలు వివరించారు. మోతాదుకు మించి ఎరువులు వాడకం వల్ల నేల, నీరు, వాతావరణం కలుషితమవుతున్నదన్నారు. యూరియాపై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. నేల స్వభావాన్ని బట్టి పంటలను సాగు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వేరుశనగ, పెసర, మినములు, శనిగ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేని టాపాసుల విక్రయాలు నేరం

హసన్‌పర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని టపాసుల విక్రయాలు నేరమని అటువంటి బాంబుల దుకాణాల నిర్వహణపై చట్టపరమైన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు హెచ్చరించారు. మండలంలోని అర్వపల్లిలో గుల్లపల్లి రాజు, గుల్లపల్లి రమేష్ ఇంట్లో దీపావళి మందుగుండు సామాగ్రి అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. సుమారు రూ.24,23,400 విలువ గల మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెట్ట చేరాలు తెలిపారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్లే బీసీలకు అన్యాయం

▸ బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్


మాట్లాడుతున్న బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్

హసన్‌పర్తి, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ల వల్లే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట బీసీ రాజ్యాధికార సమితి ప్రాంతీయ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గాజు యుగందర్ యాదవ్ ఆధ్వర్యంలో బీసీ నాయకత్వ శిక్షణ, ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్త కమిటీల నిర్మాణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా నియామకమైన మండల, నియోజకవర్గస్థాయి నాయకులకు నియామక ప్రతాలను అందజేసి మాట్లాడారు. త్వరలో ఉత్తర తెలంగాణలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. బీసీల రాజకీయ ఎదుగుదల ఆవశ్యకమని నాయకులకు వివరించారు. తెలంగాణలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయడంతో పాటు దొడ్డిదారిన ప్రవేశపెట్టిన జీవో నెం. 29ను రద్దు చేయాలని కోరారు. లేని పక్షంలో పూర్తి స్థాయి తెలంగాణ వ్యాప్త కమిటీలను నిర్మాణంచేసి తమ సింహగర్జనను వినిపిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఏరుకొండ హైమావతి, సీనియర్ మహిళా నాయకురాలు కత్తుల కవిత, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి ముంజాల రాజేందర్, గౌరవాధ్యక్షుడు జూలూరి రమేష్‌గౌడ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గడి వీరేందర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా చందు, కార్యదర్శి కల్లెబోయిన సురేందర్, యూత్ అధ్యక్షుడు రావుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

‘కోట’కు కొత్త అందాలు

- చెదిరిపోతున్న శిల్పకళకు నూతనత్వం
- రసాయనిక చర్యలతో పునరుజ్జీవం
- పూర్వ రూపం చెడిపోకుండా చర్యలు
- ఖిలావరంగల్‌కు పెరుగుతున్న పర్యాటకులు



ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాల ఆవరణ

సండే స్పెషల్ SUNDAY SPECIAL

ఖిలా వరంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 700 ఏళ్ల నాటి కాకతీయ శిల్పకళావైభవం కనుమరుగవుతున్న క్రమంలో ఆ సంపదను భావితరాలకు అందించేలా జరుగుతున్న చర్యలు ఫలిస్తున్నాయి. నాటి శిల్పాలను రసాయనిక చర్యలతో రూపం చెడకుండా పరిశుభ్రం చేసి నూతనత్వాన్ని ఆపాదింపజేశారు. ఖిలావరంగల్ పడమర, మధ్య, తూర్పుకోటలతో పాటు శివారు ప్రాంతాలలో బోలెడంత శిల్పసంపదకు నూతన సొబగులు సమకూరాయి. మధ్యకోటలోని కాకతీయుల రాజులు నిర్మించిన దేవాలయాలు, నిర్మాణాలు, కట్టడాలు, శిల్పసంపదలు శత్రురాజుల దాడుల్లో చెల్లాచెదురై మట్టి దిబ్బగా పడిఉన్న కోటను కేంద్రపురావస్తుశాఖ ఆధ్వర్యంలో పునరుజ్జీవం కల్పించే చర్యలు జరుగుతున్నాయి. నాటికాలం దేవాలయాలు, కట్టడాలు, శిల్పాలను 24 ఏళ్ల క్రితం తమిళనాడుకు చెందిన శిల్పులు ఏ శిల్పం ఏ ప్రాంతంలో ఉండాలో, చారిత్రక అంశాలకు అనుగుణంగా కేంద్ర పురావస్తుశాఖావారు చరిత్ర వక్రీకరించకుండా ప్రదర్శనకుంచారు. ఇంకా ఖిలావరంగల్ మధ్యకోటలోని నాలుగు కీర్తితోరణాలు, శిల్పాల ఆవరణలోని శిల్పసౌందర్యాలు, ఖుష్‌మహల్, ఏకశిలగుట్ట, స్వయంభూ-శంభులిగేశ్వర స్వామి దేవాలయం, నేలశంభునిదేవాలయం, లక్ష్మీకొండలదేవాలయం, విఘ్నేశ్వరదేవాలయం, శివాలయం, రామాలయం, నాగమయ్యదేవాలయం, హనుమాన్‌దేవాలయం, మాండాలమ్మ దేవాలయం, సింగారపుబావి, అక్కాచెల్లెళ్ల బావి, సవతుల బావి, కోడికూతబావి, మెట్లబావి, బియ్యంగడ్డ, ఈసన్న బావి, ఏకశిల గుట్ట, గుండుచెరువు, గుర్రపుశాల, కత్తికోట, రాతి, మట్టికోటలు పర్యాటకులకు దర్శనమిస్తాయి. ఇలా ఈ శిల్పసంపదను భావితరాలకు అందించేందుకు ఉపయుక్తంగా ఉండేలా మళ్లీ కొన్ని వందల సంవత్సరాలు చెక్కుచెదరకుండా కాపాడేలా కేంద్ర పురావస్తుశాఖ వరంగల్ శిల్పసంపదపై డీపీఆర్ సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) ముందుకు రావడంతో కేంద్ర పురావస్తుశాఖ ద్వారా ఐవోసీ నిధులను వరంగల్ ప్రాంతానికి కేటాయింపచేయడంతో సఫలీకృతం కాగా ఇప్పుడు వాటికి సంబంధించి పనులు ప్రారంభంకావడం ఓరుగల్లు చరిత్రకు మహర్దశ తెచ్చినట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



రాళ్లపై చెక్కిన నాటి అద్భుత శిల్పకళాఖండాలు

కోటలో సౌండ్ అండ్ లైట్ షో..

రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పదేళ్ల క్రితమే రూ.4కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్ షో కూడా మరింతగా ఆధునీకీకరింపజేసి ప్రస్తుతం నూతనత్వంతో ప్రదరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రముఖ గానగాంధర్వుడు స్వర్గీయ బాలసుబ్రహ్మణ్యం ‘ఓరుగల్లు రా - ఓరుగల్లు రా, వీరనారులకు ఇది పుట్టినిల్లురా’ అంటూ ఆయన గళం నుంచి జాలువారిన ఓరుగుల్లు చారిత్రక విశేషాలు, 50 నిమిషాల నిడివి గల సౌండ్ అండ్ లైట్ షో యథాతథంగా మరింతగా సందర్శకులను కనువిందు చేస్తాయనడంలో సందేహం లేదు.

ముఖ్యమైన రోజుల్లో పసాడ్ వెలుగులు

చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలావరంగల్ రాతికోట చుట్టూ పసాడ్ ఆధ్వర్యంలో విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేశారు. ఖిలావరంగల్ మధ్యకోటలోని రాతికోట చుట్టూ సుమారు 4కిలోమీటర్ల చుట్టూ, అలాగే ఏకశిల గుట్టపై, ఖుష్‌మహల్ చుట్టూ, పసాడ్ విద్యుత్ వెలుగులు రాత్రులు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. పసాడ్ విద్యుత్ వెలుగులు ప్రతిసంవత్సరం ఆగస్టు 15న, స్వాతంత్ర్య దినోత్సవం, జనవరి 26న, ఘనతంత్ర దినోత్సవం, జూన్ 2 తెలంగాణ అవతరణదినోత్సవం, ముఖ్యమంత్రి, గవర్నర్, కేంద్ర మంత్రులు. పండుగలు, తదితర రోజులలో పసాడ్ వెలుగులు పర్యాటకులను కనువిందు చేస్తాయి.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో లేజర్‌షో..

ఇందులో భాగంగా మొన్నటిదాకా కేంద్ర సాంస్కృతిక శాఖామంత్రిగా ఉన్న జి.కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గత సంవత్సరం లేజర్‌షో మంజూరైంది. ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాల ఆవరణ రాత్రులు వెన్నెల కురిసిన రాత్రిలాగా పర్యాటకులను కనువిందు చేస్తుందనడంలో అతిశయోక్తిలేదు. సుమారు రూ. 6కోట్లతో అపూర్వలేజర్‌షో వరంగల్ సందర్శకులకు అపూర్వ ఆకర్షణ.

సౌకర్యాలను ఏర్పాటు చేయాలి..

ప్రపంచ, దేశవిదేశాలలో పేరెన్నికగల కాకతీయుల కట్టడాలు, నిర్మాణాలు, అద్భుత శిల్పసంపదలు కలిగిన ఖిలావరంగల్ మధ్యకోట ప్రాంతానికి ఫైవ్‌స్టార్ హోటళ్లు, కాటేజీలు, కోట చుట్టూ బోటింగ్, ఆర్టీసీ మినీ బస్సు, విద్యుత్‌దీపాలు, రోడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలి. దీంతో ఖిలావరంగల్ కోటకు మరింతగా పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఖిలావరంగల్‌లో కాకతీయుల కాలంనాటి కీర్తితోరణం

31న మంగళహారతులు, 1న నోములు

- భద్రకాళి దేవస్థానం అర్చకుడు శేషగిరిరావు



భద్రకాళి ఆలయ అర్చకుడు శేషగిరిరావు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నరక చతుర్దశి, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 31న మంగళహారతులు తీసుకోవాలని, సాయంత్రం ధనలక్ష్మీ, అమావాస్య పూజలను ఆచరించుకోవాలని భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకుడు బి.శేషగిరిరావు శనివారం తెలిపారు. 31న బ్రాహ్మీ ముహూర్తం తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 లోపు మంగళహారతులు తీసుకోవాలని, నువ్వుల నూనెతో అభ్యంగన స్నానం చేయడం ద్వారా లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుందన్నారు. తద్వారా గంగలో స్నానం చేసిన ఫలం దక్కుతుందన్నారు. నూతన వస్త్రాలు ధరించి ఆడబిడ్డలతో హారతులు తీసుకోవాలని తెలిపారు. సాయంత్రం వ్యాపార సంస్థలు, దేవాలయాలు, గృహాల్లో ధనలక్ష్మి పూజ చేయాలన్నారు.

నవంబరు 1న కేదారేశ్వర నోములు ఆచరించుకోవాలి

కేదారేశ్వర స్వామి(లక్ష్మీదేవి) నోములను నవంబరు 1న ఆచరించి 2న నోములను ఎత్తుకోవాలని శేషగిరి తెలిపారు. నోములు పడిపోయిన వారు, కొత్తగా నోములు పట్టుకునే వారు, నోములను పంచుకునే వారు ఈ ఏడాది అనుకూలమైన ముహూర్తం ఉందని వివరించారు.

ఆలయాల్లో కార్తీక మాస వేడుకలు నిర్వహించాలి

- నవంబరు 2నుంచి డిసెంబరు 1వరకు ఉత్సవాల నిర్వహణ

వరంగల్ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో కార్తీక మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. దేవాలయాల ఈవోలు, సహాయ కమిషనర్‌కు ఉత్తర్వులు అందినట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాయల సునీత శనివారం తెలిపారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించాలని దేవాదాయ శాఖ విడుదల చేసిన గైడ్‌లైన్‌లో పేర్కొన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించాలని తెలిపారు. దీపోత్సవంలో భాగంగా స్థానిక కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆలయాల్లో జరిగే కార్యక్రమాలను ప్రసార సాధనాల ద్వారా భక్తులకు తెలపాలన్నారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

నరకాసుర వధ పోస్టర్ల ఆవిష్కరణ



నరకాసురవధ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

కరీమాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా ఉర్సు గుట్ట రంగలీలా మైదానం కుడా ప్రాంగణంలో ఈనెల 30న నరకాసుర వధ వేడుకలను నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో శనివారం మంత్రి కొండా సురేఖ నివాసంలో ఆమె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, సహాయ కార్యదర్శి ఆనునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్ దూడ కొమురెల్లి, మిర్యాల ఆదిత్య, కుండె రాజు, తౌటం నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

నేడు జానపద ఆట పాటల జాతర

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఓరుగల్లు గాన గంధర్వులు దివంగతులు వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి యాదిలో జానపద ఆట పాటల జాతర- 2024 కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్ తెలిపారు. వరంగల్ శంకర్ , దీకొండ సారంగపాణి కీర్తి పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకులు సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ హాజరవుతారని సినీ గాయకులు, రచయితలు వరంగల్ శ్రీనివాస్, నీరడి ప్రణయ్ కుమార్,అంతడుపుల నాగరాజు, భూక్య సుశీల, జడల శివ పాల్గొంటారని తెలిపారు. కవులు, కళాకారులు, సంగీత అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వన్ నేషన్.. వన్ స్టూడెంట్.. వన్ నెంబర్

- ఆధార్ తరహాలో విద్యార్థులకు ‘అపార్’ గుర్తింపు
- కార్డుల జారీకి కేంద్రం మార్గదర్శకాలు
- తల్లిదండ్రుల సమ్మతితో విద్యాశాఖ కసరత్తు

• మీ కోసం

వెంకటాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ‘వన్ నేషన్ వన్ స్టూడెంట్’ నినాదంతో పాటు.. జాతీయ నూతన విద్యా విధానం-2020 అమలులో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకూంట్ రిజిస్ట్రీ(అపార్) విధానంలో దేశంలో ప్రతీ విద్యార్థికి ఒక గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది. జాతీయ స్థాయిలో జరిగే ఈ ప్రక్రియలో విద్యార్థుల పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారు. ఈ దిశగా అడుగేసింది. కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థుల కు ఈ నెంబరును కేటాయించేలా కార్యాచరణ మొదలు పెట్టనుంది. అపార్ అనేది విద్యార్థి జీవితకాల ఐడీగా పరిగణిస్తారు. ఇందులో విద్యార్థి అకడ మిక్ జర్నీ, విజయాలు తదితర సమచారాన్ని నిక్షప్తం చేసి ఉంచుతారు. అయితే తల్లిదండ్రులకు ఈ ఐడీ ప్రాముఖ్యతను వివరించి వారి సమ్మతితో తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలకు మార్గదర్శకాలను జారీ చేసింది.

ప్రయోజనమేంటి?

విద్యార్థి కేజీ నుంచి పీజీ వరకు చదివిన, చదువుతున్న సమగ్ర వివరాలు ఒకే గొడుగు కిందకు వస్తాయి. ఎల్‌కేజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు పూర్తి వివరాలును ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా ఈకార్డు ఉపయోగపడనుంది. ఈకొత్త కార్డును ఆధార్ సంఖ్యతోపాటు ‘అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్(ఏబీసీ)’ అనే ఎడ్యూలాకర్‌కు అనుసంధానించబడి ఉంటుంది. పాఠశాల విద్యలోని పిల్లలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చే



విధానాన్ని ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ‘చైల్డ్ ఇన్ఫో’ పేరిట ఒక్కో విద్యార్థికి, ఒక్కో సంఖ్య విధానాన్ని కొన్నేళ్లుగా కేటాయిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర విద్యాశాఖ అమలు చేయబోతున్న ఈవిధానం ద్వారా దేశవ్యాప్తంగా 1 నుంచి 12వ తరగతి వరకు దాదాపు 26 వేల కోట్ల మంది విద్యార్థులకు 12 అంకెలున్న సంఖ్యను కేటాయిస్తారు.

నిర్వహణ ఇలా...

కేంద్ర విద్యాశాఖ పరిధిలోని నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరం వారికి ఈ బాధ్యతను అప్పగించింది. ఆధార్‌తో అనుసంధానం చేసిన ప్రత్యేక సంఖ్యను నమోదుచేస్తే చాలు. విద్యార్థి కుటుంబం వివరాలు, మార్కుల సర్టిఫికెట్లు, నైపుణ్యాలు, పొందిన స్కాలర్‌షిప్ తదితర వివరాలన్నీ తెలుసుకునే వీలుంటుంది. వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందే సమయంలోనూ ధృవీకరణపత్రాలను భౌతికంగా కాకుండా, డిజిటల్‌లో పరిశీలించి సీటు ఇచ్చే అవకాశం ఉంటుంది. ప్రవేశ పరీక్షల దరఖాస్తుల్లోనూ ఈ సంఖ్యను నమోదు చేస్తే సరిపోతుందని ఏఐసీటీఈ వర్గాలు వెల్లడిస్తాయి.

నమోదు ప్రక్రియ

నమోదు ప్రక్రియ వారి తల్లిదండ్రుల సమ్మతితో పాఠశాలలో నిర్వహిస్తారు. వారు ఏ సమయంలో వారి సమ్మతిని ఉపసంహరించుకోవచ్చు. అవసరమైనప్పుడు సంబంధిత ప్రభుత్వ ఏజెన్సీలతో మాత్రమే డేటాను పంచుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. పాఠశాలల ద్వారా ప్రతి విద్యార్థిపై సేకరించిన డేటా కేంద్రంగా పనిచేస్తున్న జిల్లా సమాచార పోర్టల్‌లో నిల్వ చేసి.. గోప్యత పాటిస్తారు.

విద్యార్థులకు ప్రయోజనకరం

అడిచెర్ల రాజయ్య, వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు



విద్యార్థులకు సంబందించిన పూర్తి సమాచారం ఏకీకృతంగా అపార్ కార్డు ద్వారా అందుబాటులోకి రావడం ప్రయోజనకరంగా ఉంటుంది. తల్లిదండ్రుల సమ్మతితోనే చేపట్టాలని మార్గదర్శకాలు ఉన్నాయి. ఇందులో ఎలాంటి ఇబ్బందిలేదు. విద్యార్థులు, తల్లిందండ్రులు ఈ ప్రక్రియకు సహకరించాలి.

ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది

ఏళ్ల మధుసూదన్, నర్సాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు



విద్యార్థి తన విద్యాభ్యాస దశలో వివిధ రకాల ప్రాంతాల్లో చదువుతారు. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవడం శుభ పరిణామం. కేంద్రం తీసుకొస్తున్న ఈ అపార్ ఐడీ విధానం విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది. పదేపదే టీసీలు, బోనఫైడ్ పత్రాలు సేకరించడం లాంటి సమస్యలకు పరిష్కారం దొరుకుంది. విద్యార్థి ప్రగతి నైపుణ్యాలు ఒకేచోట నిక్షిప్తం చేసి ఉంటాయి.



తిరగలి కోసం తిరగాలి..!

కొత్తపోకడలు సంతరించకుంటున్న తరుణంలో పాత జ్ఞాపకాలు కనుమరుగైపోతున్నాయి. తరతరాలుగా మన పూర్వీకులు వినియోగించిన వస్తువులు ఫ్యాషన్ పేరిట ఇప్పుడు ఆపాత మధురాలుగా మిగిలిపోతున్నాయి. గతంలో ధాన్యాన్ని పిండి చేయడానికి మన పెద్దలు ఇసుర్రాయి (తిరగలి)ని ఉపయోగించేవారు. యాంత్రిక సొబగులు ఆరంగేట్రం చేయడంతో ఇసుర్రాయి కాస్త పట్టణ, నగర ప్రాంతాల్లో పూర్తిగా మాయమైపోయింది. పల్లె సీమల్లో అక్కడో ఇక్కడో మాత్రం మచ్చుకు దర్శనమిస్తుంటున్నాయి. ప్రధానంగా గతంలో మరయంత్రాలు, గిర్నీలు, అందుబాటులో లేని కాలంలో ఆదిమానవులు చూపిన దారిలో రాతి వస్తువులను వాడుతుండేవారు. అదే క్రమంలో ఇసుర్రాయి కూడా పూర్వీకులకు నేటి తరం గిర్నీగా పనిచేస్తుండేది. జొన్నలు, సజ్జలు, కొర్రలు, పెసర్లు, కందులు లాంటి ఆహార ధాన్యాలను పిండి చేసేందుకు, పప్పులుగా తయారు చేసేందుకు ఇసుర్రాయి ప్రధానంగా పనిచేస్తుండేది. జొన్న గటక కోసం జొన్నలను పొద్దున సాయంత్రం ఇసుర్రాయిపై ఇసురుతుండేది. కాలక్రమేణా ఇప్పుడు మిక్సర్ గ్రైండర్లు, గిర్నీలు అందుబాటులోకి రావడంతో ఇప్పుడా తిరగలి(ఇసుర్రాయి) కనుమరుగైపోయింది. దాని జాడ కోసం ఇల్లుల్లా తిరగాల్సి వస్తుంది.

- లింగాలఘణపురం

గత పాలకుల అసమర్థతతో.. అభివృద్ధిలో 20ఏళ్లు వెనక్కు

- వరంగల్ అభివృద్ధిపై చర్చకు పిలిస్తే.. పారిపోయారు
- ‘ఆంధ్రజ్యోతి’తో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఇంటర్వ్యూ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

‘ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదే చెప్పా. ఇప్పుడూ అదే చెబుతున్నా. గత పాలకుల అసమర్థతతో వరంగల్ నగరాభివృద్ధి 20 ఏళ్లు వెనుక్కి వెళ్లింది.. సమర్థవంతమైన నాయకత్వం లేకపోవటంలో వరంగల్‌కు కనీసం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని కూడా తేలేకపోయారు. నయీంనగర్ వంతెనపైనా బహిరంగ చర్చలకు పిలిస్తే.. పిరికి పందల్లా పారిపోయారు. నయీంనగర్ బ్రిడ్జిని నేను కట్టించలేదని నిరూపించినా.. బీఆర్ఎస్ కార్యాలయం లీగల్‌గా నిర్మించామని నిరూపించినా రాజీనామాకు సిద్ధంగా ఉన్నా’ అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు రాజకీయ కక్షలు లేవని, అభివృద్ధి కోసం పని చేస్తున్నానని, వరంగల్ కార్పొరేషన్, కాకతీయ యూనివర్సిటీ, ఎంజీఎంలను ప్రక్షాళన చేయటమే తన మొదటి ప్రాధాన్యమంటున్న నాయిని శనివారం ‘ఆంధ్రజ్యోతి’తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు.. మీ ప్రధాన అజెండా ఏంటి?

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి: చాలా సంతోషంగా ఉంది. నాకు అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు అవకాశమిచ్చిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటా. ప్రజలు ఏ నమ్మకంతో నాకు ఓటేశారో.. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. ప్రధాన సమస్యలపై ఇప్పటికే ఓ ప్రణాళిక రూపొందించుకున్నా. ప్రజలు అభివృద్ధిలో మార్పు కోరుకుంటున్నారు. గతంలో పీవీ.రంగారావు చేసిన అభివృద్ధి తప్పా.. పది, పదిహేనుళ్లుగా ఒరిగిందేం లేదు. గత ఎమ్మెల్యేను, వారి పార్టీని విమర్శించటం, సచ్చిన పామును మళ్లీ చంపాలని కాదు కానీ చేతిలో ఉండి కూడా చేయలేని, అసమర్థత వల్ల 20ఏళ్లు వరంగల్ నగరం వెనుకబడింది. పక్కన ఉన్న చిన్న జిల్లాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వచ్చింది. వరంగల్‌కు ఎందుకు తేలేకపోయారు? జిల్లా నాయకత్వం అసమర్థత వల్లా.. కాదా అనేది వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. రాజకీయం మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధి పైన వారికి లేదు. వరంగల్ నుంచి ఆర్‌జేడీ లాంటి ఎన్నో కార్యాలయాలు వెనుక్కి పోయాయి. కొత్త కార్యాలయాలను తీసుకరాకపోగా, ఉన్నవి పోతున్నా అడ్డుకోలేక పోయారు. ప్రధానంగా వరంగల్ కార్పొరేషన్, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్ ఎంజీఎం.. ఈ మూడింటిని ప్రక్షాళన చేయటమే నా మొదటి ప్రాధాన్యం.



ఆంధ్రజ్యోతి : తాము తెచ్చిన పనులను మీరు తెచ్చినట్టు చెప్పుకొంటున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణలపై ఏమంటారు?

ఎమ్మెల్యే: బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారానికి తప్ప దేనికీ పనికిరారు. నయీం నగర్ బ్రిడ్జిపై చర్చకు రమ్మంటే.. పిరికి పందల్లా ఎందుకు పారిపోయారు? వచ్చేపోయే ప్రజలను అడిగినా ఈ బ్రిడ్జిని ప్రస్తుత ఎమ్మెల్యే కట్టిండని వెయ్యి మంది చెప్పారు. ఒక్కరైనా మాజీ ఎమ్మెల్యే కట్టిండని చెబితే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశా. కానీ వారు పారిపోయారు. వారు అధికారంలో ఉన్నప్పుడు లక్ష పనులకు ప్రతిపాదనలు పంపించారు. కమీషన్లకు కక్కుర్తిపడి ఒక్కపని కూడా చేయలే. నేను నిధులు మంజూరు చేయించి పనులు చేయించినా.. ఇప్పటికీ సవాల్ చేస్తున్నా నయీంనగర్ బ్రిడ్జిని వినయ్‌భాస్కర్ పూర్తి చేసిండని ఒక్కరితో చెప్పిచ్చిన రాజీనామాకు సిద్ధంగా ఉన్నా..

ఆంధ్రజ్యోతి : గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నదే మీ అభిప్రాయామా?

ఎమ్మెల్యే ఉమ్మడి వరంగల్ జిల్లాకు గతంలో ఎన్నడూ ఎవరు తేలేనన్ని నిధులు మేం తీసుకొచ్చాం. నెహ్రూ కాలంలో కట్టిన వరంగల్ పాలిటెక్నిక్‌కు కూడా రూ.28కోట్లు తెచ్చాం. మాడవీధులకు వారు ప్రతిపాదనలు పెట్టింది.. కాళోజీ కళాక్షేత్రానికి పిల్లరు, స్లాబ్ పోసింది వాస్తవమే. కానీ, ఎందుకు పూర్తి చేయలేదో జవాబు చెప్పాలి. మేం అధికారంలోకి వచ్చాక కాళోజీ కళాక్షేత్రానికి రూ.48కోట్లు సింగిల్ చెక్ రాయించి.. ఆరేడు నెలల్లో పూర్తి చేశాం. కాళోజీ పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన వారు ఎనిమిదేళ్లుగా కళాక్షేత్రం పూర్తి చేయకుండా.. కళాక్షేత్రం పేరుతో దోచుకున్నారు.. దానిపై విజిలెన్స్ విచారణ జరిపిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చాలని చూస్తున్నారన్న ఆరోపణలపై మీరేమంటారు?

ఎమ్మెల్యే: బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం విషయానికి వస్తే.. వినయ్‌భాస్కర్ నా ఆఫీసుకు వచ్చిన పర్వాలేదు.. నన్ను ఆయన ఆఫీసుకు రమ్మని పిలిచినా పర్వాలేదు. సామరస్యంగా మాట్లాడుకుందాం. పార్టీ కార్యాలయం లీగలా.. ఇల్లీగలా చర్చిద్దాం.. నేను ఇల్లీగల్ అని నేను నిరూపించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా.. ఎనమిదేళ్లుగా ఇంటి పన్ను ఎందుకు చెల్లించలేదు. ఆ పార్టీ ఆఫీసు ఇంటి నెంబరు ఏంటి? సెంట్రల్ లైటింగ్ ఎలా వచ్చింది? ఆఫీసు పేరు.. ఫాదర్ పేరు బీఆర్ఎస్ అంటిరి.. ఆది పార్కు భూమి.. ఎకరం అని చెప్పి ఎకరంన్నర తీసుకున్నారు. వాళ్ల లాగా కక్ష సాధింపు చర్యలు చేస్తే నేను గెలిచిన వారం రోజుల్లోనే వినయ్‌భాస్కర్ వరంగల్ వదిలేసి వెళ్లాల్సింది. నేను ఏం చేయకపోయినా నాపై మర్డర్ కేసు పెట్టించారు. నా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పోలీసులతో కొట్టించిన్రు. వినయ్‌భాస్కర్ చేసినవి మాట్లాడితే కక్ష సాధింపు చర్యలు అయితాయా..? ఇప్పుడు కొత్తగా బీసీ అని ముసుగు వేసుకుంటాండు. ఏనాడైనా బీసీల కోసం పని చేసిండా.. వెంట తిరిగిన బీసీలను ముంచింది వాస్తవం కాదా? నా వెంట ఉన్నది మొత్తం బీసీలే. ఎన్నికల సమయంలో కూడా బీసీ సదస్సుకు నన్నే పిలిచారు. అధికారం పోగానే బీసీలు గుర్తుకు వస్తున్నారాయనకు. నాలుగు రోజులు ఉద్యమ ముసుగు వేసుకుని అధికారంలోకి వచ్చిన ఆయన మళ్లీ బీసీ ముసుగు వేసుకుంటున్నాడు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : కాజీపేట బస్టాండ్ కోసం చేస్తున్న ప్రయత్నాలు ఎంత వరకు వచ్చాయి?


ఎమ్మెల్యే: సౌత్ సెంట్రల్ డివిజన్ మేనేజర్‌ను ఇటీవలే కలవటం జరిగింది. గత పాలకులు బస్టాండ్ కోసం 30ఏళ్లుగా కొట్లాడిండ్లు కదా.. ఏమైంది..? ఎట్టి పరిస్థితుల్లో కాజీపేట రైల్వే స్టేషన్ దగ్గర బస్టాండ్‌ను సాధించి తీరుతా.. ఇక మార్చిలోపు కాజీపేట బిడ్జిని కూడా ప్రజలకు అందుబాటులోకి తెస్తా. కాజీపేట రైల్వే ఆస్పత్రి, స్కూల్ తదితర వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి సమీక్షలు నిర్వహిస్తున్నాం. కాజీపేటలో కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది. వాటిని కూడా పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. నన్ను నమ్మి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటా. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తా.

ఆదివారం

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు





ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
డిప్లొమాట్ 2	వెబ్‌సిరీస్	అక్టోబర్ 29
టైమ్ కట్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 30
ది మాన్‌హట్టన్ ఏలియన్ అబిడక్షన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 30
అమెజాన్ ప్రైమ్		
జోకర్	హాలీవుడ్ చిత్రం	అక్టోబర్ 29
జియో సినిమా		
సమ్‌బడీ సమ్‌వేర్ 3	వెబ్‌సిరీస్	అక్టోబర్ 28
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
విజర్డ్స్ బియాండ్ వేవర్లీ ప్లేస్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 30
తంగలాన్	తెలుగు డబ్బింగ్	అక్టోబర్ 31
లబ్బర్ పందు	తెలుగు డబ్బింగ్	అక్టోబర్ 31
కిష్కింధకాండ	మలయాళ చిత్రం	నవంబర్ 01
జీ 5		
మిథ్య: ది డార్క్ ఛాప్టర్	హిందీ చిత్రం	నవంబర్ 01
ఆహా...		
అంజామై	తమిళ చిత్రం	అక్టోబర్ 29

సైకలాజికల్ థ్రిల్లర్



2019లో విడుదలై ఆస్కార్ పురస్కారాలు అందుకున్న 'జోకర్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందింది 'జోకర్: ఫోలీ అ దూ'. ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌కు టాడ్ ఫిలిప్స్ దర్శకత్వం వహించాడు. జోక్విన్ ఫీనిక్స్ టైటిల్ పాత్రను పోషించారు. లేడీగాగా కీలకపాత్ర పోషించారు. టీవీషోలో ముర్రే ఫ్రాంక్లిన్‌ను జోకర్ చంపిన రెండున్నర ఏళ్ల తర్వాత కథ మొదలవుతుంది. అతనిపై మోపిన నేరాన్ని రుజువుచేసి ఉరిశిక్ష పడేలా చేసేందుకు కోర్టులో లాయర్లు ప్రయత్నిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో అతను జైలు నుంచి ఎలా బయటపడ్డాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది.



తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కొద్దిరోజుల్లోనే స్టార్‌నటిగా గుర్తింపు పొందారు మీనాక్షి చౌదరి. 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' చిత్రంతో తెలుగు సినిమారంగ ప్రవేశం చేసిన ఆమె ప్రస్తుతం టాలీవుడ్ స్టార్‌హీరోల సరసన నటిస్తోంది. 'గోట్' సినిమాలో దళపతి విజయ్‌తో కలిసి ఆడిపాడింది. మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించి సినీనటిగా రాణిస్తున్న హర్యానా భామ **మీనాక్షి చౌదరి** గురించి మరిన్ని విశేషాలు ఇవి...

ఎప్పటికీ గుర్తుండిపోవాలి

'డాక్టర్ కావాలనుకున్నాను కానీ యాక్టర్ అయ్యాను' అని నటీనటులు చెబుతుండటం వింటూనే ఉంటాం. కానీ ఈ నటి మాత్రం డాక్టర్ చదివి నటిగా మారారు. హర్యానాలోని పంచకులలో జన్మించిన మీనాక్షిచౌదరి నేషనల్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఇన్ డెంటల్ సర్జరీ పూర్తి చేశారు. మోడలింగ్‌పై మక్కువతో అటువైపు అడుగులు వేశారు. అంతేకాదు మీనాక్షి రాష్ట్రస్థాయి స్విమ్మర్, బ్యాండ్మింటన్ క్రీడాకారిణి కూడా. ఆమె తండ్రి బి.ఆర్ చౌదరి ఆర్మీలో కల్నల్‌గా పనిచేశారు.

సినిమాలతో బిజీ బిజీ

మీనాక్షి కాలేజీ చదివే రోజుల్లోనే మోడలింగ్‌పై ఆసక్తి పెంచుకున్నారు. 2018లో ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ టైటిల్ గెలుచుకున్నారు. ఈ విజయంతో ఆమెకు మోడలింగ్‌లోనూ, సినీ రంగంలోనూ అవకాశాలు వెల్లువెత్తాయి. 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఆ తరువాత రవితేజతో కిలాడీ, అడవిశేష్‌తో హిట్ సినిమాలో నటించారు. గుంటూరు కారం సినిమాలో మహేష్‌బాబు సరసన చేసే అవకాశం రావడంతో స్టార్‌నటీమణుల జాబితాలో చేరారు. దళపతి విజయ్‌తో 'గోట్' సినిమాలో జత కట్టడంతో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ప్రస్తుతం 'లక్కీబాస్కర్', 'మట్కా' వంటి పలు సినిమాలతో బిజీగా ఉన్నారు మీనాక్షి. మెగాస్టార్ మూవీ 'విశ్వంభర'లోనూ నటిస్తున్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా అవకాశం రాకముందు 'ఔటాఫ్ లవ్' అనే వెబ్‌సీరిస్‌లో నటించారామె.

మిస్ ఇండియా టైటిల్‌తో...

2017లో ఇండియన్ మిలిటరీ అకాడమీ ఆటం బాల్ నైట్‌లో జరిగిన అందాల పోటీల్లో 'మిస్ ఐఎమ్‌ఏ'గా గెలవడంతో మీనాక్షి కెరీర్ ప్రారంభమైంది. మిలిటరీ కేడెట్స్‌ల శిక్షణ ముగిసిన అనంతరం వారి గౌరవార్థం ఈ ఈవెంట్‌ని నిర్వహిస్తారు. ఈ టైటిల్‌ను గెలుచుకున్న తరువాత పాటియాలాలో ఫ్యాషన్ బిగ్‌బజార్ స్పాన్సర్ చేసిన 'క్యాంపస్ ప్రిన్సెస్ 2018' పోటీల్లో పాల్గొని ఒక రీజనల్ రౌండ్‌లో విజేతగా నిలిచారు. తరువాత ఫెమినా మిస్ హర్యానా 2018 టైటిల్‌ను గెలుచుకున్నారు మీనాక్షి. ఆ తరువాత భారత్‌లో జరిగే బిగ్గెస్ట్ బ్యూటీ కాంటెస్ట్‌గా గుర్తింపు పొందిన ఫెమినా మిస్ ఇండియా 2018 కిరీటాన్ని గెలుచుకున్నారు. ఈ విజయంతో అదే ఏడాది మయన్మార్‌లోని యాంగాన్‌లో జరిగిన మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ పోటీలకు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించే అందుకున్నారు. మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ పోటీల్లో ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు.



> సమయం ఎవ్వరికోసం ఆగదు. అది సినిమా ఇండస్ట్రీకి మాత్రమే కాదు. అన్ని రంగాలకూ వర్తిస్తుంది. నా తల్లిదండ్రుల నుంచి ఆ విషయాన్ని నేర్చుకున్నాను

ట్రావెలింగ్ ఇష్టం

షూటింగ్స్ బిజీగా ఉండే మీనాక్షి ఖాళీ సమయం దొరికితే ట్రావెలింగ్‌కు వెళ్లడాన్ని ఇష్టపడతారు. "కొత్త ప్రదేశాలను చుట్టి రావడమంటే చాలా ఇష్టం. నాకు కొత్త కొత్త సంప్రదాయాల గురించి తెలుసుకోవాలని ఉంటుంది. మా నాన్న ఆర్మీ ఉద్యోగి కాబట్టి ట్రావెలింగ్ అనేది నా జర్నీలో ఒక భాగంగా మారింది. మిస్ ఇండియా టైటిల్ గెలుచుకున్నాక దక్షిణ కొరియాతో పాటు నాకిష్టమైన మరికొన్ని దేశాలు తిరిగొచ్చాను" అని అంటారు మీనాక్షి చౌదరి. అందాల పోటీల్లో విజేతగా నిలిచాక మోడలింగ్ రంగంలో, సినీ రంగంలో అవకాశాలు తలుపుతట్టాయి. వచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ సినీ రంగంలో ప్రముఖ నటిగా స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. "టైటిల్ గెలుచుకున్నాక నాపై ఎన్నో బాధ్యతలు వచ్చి చేరాయి. ఆ సమయంలో నా తల్లిదండ్రులు, స్నేహితులు నాకు సపోర్టుగా నిలిచారు. కాస్త తీరిక దొరికినా ఫోన్ చేసి వాళ్లతో మాట్లాడుతూ ఉంటాను" అని చెబుతారు మీనాక్షి. అవకాశాలు వచ్చినప్పుడే సద్వినియోగం చేసుకోవాలన్న సూత్రాన్ని ఆమె బాగా వంటబట్టించుకున్నారు. "సమయం ఎవ్వరికోసం ఆగదు. అది సినిమా ఇండస్ట్రీకి మాత్రమే కాదు. అన్ని రంగాలకూ వర్తిస్తుంది. నా తల్లిదండ్రుల నుంచి ఆ విషయాన్ని నేర్చుకున్నాను" అని అంటారు మీనాక్షి. టైమ్స్ 50 మోస్ట్ డిజైరబుల్ వుమెన్ ఇన్ ఇండియా 2018 జాబితాలో మీనాక్షి చౌదరి రెండో స్థానంలో నిలిచారు. టైమ్స్ ఆఫ్ ఇండియా ఒక ఇంటర్నెట్ సర్వేను నిర్వహించి ఈ జాబితాను వెలువరించింది. "ప్రతి సినిమాకు నా నటనను మెరుగుపరుచుకుంటున్నాను. సినిమా ఇండస్ట్రీలో అనుష్కశెట్టి, నయనతార, త్రిష వంటి నటీమణులు నాకు ఆదర్శం. ఇండస్ట్రీలో వాళ్లు చాలా కాలం ప్రేక్షకులను అలరించారు. వాళ్లలా నేనూ గుర్తింపు తెచ్చుకోవాలి. అభిమానులు ఎప్పటికీ గుర్తుంచుకునే సినిమాల్లో నేనూ భాగం కావాలి. నాకు ఆటలంటే ఇష్టం. ఎప్పటికైనా స్పోర్ట్స్ రిలేటెడ్ మూవీలో నటించాలని ఉంది. ఒక డెంటిస్ట్‌ను కాబట్టి ఆన్‌స్క్రీన్‌లో డాక్టర్ రోల్ కూడా చేయాలని ఉంది" అని

బొప్పాయితో బోలెడు ఆరోగ్యం

అంత తియ్యగా కాకుండా ప్రత్యేకమైన రుచితో ఉండే బొప్పాయి పండుని ఇష్టపడనివారుండరు. ఉదయాన్నే పరగడుపున తినదగ్గ పండ్లలో బొప్పాయి ఒకటి. ఇది శరీరాన్ని డీటాక్స్ చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఏడాది పొడవునా దొరికే బొప్పాయి పండు అందించే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

- ఉదయాన్నే ఒక కప్పు బొప్పాయి పండు ముక్కలు తింటే ఇందులోని ఫైబర్ వల్ల తొందరగా ఆకలి అనిపించదు. పొట్ట చుట్టూ పేరుకున్న క్రొవ్వు కరగడంతో పాటు అధిక బరువును నివారిస్తుంది. జీర్ణ క్రియను మెరుగుపరచి కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా చేస్తుంది.
- బొప్పాయిలో ఉండే కెరోటినాయిడ్స్, లైకోపీన్ తదితర యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి క్యాన్సర్ కణాలను అడ్డుకుంటాయి. అల్జీమర్స్, మధుమేహం, కాలేయ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలను నివారిస్తాయి. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ రాకుండా చేస్తాయి. ఈ పండులోని బీటా కెరోటిన్ పురుషుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నిరోధిస్తుంది.
- ఒక గ్లాస్ బొప్పాయి పండు జ్యూస్‌లో కొంచెం నిమ్మరసం కలిపి రోజుకి రెండు లేదా మూడు సార్లు తాగితే డెంగ్యూ జ్వరం, మలేరియాల నుంచి బయటపడవచ్చు. బొప్పాయి చెట్టు ఆకుల రసాన్ని పూటకి ఒక చెంచా చొప్పున తాగితే రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య పెరుగుతుంది.



- బాగా పండిన బొప్పాయిలో కాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలకు బలానిస్తుంది. ఇందులో లభించే సి విటమిన్ వల్ల దంతాలు, చిగుళ్ల సమస్యలు; బి విటమిన్ వల్ల నోటి పూత, పెదాల పగుళ్లు; ఎ విటమిన్ వల్ల కంటి జబ్బులు తొలగిపోతాయి.
- బొప్పాయి పండును తరచూ తినడం వల్ల ఇందులోని ఇ విటమిన్ చర్మం ముడుతలు పడకుండా నివారిస్తుంది. చర్మం మీద మృత కణాలను తొలగించి మెరిసేలా చేస్తుంది. కాలిన గాయాలను త్వరగా తగ్గిస్తుంది.
- ప్రతి రోజూ అల్పాహారంలో బొప్పాయి పండు ముక్కలు తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులోని న్యూట్రియెంట్స్, పొటాషియం, మెగ్నీషియం, ఇతర మినరల్స్ రక్త ప్రసరణను వేగవంతం చేస్తాయి. ఈ పండులో సుగర్ చాలా తక్కువగా ఉంటుంది. అందుకే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉండి గుండె జబ్బులు రాకుండా చేస్తుంది.

పండుగ రోజూ నిద్రపోవాలి

పండుగలు వచ్చాయంటే బంధువులు, స్నేహితులు వస్తారు. సరదాగా బయటకు వెళ్తారు. వీటన్నింటి వల్ల ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తాయి. నిద్ర వేళలు అటూ ఇటూ అవుతాయి. దీని ప్రభావం పండుగ తర్వాత కూడా ఉంటుంది. ముఖ్యంగా నిద్ర లేకపోవటం వల్ల చిరాకుగా కూడా ఉంటుంది. అందువల్ల పండుగ సమయంలో నిద్రను నియంత్రించటానికి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

- రోజుకు ఎనిమిది గంటల నిద్ర అవసరం. పండగలలో ఈ నిద్ర గంటలు గణనీయంగా తగ్గిపోతాయి. అందువల్ల వీలైనంత వరకు ఈ నిద్ర గంటలు తగ్గకుండా చూసుకోవాలి. దీని వల్ల



పండుగ మర్నాడు ఫ్రెష్‌గా ఉండగలుగుతారు.
- వీలైనంత వరకు విందు భోజనాలను మధ్యాహ్నామే చేస్తే మంచిది. రాత్రి పూట చేస్తే సరిగ్గా నిద్ర పట్టదు. అంతే కాకుండా పండగ రోజుల్లో పనుల్లో పడిపోయి తక్కువ నీళ్లు తాగుతారు. అలా కాకుండా పండగ రోజుల్లో కనీసం రెండు లీటర్ల నీళ్లు తాగటాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలి. అప్పుడు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవు.
- బంధుమిత్రులను కలిసిన ఉత్సాహం వల్ల ఎక్కువ ఉత్సుకతకు లోనవుతూ ఉంటారు. దీని వల్ల ఆలోచనలపై నియంత్రణ ఉండదు. పండగ రోజుల్లో నిద్ర పట్టకపోవటానికి ఇది కూడా ఒక కారణం. అందువల్ల పడుకొన్నే ముందు కొంత సేపు ధ్యానం వంటివి చేస్తే త్వరగా నిద్ర పడుతుంది.
- కొందరు మధ్యాహ్నం సమయం చిక్కినప్పుడు నిద్రపోతారు. దీని వల్ల రాత్రి నిద్ర వేళల్లో మార్పు వస్తుంది. అందువల్ల మధ్యాహ్నం నిద్రపోకుండా ఉంటే మంచిది.

హృదయమున్న అందం

మిస్ ఇంటర్నేషనల్

అందం, తెలివి, సామాజిక బాధ్యత... వీటన్నిటి కలబోత రాచెల్ గుప్తా. పద్దెనిమిదేళ్లకే వ్యాపార రంగంలో అడుగుపెట్టిన ఈ జలంధర్ బ్యూటీకి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక విలియన్‌కు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. తాజాగా 'మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్'గా నిలిచి, ఆ టైటిల్ పొందిన తొలి భారతీయురాలుగా ఘనత సాధించిన రాచెల్ దాతృత్వంలోనూ ముందుంటుంది.

రాచెల్ గుప్తాకు అస్సలు నచ్చని విషయం... పదిమందిలో ఒకరుగా మిగిలిపోవడం. "ప్రతివారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అదేమిటనేది అందరికన్నా వాళ్లకే బాగా తెలుస్తుంది. దాన్ని ఉపయోగించుకున్నవారే రాణిస్తారు" అంటుంది రాచెల్. ఈనెల 25న థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన 'మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్-2024' పోటీల్లో టైటిల్ గెలిచిన ఆమె... ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలుగా, మూడవ ఆసియన్‌గా చరిత్రకెక్కింది. ఫిలిప్పీన్ సుందరికి, రాచెల్‌కు మధ్య హోరాహోరీ పోటీ నడిచింది. కానీ ప్రశ్నోత్తరాల రౌండ్‌లో రాచెల్‌దే పైచెయ్యి అయింది. "ప్రపంచంలో ఈ రోజు పరిష్కరించాల్సిన అత్యంత తీవ్రమైన సమస్య ఏదని మీరనుకుంటున్నారు? వాటికి మీరే పరిష్కారాలు సూచిస్తారు?"... ఇది ప్రతి ఫైనలిస్టునూ న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్న. దానికి రాచెల్ బదులిస్తూ "ఈ రోజు అత్యంత క్లిష్టమైన సమస్య పేదరికం. దీనికి అధిక జనాభా, వనరులు పరిమితంగా ఉండడం కారణం. అంతర్జాతీయంగా జనాభా నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ప్రతి ఒక్కరికీ తగినన్ని వనరులు అందేలా చూసే బాధ్యతను ప్రపంచ నేతలు తీసుకోవాలి. నేను భారతదేశం నుంచి వచ్చాను. అక్కడ ప్రతి ఒక్కరికీ ఆహారం, నీరు, విద్య, మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవు. ప్రపంచంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉందనేది వాస్తవం. పరస్పరం పోరాడుకోవడం ఆపేసి, ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఈ భూమి మీద ప్రతి ఒక్కరికీ తగినన్ని వనరులు సమకూరేలా చూడాల్సిన సమయం ఇది" అని చెప్పిన మాటలు న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నాయి. ఆమెను విజేతగా నిలబెట్టాయి.



ఈ విజయం స్ఫూర్తితో...

పంజాబ్‌లోని జలంధర్‌లో రాచెల్ పుట్టి పెరిగింది. ఆమె తండ్రి రాజేశ్ గుప్తా వ్యాపారవేత్త. కళలంటే ఆమె తల్లితండ్రులకు ఎంతో ఇష్టం. రాచెల్‌ను, ఆమె సోదరి నిర్ఘర్‌ను ఆ దిశగా ప్రోత్సహించారు. స్కూల్లో చదువుతున్నప్పుడే సాంస్కృతిక కార్యక్రమాల్లో రాచెల్ చురుగ్గా పాల్గొనేది. మరోవైపు వ్యాపార దక్షత కూడా ఆమెకు కుటుంబ వారసత్వంగా వచ్చింది. 2022లో... పద్దెనిమిదేళ్లకే- సౌందర్య సేవలను అందించే 'ది గ్లామ్ బార్' పేరిట సెల్ఫ్‌కేర్ సెలూన్ ప్రారంభించింది. ఫిలాసఫీలో డిగ్రీ చేస్తూనే... మోడల్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టింది. 2022లో పారిస్‌లో జరిగిన 'మిస్ సూపర్ టాలెంట్ ఆఫ్ ది వరల్డ్' కాంపిటీషన్‌లో టైటిల్ గెలుచుకోవడంతో అంతర్జాతీయ ఫ్యాషన్ రంగంలో ఆమె పేరు మారుమోగింది. ఈ ఏడాది ఆగస్టులో జైపూర్‌లో జరిగిన 'మిస్ గ్రాండ్ ఇండియా-2024'లో విన్నర్‌గా నిలిచి, ప్రతిష్టాత్మకమైన 'మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్-2024'లో భారత్ తరఫున పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ పోటీలో 68 దేశాల ప్రతినిధులను ఎదుర్కొన్న రాచెల్... భారత్‌కు తొలిసారిగా ఈ టైటిల్ అందించింది. "సంతోషంతో నాకు నోట మాట రావడం లేదు. ఈ విజయం స్ఫూర్తిగా... మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ తరఫున ప్రపంచ శాంతికి, సుస్థిరతకు నిబద్ధతతో పని చేస్తాను" అంటూ రాచెల్ స్పందించింది.

ఇష్టమే ప్రేరణగా....

సోషల్ మీడియాలో రాచెల్ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు పదిలక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఇంగ్లీష్, హిందీ, పంజాబీ ధారాళంగా మాట్లాడే



రాచెల్... పోటీల కోసం థాయిలాండ్ వెళ్లినా తన సామాజిక బాధ్యతను మరచిపోలేదు. బ్యాంకాక్‌లోని ఫౌండేషన్ ఫర్ స్లమ్ చిల్డ్రన్ కేర్‌ను సందర్శించి, పదివేల థాయి భాట్స్ విలువైన సామగ్రిని అందజేసింది. ఆమె సేవా, దాతృత్వ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనడమే కాదు... ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తుంది. ఇంతకీ మోడలింగ్, బిజినెస్, సోషల్ సర్వీస్... రాచెల్ వీటిలో దేన్ని ఎక్కువగా ఇష్టపడుతుంది? "నేను మోడలింగ్ చెయ్యాలనుకుంటున్నానని చెప్పినప్పుడు... నా తల్లితండ్రులు దిగ్భ్రాంతి చెందారు. నా నిర్ణయాన్ని మార్చుకొనేలా ఒప్పించడానికి ప్రయత్నించారు. కానీ నా భవిష్యత్తు విషయంలో నాకు స్పష్టమైన ప్రణాళిక ఉంది. నేను రాణించేది వ్యాపార రంగంలోనేనని నాకు తెలుసు. అందులోనే స్థిరపడతాను కూడా. కానీ ఫ్యాషన్ రంగం, మోడలింగ్ నాకు చాలా ఇష్టం. కాబట్టే ఇటువైపు వచ్చాను. ఆ ఇష్టమే ఫ్యాషన్ షోలలో, అందాల పోటీల్లో పాల్గొనడానికి ప్రేరణనిచ్చింది. ప్రస్తుతానికి అదే నా ప్రధానమైన కెరీర్. ఇక 'సామాజిక సేవ అందరి బాధ్యత' అనే భావన కూడా మా కుటుంబం చేసే సేవా కార్యక్రమాల ద్వారానే నాలో బలపడింది. అది ఎప్పటికీ కొనసాగుతుంది అంటోంది రాచెల్.

పండుగ వేళ మురిపించే జుంకాలు



దీపావళి వచ్చేస్తోంది. పండుగ రోజున ప్రత్యేకంగా కనిపించాలని మహిళలంతా కోరుకొంటారు. ప్రత్యేకించి లక్ష్మీపూజకి చక్కని చీర, నగలతో ముస్తాబవుతారు. చీరకు తగ్గట్టు జుంకాలు కూడా పెట్టుకుంటే ముఖం దేదీప్యమానంగా మెరిసిపోతుంది. పండుగ రోజున అలా మురిపించే జుంకాలు మీకోసం...

ముత్యాల జుంకాలు

- తెల్లని ముత్యాలు వరుసగా పేర్చిన జుంకాలు, ఒక పెద్ద సైజు ముత్యం వేలాడేలా ఉండే బుట్టలు యువతులకు బాగా నప్పుతాయి. నీలం, గులాబీ, ఎరుపు వంటి ముదురు రంగు పట్టుచీరలు కట్టుకున్నపుడు ముత్యాల చోకర్‌తోపాటు వీటిని ధరిస్తే చాలా అందంగా కనిపిస్తారు. వెడల్పాటి గుండ్రని ముఖం ఉన్నవారికి ఇవి అద్భుతంగా సూటవుతాయి. కొంచెం ఛాయ తక్కువగా ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా వీటిని పెట్టుకోవచ్చు. సన్నని ముత్యాలతో కూడిన చెంపస్వరాలు అదనపు అందాన్నిస్తాయి.

చాంద్‌బాలీలు

- గోల్డ్ బాల్స్ లేదా ముత్యాలు వేలాడేలా అర్థచంద్రాకారంలో రూపొందించిన చాంద్‌బాలీలను ఇష్టపడని మగువలు ఉండరు. ఇవి రెండు, మూడు వరసల్లో కూడా లభ్యవుతాయి. రంగు రంగుల బీడ్స్‌తో రూపొందించిన చాంద్‌బాలీలు అన్ని చీరలమీదికి సూటవుతాయి. కోలముఖం ఉన్నవారికి ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి.



పోల్కీడ్రాప్స్

- వజ్రాలు, అమెరికన్ డైమండ్స్, పగడాలతో రూపొందించిన పోల్కీ డ్రాప్స్ మధ్య వయసు మహిళలకు బాగా నప్పుతాయి. చక్కగా కొప్పు పెట్టుకొని వీటిని ధరిస్తే హుందాగా కనిపిస్తారు.

టెంపుల్ జుంకాలు

- ప్రస్తుతం టెంపుల్ జువెలరీకి అత్యధికంగా ఆదరణ ఉంది. దేవతా మూర్తులు, హంసలు, నెమళ్లు, లతలు, పూలతో రూపొందించిన పెద్ద సైజు బుట్టలు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటికి ముత్యాలు, కెంపులు, పచ్చలు వేలాడేలా కూడా తయారు చేస్తున్నారు. ఈ జుంకాలు పట్టుచీరలమీద రిచ్‌లుక్‌ని ఇస్తాయి.



రెడ్ బీడ్ జుంకాలు

- ఎరుపు రంగు బీడ్స్ అమర్చిన పెద్ద సైజు బుట్టలు అమ్మాయిలకు ఆకర్షణీయంగా ఉంటాయి. ముత్యాలు, కెంపులు కూడా చేర్చి రిచ్‌గా కనిపించేలా వీటిని రూపొందిస్తున్నారు. పండుగవేళ అమ్మవారికి ఇష్టమైన ఎరుపు రంగు జుంకాలు పెట్టుకోవడం శుభప్రదం.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
ఆదివారం • 27 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com



ఇదొక రియల్ హీరో కథ

'సాయిపల్లవి పాత్రను పరిచయం చేస్తూ విడుదల చేసిన వీడియో చూసినప్పుడే సినిమా విజయంపై నమ్మకం ఏర్పడింది. ఇదొక రియల్ హీరో స్టోరీ. యాక్షన్‌తోపాటు ఎమోషన్స్ ఉన్న చిత్రమిది. కమల్‌హాసన్ నిర్మించేందుకు ముందుకు వచ్చారంటేనే ఈ సినిమా ఎంత ప్రత్యేకమైనదో అర్థం చేసుకోవచ్చు' అని తమిళ హీరో శివకార్తికేయన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రమిది. కమల్ హాసన్ నిర్మాణంలో రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. సాయిపల్లవి కథానాయిక. ఈ చిత్రం ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'మేజర్ ముకుంద వరదరాజన్, ఇందు రెబకా అనే దంపతుల కథ ఇది. సైనికుల త్యాగాలు ఎలా ఉంటాయో రాజ్‌కుమార్ 'అమరన్'లో అద్భుతంగా చూపించారు. ప్రేక్షకులు తప్పక ఆదరించాలి' అని కోరారు. సాయిపల్లవి మాట్లాడుతూ 'నా ప్రతి సినిమా ప్రేక్షకులకు నచ్చాలనే అంకితభావంతో పనిచేస్తాను. అమరన్ సినిమాలో నా పాత్రను దర్శకుడు అద్భుతంగా మలిచారు. ఈ సినిమా మీ అందరికీ నచ్చాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు.

త్రినాధరావు దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం 'మజాకా'. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది. 20 రోజుల లెన్తీ షెడ్యూల్‌లో యాక్షన్ బ్లాక్స్‌తోపాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కాగా, మేకర్స్ ఇంట్రస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన రీతూ వర్మ నటిస్తున్నారు.

సందీప్ సరసన రీతూ

సందీప్ కిషన్- రీతూ వర్మ హ్యామరస్ అనౌన్స్‌మెంట్ వీడియో ఆకట్టుకుంటోంది. ఇందులో రీతూ వర్మ పెళ్లి దుస్తుల్లో అందంగా కనిపించారు.







Mr. K. S. S. V. Prasada Rao, II B. Com., Best actor of the college 1974-75.

'రాజీనామా'తో మొదలైన
రాజీలేని ప్రయాణం

తన నట జీవితంలోని తొలి మైలురాయిని చిరంజీవి గుర్తు చేసుకున్నారు. కాలేజ్ రోజుల్లో నటుడిగా రంగస్థలంపై అడుగుపెట్టినప్పటి అరుదైన జ్ఞాపకాన్ని శనివారం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. కాలేజ్ రోజుల్లో తొలి నాటకంతోనే ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్న ఫొటోను షేర్ చేశారు. '1974లో నరసాపురం వై.ఎన్.ఎం కాలేజ్‌లో డిగ్రీ చదువుతున్నా. అప్పుడే తొలిసారి 'రాజీనామా' అనే నాటకంలో ఓ వేషం వేశాను. నటుడిగా నాకది తొలి గుర్తింపు. ఆ ఏడాది కాలేజీ తరపున ఇచ్చే ఉత్తమ నటుడి పురస్కారం నాకు దక్కడం ఎనలేని ప్రోత్సాహాన్ని ఇచ్చింది. 1974 నుంచి 2024 వరకూ 50 ఏళ్ల పాటు సాగిన నట ప్రస్థానం ఎనలేని ఆనందాన్నిచ్చింది' అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చిరు పేర్కొన్నారు. రాజీనామాతో మొదలైన రాజీలేని ప్రయాణం అయనదని మెగాభిమానులు కామెంట్స్ పెడుతున్నారు.



యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన 'పొట్టేల్' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ మధ్య కాలంలో ఇంత పాజిటివ్ టాక్ ఏ చిత్రానికీ రాలేదని, ప్రతి థియేటర్‌లో సినిమాకు స్టాండింగ్ ఓవేషన్ వస్తోందని దర్శకుడు సాహిత్ మోత్కూరి చెప్పారు. తన నటనకు అందరి నుంచి అభినందనలు వస్తున్నందుకు యువచంద్ర కృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. సినిమా చూశాక అందరూ తనని బుజ్జమ్మా అని పిలుస్తున్నారని అనన్య చెప్పారు. మంచి సినిమా తీశామని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారని నిర్మాత తెలిపారు.

రిలీజ్ డేట్ ఫిక్స్



అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో అశోక్ గల్లా, వారణాసి మానస హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. సోమినేని బాలకృష్ణ నిర్మాత. సంగీతం భీమ్స్ సిసిరోలియో. నవంబరు 14న విడుదలవుతోంది. చిత్రం వరల్డ్ వైడ్ థియేట్రికల్ రైట్స్‌ను శంక్ పిక్చర్స్ దక్కించుకుంది. సినిమాలో అశోక్ గల్లా మాస్, యాక్షన్-ప్యాక్డ్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే మొదటి రెండు పాటలు హిట్ అయ్యాయి.

ఇన్ ప్రోగ్రెస్



'సారంగో సారంగా...'

ప్రియదర్శి, రూపా కొడువాయుర్ జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. డిసెంబరు 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రంలోని మొదటి సాంగ్ 'సారంగో సారంగా... అమ్మాయి అవునంది ఏకంగా' అంటూ సాగే ప్రణయ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, వివేక్ సాగర్ స్వరాలు సమకూర్చారు.

డివోషనల్ ఎంటర్టైనర్



వరుస ప్రాజెక్ట్‌లతో టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నారు నిర్మాత టీ.జీ. విశ్వప్రసాద్. ఆయన నిర్మించబోయే ఓ నూతన చిత్రాన్ని.. శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత టీ.జీ.విశ్వప్రసాద్ మాట్లాడుతూ "రణమండల అంజనేయ స్వామి సన్నిధిలో ఈ చిత్రాన్ని ప్రకటించడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. టైటిల్ 'రణమండల'. రెండేళ్లుగా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు సాగుతున్నాయి. హనుమంతుని నేపథ్యంలో సాగే ఈ సినిమా భారీ యాక్షన్ డివోషనల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనుంది' అన్నారు.

సమాజం కోసం సూపర్ హీరోగా...



'లక్కీ' ఫేమ్ డాక్టర్ సూరి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'బఘీరా'. 'ఉగ్రమ్' ఫేమ్ శ్రీ మురళీ, ప్రకాశ్‌రాజ్, రుక్మిణీ వసంత్ కీలక పాత్రలు పోషించారు. ప్రశాంత్ నీల్ కథ అందించారు. విజయ్ కిరగందూర్ నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు సూరి మీడియాతో ముచ్చటించారు. 'కేజీఎఫ్' షూటింగ్ టైమ్‌లో శ్రీమురళి కోసం ప్రశాంత్ నీల్ ఈ కథ చెప్పారు. కథ నచ్చడంతో డెవలప్ చేశాను. ఓ సాధారణ వ్యక్తి.. సమాజం కోసం సూపర్ హీరోగా మారాడనేది ఈ సినిమా కథాంశం. ఈ సినిమాలోని ప్రతీ సన్నివేశం అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని పంచే చిత్రమిది. ఇందులో ప్రతీ పాత్రా కీలకమే. సినిమాలోని యాక్షన్ సన్నివేశాలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. అజనీష్ లోకనాథం ఇచ్చిన సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. సినిమా ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

విభిన్నమైన ప్రేమకథ



షెరాజ్ మెహదీ లీడ్ రోల్‌లో నటిస్తూ.. స్వీయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షీ హెగ్డే, కృతి వర్మ హీరోయిన్లు. సురీందర్ కౌర్ నిర్మిస్తున్న ఈ ప్రేమ కథా చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. త్వరలోనే సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో, దర్శకుడు షెరాజ్ మెహదీ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. విభిన్నమైన ప్రేమకథగా రాబోతోంది" అని చెప్పారు. "ఇందులో నేను పోషించిన పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి. కమర్షియల్ అంశాలతో పాటు ఆలోచింపజేసే సందేశం ఉన్న సినిమా ఇది" అని హీరోయిన్ విహాన్షీ హెగ్డే అన్నారు.











అదానీ గూటికి ఐటీడీ సిమెంటేషన్

46.64% వాటా రూ.3,204 కోట్లకు కొనుగోలు

ఓపెన్ ఆఫర్ ద్వారా మరో 26 శాతం వాటాను రూ.2,553 కోట్లకు దక్కించుకోనున్న గ్రూప్



న్యూఢిల్లీ: భారత్‌లో రెండో అతిపెద్ద ధనవంతుడైన గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ కొనుగోళ్ల జైత్రయాత్ర కొనసాగుతోంది. ఈ మధ్యనే ఓరియంట్ సిమెంట్‌ను టేకోవర్ చేస్తున్నట్లు ప్రకటించిన గ్రూప్.. తాజాగా మరో కంపెనీని చేజిక్కించుకుంది. ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఐటీడీ సిమెంటేషన్ ఇండియా ప్రమోటర్‌కు చెందిన 46.64 శాతం వాటాను రూ.3,204 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు దుబాయ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అదానీ గ్రూప్ కంపెనీ రెన్యూ ఎక్సిమ్ డీఎంసీసీ శనివారం వెల్లడించింది. కంపెనీ ప్రమోటరైన ఇటాలియన్-థాయ్ డెవలప్‌మెంట్ పబ్లిక్ కంపెనీ లిమిటెడ్ (ఐటీడీ) నుంచి ఒక్కో షేరు రూ.400 చొప్పున కొనుగోలు చేసేందుకు విధిగా కట్టుబడి ఉండే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. అలాగే, బహిరంగ మార్కెట్లో ఐటీడీ సిమెంటేషన్ పబ్లిక్ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలు చేసేందుకు సెబీ నిబంధనల ప్రకారం ఓపెన్ ఆఫర్ సైతం ప్రకటించింది. ఓపెన్ ఆఫర్‌లో భాగంగా ఒక్కో షేరుకు రూ.571.68 చొప్పున చెల్లించనుంది. 26 శాతం వాటా కొనుగోలుకు మొత్తం రూ.2,553 కోట్లు వెచ్చించనుంది. అంటే, మొత్తం 72.64 శాతం వాటాను రూ.5,757 కోట్లకు దక్కించుకోనుంది. విమానాశ్రయాలు, రహదారులు, మెట్రో ప్రాజెక్టు విభాగాల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో సివిల్ ఇంజనీరింగ్ సామర్థ్యాలను పెంచుకునేందుకు అదానీ గ్రూప్‌నకు ఐటీడీ సిమెంటేషన్ కొనుగోలు దోహదపడనుంది.

బీఎస్ఈలో ఐటీడీ సిమెంటేషన్ షేరు ధర శుక్రవారం రూ.532.80 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9,152 కోట్లుగా ఉంది. గడిచిన ఏడాది కాలంలో కంపెనీ షేరు 180 శాతానికి పైగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఐటీడీ సిమెంటేషన్ రూ.7,542 కోట్ల ఆదాయంపై రూ.274 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

ఈప్యాక్ డ్యూరబుల్‌తో హైసెన్స్ ఒప్పందం

శ్రీసిటీలో ప్లాంట్ ఏర్పాటు

దేశీయంగా ఏసీలు, రిఫ్రిజిరేటర్ల తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల సంస్థ హైసెన్స్.. భారత్‌కు చెందిన కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ (ఈడీఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా హైసెన్స్‌కు చెందిన ఎయిర్ కండీషనర్లు, గృహోపకరణాలను ఈప్యాక్ డ్యూరబుల్ దేశీయంగా ఉత్పత్తి చేయనుంది. ఇందుకోసం ఈప్యాక్ డ్యూరబుల్ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో ప్రత్యేకంగా అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుంది. 2025 జూన్ నాటికి ఈ ప్లాంట్‌లో రిఫ్రిజిరేటర్లు, ఏసీలు సహా వాషింగ్ మెషిన్ల వంటి పలు గృహోపకరణాల ఉత్పత్తిని ప్రారంభించనుంది. 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 10 లక్షల యూనిట్లకు చేర్చనుంది. శ్రీసిటీ ప్లాంట్‌లో తయారు చేయనున్న ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌కు మాత్రమే సరఫరా చేయకుండా కీలకమైన అంతర్జాతీయ మార్కెట్లకు వీటిని ఎగుమతి చేసే అవకాశాలను హైసెన్స్ పరిశీలించనుంది. ఈప్యాక్‌తో ఒప్పందంతో దేశీయ మార్కెట్లో గట్టి పట్టును చేజిక్కించుకోవటమే కాకుండా వచ్చే ఐదేళ్లలో 100 కోట్ల డాలర్ల ఆదాయం అదనంగా వస్తుందని హైసెన్స్ అంచనా వేస్తోంది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం రూ.11,746 కోట్లు

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) ఐసీఐసీఐ బ్యాంక్ స్టాండ్అలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14.5 శాతం వృద్ధితో రూ.11,746 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.10,261 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలానికి బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.40,697 కోట్ల నుంచి రూ.47,714 కోట్లకు ఎగబాకగా.. వడ్డీ ఆదాయం రూ.34,920 కోట్ల స్థాయి నుంచి రూ.40,537 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 9.5 శాతం వృద్ధితో రూ.20,048 కోట్లుగా నమోదు కాగా.. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.53 శాతం నుంచి 4.27 శాతానికి తగ్గింది. కాగా సెప్టెంబరు చివరి నాటికి బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 2.48 శాతం నుంచి 1.97 శాతానికి తగ్గాయి. కాగా, నికర ఎన్‌పీఏలు 0.43 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గాయి. గడిచిన మూడు నెలలకు ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 18.8 శాతం వృద్ధితో రూ.12,948 కోట్లకు, ఏకీకృత ఆస్తుల విలువ 18.4 శాతం పెరుగుదలతో రూ.25,16,512 కోట్లకు చేరుకున్నాయి.

- ఆన్‌లైన్ క్రెడిట్ సొల్యూషన్ సంస్థ క్రెడిట్‌బీ.. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని వారికి ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తెచ్చింది. వేతన జీవులు, స్వయం ఉపాధి పొందుతున్న వారి కోసం వ్యక్తిగత, వ్యాపార, ద్విచక్ర వాహన రుణాలు సహా ఆస్తుల తనఖాపై రుణాలను అందించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం సంస్థకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లో దాదాపు 75 లక్షల మంది రుణ ఖాతాదారులు ఉన్నారు.
- ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. ఇందులో భాగంగా తిరుపతిలో కొత్త శాఖను ప్రారంభించింది. దీంతో రాష్ట్రంలో బ్యాంక్ శాఖల సంఖ్య నాలుగుకు చేరుకోగా దేశవ్యాప్తంగా 972 శాఖలకు చేరింది.
- సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.45.4 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 9.8 శాతం క్షీణించింది. సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయం 35.7 శాతం వృద్ధి చెంది రూ.300 కోట్లకు చేరుకుంది.

ఎన్‌విడియా నం.1



ప్రపంచంలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా అవతరణ

రెండో స్థానానికి జారిన యాపిల్

న్యూయార్క్: అమెరికన్ ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా యాపిల్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా అవతరించింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఎన్‌విడియా షేర్లు రికార్డు స్థాయికి వృద్ధి చెందడంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3.53 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. ఆ సమయంలో యాపిల్ మార్కెట్ క్యాప్ 3.52 లక్షల కోట్ల డాలర్లుగా నమోదైంది. కంపెనీ సూపర్ కంప్యూటింగ్ ఏఐ చిప్‌లకు భారీగా డిమాండ్ నెలకొనడం ఇందుకు దోహదపడింది. ఈ నెలలో ఇప్పటివరకు ఎన్‌విడియా షేరు 18 శాతం పెరిగింది. కాగా, ఈ జూన్‌లోనూ ఎన్‌విడియా స్వల్పకాలం పాటు ప్రపంచ నం.1 కంపెనీగా ఎదిగినప్పటికీ.. యాపిల్, మైక్రోసాఫ్ట్‌లు మళ్లీ కంపెనీని అధిగమించేశాయి.

బజాజ్‌కు బైబై.. జియోకు హలో!

భారత్‌లో కొత్త భాగస్వామ్యం ఏర్పాటు యత్నాల్లో అలియాంజ్

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ఆర్థిక సేవలు, బీమా రంగ దిగ్గజం అలియాంజ్ ఎస్ఈ.. భారత్‌లో బజాజ్ గ్రూప్‌తో భాగస్వామ్యానికి స్వస్తి పలికి ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో జతకట్టే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. బజాజ్ ఫిన్‌సర్వ్, అలియాంజ్ ఎస్ఈ రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి భాగస్వామ్యం (జేవీ)లో జీవిత, సాధారణ బీమా వ్యాపారాలను ఏర్పాటు చేశాయి. బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్‌లో బజాజ్ 74 శాతం, అలియాంజ్ 26 శాతం వాటా కలిగి ఉన్నాయి. అయితే, ఈ జేవీల్లో తన వాటాను పెంచుకునేందుకు బజాజ్ అంగీకరించని నేపథ్యంలో అలియాంజ్ పూర్తిగా వైదొలగాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇదే సమయంలో అలియాంజ్‌తో కలిసి బీమా రంగ జేవీ ఏర్పాటు కోసం జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

వాణిజ్య అవసరాలకు భవనాలను అద్దెకు ఇస్తుంటే?



రాంబాబు గొండాల

హరి ఒక ప్రభుత్వ ఉద్యోగి. తాను పొదుపు చేసిన డబ్బుతో ఒక మంచి ఏరియాలో కొంతం స్థలం కొనుగోలు చేశాడు. కొన్నేళ్లలో ఆ ప్రాంతం మంచి వాణిజ్య కేంద్రంగా రూపుదిద్దుకుంది. దాంతో తాను కొన్న స్థలంలో ఒక భవనాన్ని నిర్మించి ఒక కార్పొరేట్ కంపెనీకి అద్దెకు ఇచ్చాడు. దీని అద్దె సంవత్సరానికి రూ.20 లక్షలు దాటుతుందని అనుకుందాం. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం వాణిజ్య భవనాలకు 18 శాతం చొప్పున పన్ను చెల్లించాలి. అలాగే అద్దె రూ.20 లక్షలు దాటుతుంది కాబట్టి హరికి రిజిస్ట్రేషన్ పొందటానికి కానీ, పన్ను చెల్లించటానికి కానీ ఎలాంటి వినహాయింపు లేదు.

అయితే, హరికి జీఎస్‌టీలో ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ లేదు. జీఎస్‌టీ గురించి ఎలాంటి అవగాహన లేదు. మరి దీని కోసం హరి జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ తీసుకోవాలా? ఈ సమస్య ఒక్క హరికే కాదు చాలా మందికి ఉంటుంది. ఈ ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల జీఎస్‌టీ చట్టంలో కొన్ని మార్పులు చేసింది.

దీని ప్రకారం జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ లేని వ్యక్తి తన వాణిజ్య భవనాన్ని లేదా వాణిజ్య సముదాయాన్ని లేదా అందులో భాగాన్ని ఏదేనీ కంపెనీకి లేదా వ్యాపార సంస్థకు అద్దెకి ఇచ్చి ఉంటే.. సదరు వ్యాపార సంస్థకు లేదా కంపెనీకి జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ ఉంటే.. ఆ అద్దెపై జీఎస్‌టీ చెల్లించాల్సిన బాధ్యత అద్దె చెల్లించే సంస్థదే. అంటే పై ఉదాహరణలో హరికి జీఎస్‌టీలో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు కాబట్టి సదరు కార్పొరేట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ ఉన్నట్లయితే, సంబంధిత జీఎస్‌టీ చెల్లించాల్సిన బాధ్యత ఆ కార్పొరేట్ కంపెనీదే. దీనినే రివర్స్ చార్జ్ మెకానిజం అంటారు. మరి, ఆ కంపెనీకి ఆ మేరకు నష్టం కదా అంటే, ఎంత మాత్రం నష్టం ఉండదు. ఎందుకంటే ఆ మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు. అంటే, ఉదాహరణకు నెలకు రూ.2 లక్షలు అద్దె అనుకుంటే, ఇంతకుముందు కంపెనీ హరికి రూ.2 లక్షలు, దానిపైన జీఎస్‌టీ రూ.36,000 కలిపి చెల్లించేది. హరి రూ.2 లక్షలు తాను ఉంచుకుని ప్రభుత్వానికి రూ.36,000 చెల్లించేవాడు. కంపెనీ తాను చెల్లించిన రూ.36,000 మొత్తాన్ని ఐటీసీ రూపేణా తీసుకునేది. అయితే ఇందులో కొంత క్లిష్టత ఉండేది. హరి తొలుత రిజిస్ట్రేషన్ పొందాలి. నెలవారీ రిటర్నులు దాఖలు చేయాలి. తాను పొందిన అద్దెను సక్రమంగా చూపుతూ ప్రభుత్వానికి సంబంధిత జీఎస్‌టీ సరిగా చెల్లించాలి. అంటే హరి విధి విధానాలను సరిగా పాటించకపోతే సదరు కంపెనీ ఐటీసీ పొందలేదు.

ఇప్పుడు ప్రవేశపెట్టిన కొత్త విధానంలో హరి రిజిస్ట్రేషన్ పొందాల్సిన అవసరం లేదు. అలాగే కంపెనీ కూడా ఐటీసీ పొందటం సులువు. మరి ఇలా ఒక కంపెనీకి కాకుండా హరి తన భవనాన్ని ఒక 10 షాపుల కింద విభజించి 10 మందికి అద్దెకు ఇచ్చాడనుకుందాం. అప్పుడు అద్దెకు తీసుకున్న అందరికీ రిజిస్ట్రేషన్ ఉంటే, రివర్స్ చార్జ్ మెకానిజం కింద అద్దెకు తీసుకున్న వ్యక్తులు అందరూ వస్తారు. అందరు వారి వారి అద్దెలకు సంబంధించి జీఎస్‌టీ చెల్లిస్తారు.

మరి అందులో కొందరికి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ లేకుంటే? అప్పుడు బిల్డింగ్ యజమానికి ఎంత అద్దె వస్తుందో చూడాలి. ఒకవేళ అద్దె మొత్తం రూ.20 లక్షలు దాటితే అప్పుడు భవన యజమాని రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. ఎప్పుడైతే రిజిస్ట్రేషన్ తీసుకుంటాడో, అప్పుడు రివర్స్ చార్జ్ మెకానిజం వర్తించదు. అంటే, అన్ని షాపులకు భవన యజమాని జీఎస్‌టీ చెల్లించాలి. అద్దెకు తీసుకున్న వ్యక్తులకు జీఎస్‌టీ ఉన్నా లేకున్నా.. క్లుప్తంగా చెప్పాలంటే వాణిజ్య భవనాల అద్దెకు సంబంధించి రివర్స్ చార్జ్ అనేది యజమానికి రిజిస్ట్రేషన్ లేకుండా.. అద్దెకు తీసుకున్న వ్యక్తికి రిజిస్ట్రేషన్ ఉన్నప్పుడే అమలవుతుంది. అయితే, రిజిస్ట్రేషన్ తీసుకోవటానికి కేవలం అద్దె మాత్రం కాకుండా ఇతర ఆదాయాన్ని కూడా చూడాలి. అలాగే విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ మన దేశంలో వాణిజ్య భవనాలను అద్దెకు ఇచ్చే వ్యక్తులకు కూడా ఈ విధానం చాలా ఉపయోగకరం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,290 ▲	73,600 ▲	1,07,000 ▼
ముంబై	78,015 ▼	71,462 ▼	95,800 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	535
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 78	



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	123
కరీంనగర్	120	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	126
కర్నూలు	120	నెల్లూరు	126
విశాఖపట్నం	105	అనంతపురం	126
గోదావరి	120		



12 ఏళ్లు.. 18 వరుస టెస్టు సిరీస్ విజయాలు. ఇదీ సొంతగడ్డపై టీమిండియా ట్రాక్ రికార్డు. 2012 నుంచి ఎంతటి ప్రత్యర్థి వచ్చినా మైదానాల్లో మనోళ్ల ఆటకు బెంబేలెత్తి 'పోయారు'. కానీ మన ఆధిపత్యానికి చెక్‌పెడుతూ ఈసారి న్యూజిలాండ్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. ఇటీవలే శ్రీలంక చేతిలో వైట్‌వాష్, కెప్టెన్ రాజీనామా.. సీనియర్ బ్యాటర్ కేన్ గాయపడడంతో పాటు లాథమ్, సౌథీలకు తప్ప పెద్దగా ఎవరికీ టెస్టు అనుభవమే లేదు. అసలిక్కడ వారు టెస్టు గెలిచే 36 ఏళ్లయ్యింది. ఇన్ని సమస్యలను అధిగమిస్తూ కివీస్ జట్టు సమష్టి ఆటతీరుతో భారత్‌పై విరుచుకుపడింది. స్పిన్నర్ శాంట్నర్ 13 వికెట్లతో భారత పతనాన్ని శాసించిన వేళ.. రెండో టెస్టులో అద్భుత విజయాన్ని దక్కించుకున్న కివీస్ మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను దక్కించుకుంది.



12 ఏళ్లలో తొలిసారి సొంతగడ్డపై భారత్‌కు పరాభవం

రెండో టెస్టులోనూ ఓటమి

1 సొంతగడ్డపై ఓ క్యాలెండర్ ఏడాదిలో ఎక్కువ టెస్టు పరుగులు (1084), సిక్సర్లు (33) బాదిన భారత బ్యాటర్‌గా జైస్వాల్. గుండప్ప విశ్వనాథ్ (1979లో 1047)ను అధిగమించాడు.

టెస్టులో రెండుసార్లు విరాట్ కోహ్లీని అవుట్ చేసిన తొలి లెఫ్టామ్ స్పిన్నర్‌గా శాంట్నర్.

2 స్వదేశంలో ఎక్కువ టెస్టు ఓటములు (4) పొందిన రెండో కెప్టెన్‌గా కపిల్, అజరుద్దీన్‌తో సమంగా నిలిచిన రోహిత్. మన్సూర్ అలీఖాన్ (9) టాప్‌లో ఉన్నాడు. జట్టు కోహ్లీ కెప్టెన్సీలో రెండుసార్లు ఓడగా.. ధోనీ సారథ్యంలో మూడుసార్లు ఓడింది.

డబ్ల్యూటీసీ ఫైనల్ కష్టమే..

కివీస్ చేతిలో రెండు టెస్టుల ఓటమితో భారత జట్టు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రస్తుతానికి 62.82 విజయాల శాతంతో జట్టు టాప్‌లోనే ఉన్నా ఫైనల్‌కు చేరాలంటే మాత్రం మిగిలిన ఆరు టెస్టుల్లో ఐదు గెలిచి, ఒకటి డ్రా చేసుకోవాలి. అంటే.. ఆఖరి టెస్టులో కివీస్‌పైనే కాకుండా ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టెస్టుల్లో నాలుగైనా గెలిస్తే నేరుగా తుది పోరుకు అర్హత సాధిస్తుంది. కానీ అదంత సులువు కాదు. కాబట్టి కనీసం రెండైనా గెలిచి నాలుగు డ్రా చేసుకున్నా, మిగతా జట్ల ఫలితాలపై ఆధారపడవచ్చు. అటు ఆస్ట్రేలియా (62.50), శ్రీలంక (55.56) జట్లు భారత్‌కు సవాల్ విసురుతున్నాయి.



సీన్ రివర్స్ సిరీస్ గల్లంతు

శాంట్నర్‌కు ఆరు వికెట్లు ● పోరాడిన జైస్వాల్ ● 2-0తో కివీస్‌కు తిరుగులేని ఆధిక్యం



జడేజా (42)

పుణె: స్వదేశంలో భారత క్రికెట్ జట్టు తిరుగులేని ఆధిపత్యానికి గండి పడింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో 18 సిరీస్‌ల విజయానికి న్యూజిలాండ్ ఫుల్‌స్టాప్ పెట్టింది. మూడు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో కివీస్ 113 పరుగులతో ఘనవిజయం సాధించింది. ఇప్పటికే తొలి టెస్టును గెలిచిన ఈ జట్టు మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ దక్కించుకుంది. భారత్‌లో టెస్టు సిరీస్ గెలవడం కివీస్‌కిదే తొలిసారి. కాగా, 2012-13లో ఇంగ్లండ్ చేతిలో చివరిసారి భారత్ ధోనీ కెప్టెన్సీలో ఇక్కడ సిరీస్ కోల్పోయింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, స్పిన్నర్ శాంట్నర్ మొత్తంగా 13 వికెట్లతో భారత్‌కు ఓటమి రుచి చూపించాడు. 359 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 245 రన్స్‌కు ఆలౌటైంది. ఓపెనర్ జైస్వాల్ (77), జడేజా (42) మాత్రమే రాణించారు. శాంట్నర్ 6, ఎజాజ్ 2 వికెట్లు తీశారు. అంతకుముందు శనివారం మూడోరోజు కివీస్ రెండో ఇన్నింగ్స్ గంటలోనే ముగిసింది. జడేజా (3/72) టెయిలెండర్ల పని బట్టడంతో కివీస్ 255 రన్స్‌కు ఆలౌటైంది. ఫిలిప్స్ (48 నాటౌట్), బ్లండెల్ (41) ఆకట్టుకున్నారు. సుందర్‌కు 4, అశ్విన్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 259, భారత్ 156 రన్స్ చేశాయి. ఆఖరి టెస్టు వచ్చేనెల 1 నుంచి ముంబైలో జరుగుతుంది.

ఆరంభం బాగున్నా..: భారీ ఛేదనను భారత్ దూకుడుగా ఆరంభించింది. తొలి ఓవర్‌లోనే జైస్వాల్ 6,4 బాదాడు. అటు శాంట్నర్ చేతిలో రోహిత్ (8) అవుటైనా.. గిల్ (23), జైస్వాల్ ఎదురుదాడికి దిగారు. వీరి పోటాపోటీ బౌండరీలతో లంచ్ సెషన్ ముగిసేసరికి జట్టు 12 ఓవర్లలోనే 81/1 స్కోరు సాధించింది. కానీ సజావుగా సాగుతున్న ఇన్నింగ్స్‌కు శాంట్నర్ చెక్ పెడుతూ గిల్ వికెట్ తీయడంతో రెండో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అంతే.. ఇక్కడి నుంచి భారత్ వికెట్ల పతనం సాగింది. జైస్వాల్ అవుటయ్యే దాకా ఓవర్‌కు ఆరు పరుగుల రన్‌రేట్‌తో సాగిన ఛేదన ఆ తర్వాత పూర్తిగా నెమ్మదించింది. రెండో సెషన్‌లోనే ఆరు కీలక వికెట్లు కోల్పోయి జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆఖర్లో జడేజా, అశ్విన్ (18) పోరాటం కివీస్ బౌలర్లను పరీక్షించింది. అటు భారత్ విజయంపై ఆశలు రేపినా ఫలితం లేకపోయింది. మరోసారి శాంట్నర్ కివీస్‌కు ఆపద్బాంధవుడి పాత్ర పోషిస్తూ అశ్విన్‌ను అవుట్ చేశాడు. ఈ సమయంలో జడ్డూ భారీ షాట్లతో అలరించాడు. అయితే స్పిన్నర్ ఎజాజ్.. ఆకాశ్ (1), జడ్డూ వికెట్లను తీయడంతో కివీస్ విజయం అందుకుంది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 259; భారత్ తొలి ఇన్నింగ్స్: 156

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లండెల్ (బి) జడేజా 41; ఫిలిప్స్ (నాటౌట్) 48; శాంట్నర్ (సి) బుమ్రా (బి) జడేజా 4; సౌథీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; ఎజాజ్ (సి) సుందర్ (బి) జడేజా 1; ఓరోక్ (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 69.4 ఓవర్లలో 255 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-36, 2-78, 3-89, 4-123, 5-183, 6-231, 7-237, 8-238, 9-241, 10-255. **బౌలింగ్:** అశ్విన్ 25-2-97-2; సుందర్ 19-0-56-4; జడేజా 19.4-3-72-3; బుమ్రా 6-1-25-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మిచెల్ (బి) శాంట్నర్ 77; రోహిత్ (సి) యంగ్ (బి) శాంట్నర్ 8; గిల్ (సి) మిచెల్ (బి) శాంట్నర్ 23; కోహ్లీ (ఎల్బీ) శాంట్నర్ 17; పంత్ (రనౌట్) 0; సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21; సర్ఫరాజ్ (బి) శాంట్నర్ 9; జడేజా (సి) సౌథీ (బి) ఎజాజ్ 42; అశ్విన్ (సి) మిచెల్ (బి) శాంట్నర్ 18; ఆకాశ్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; బుమ్రా (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 60.2 ఓవర్లలో 245 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-34, 2-96, 3-127, 4-127, 5-147, 6-165, 7-167, 8-206, 9-229, 10-245. **బౌలింగ్:** సౌథీ 2-0-15-0; ఓరోక్ 1-0-5-0; శాంట్నర్ 29-2-104-6; ఎజాజ్ 12.2-0-43-2; ఫిలిప్స్ 16-0-60-1.

ఏదీ ఆ నైపుణ్యం?

కోహ్లీ, రోహిత్, జడేజా, అశ్విన్ వంటి సూపర్ స్టార్లు ఉండీ.. అదీ స్వదేశంలో.. అందునా స్పిన్ వికెట్‌పై భారత జట్టు ఘోర పరాభవాన్ని దేశ క్రికెట్ ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ మేటి క్రికెటర్లకు వయస్సు మీరినందున స్పిన్ బౌలర్లనూ సమర్థంగా ఎదుర్కోలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అశ్విన్‌కు 38 ఏళ్లు, రోహిత్ వయస్సు 37 సంవత్సరాలు, కోహ్లీ, జడేజా కూడా 36కి సమీపిస్తున్నారు. ఈనేపథ్యంలో వారిలో బ్యాటింగ్, బౌలింగ్‌లో గత నైపుణ్యాలు కొరవడ్డాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వయస్సు తరుముకొస్తుండడం నిజమే. కానీ స్వదేశంలో మన బ్యాటర్లు బ్యాటింగ్ చేసే విధానంలోనే లోపముంది. కొంతకాలంగా టెస్ట్ మ్యాచ్‌ల తొలి ఇన్నింగ్స్‌లో మనోళ్లు చాలినన్ని పరుగులు చేయలేకపోతున్నారు. 450 పరుగులు చేసినంత సమయం క్రీజులో ఉంటేనే పిచ్ నలిగి స్పిన్నర్లకు తోడ్పడుతుంది. కానీ మన టాపార్డర్ బ్యాటర్లు అంతసేపు బ్యాటింగ్ చేస్తే కదా! పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాటింగ్ చేయడం టెస్ట్ క్రికెట్‌లో ముఖ్యం. పైగా..స్పిన్నర్లను తిప్పికొట్టాలంటే చక్కని డిఫెన్సివ్ నైపుణ్యాలుండాలి. దిగ్గజాలు సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్, గంగూలీ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్నారంటే ఓపిక, డిఫెన్స్ నైపుణ్యాలే కారణం. ప్రస్తుత ఐపీఎల్, టీ20 ఎరాలో యువ బ్యాటర్లే కాదు సీనియర్లలోనూ ఎక్కువ సమయం క్రీజులో ఉండాలనే ధోరణి కనిపించడంలేదు. పరిస్థితులకు తగ్గట్టు బ్యాటింగ్ తీరును మార్చుకోకపోవడమే న్యూజిలాండ్‌తో తొలి రెండు టెస్ట్‌ల ఘోర పరాజయానికి కారణమనేది సుస్పష్టం. ఇక బీసీసీఐ ఏరికోరి తెచ్చుకున్న గంభీర్ చీఫ్ కోచ్‌గా అటు బ్యాటింగ్ ఇటు బౌలింగ్ విభాగాల్లో భారత్ బోల్తాపడడం గమనార్హం. గత జూలైలో శ్రీలంకపై ఆ దేశంలో టీ20 సిరీస్ గెలవడం ద్వారా గంభీర్ కోచింగ్ ప్రస్థానం ఘనంగా ప్రారంభమైంది. కానీ ఆ జట్టుతో వన్డే సిరీస్‌లో స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో భారత జట్టు డొల్లతనం బయటపడింది. అసలంక, వెల్లలగే, హసరంగ, వాండర్సేతో కూడిన లంక స్పిన్‌ను రోహిత్, కోహ్లీ వంటి మహామహులతో కూడిన టీమిండియా ఎదుర్కోలేక వన్డే సిరీస్‌ను కోల్పోయింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

'పోస్ట్‌మార్టం అవసరం లేదు'

మా ఆటతీరును పోస్ట్‌మార్టం చేయాలనుకోవడం లేదు. ఇదే బ్యాటర్లు గతంలో సిరీస్ విజయాలు అందించిన విషయం గుర్తుంచుకోవాలి. అయితే, 20 వికెట్లు సాధించినా బ్యాటర్లు కూడా పరుగులు చేయాల్సి ఉంది. కానీ అదే జరగలేదు. ఫలితం అనుభవించాం. ఇది సమష్టి వైఫల్యం. - రోహిత్ శర్మ

మహిళల రెండో వన్డే నేడు

భారత్ X న్యూజిలాండ్

మ. 1.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

హాకీ కుర్రాళ్లకు కాంస్యం

జొహర్ (మలేసియా): సుల్తాన్ జొహర్ కప్ అండర్-21 హాకీ టోర్నీలో భారత జట్టు కాంస్య పతకం గెలుపొందింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో మనోళ్లు షూటౌట్‌లో 3-2తో న్యూజిలాండ్‌ను ఓడించి మూడో స్థానంలో నిలిచారు. ఇక ఫైనల్లో బ్రిటన్ 3-2తో ఆస్ట్రేలియాను కంగుతినిపించి విజేతగా నిలిచింది.



టైటాన్స్‌కు హ్యాట్రిక్ ఓటములు

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్‌కు వరుసగా మూడో ఓటమి ఎదురైంది. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 37-41తో దబాంగ్ ఢిల్లీ చేతిలో చిత్తయింది. టైటాన్స్ ఆటగాడు పవన్ సెహ్రావత్ 18 పాయింట్లతో చెలరేగినా ఫలితం లేకపోయింది. కాగా, యు ముంబా, బెంగాల్ వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్ 31-31తో టైగా ముగిసింది.

కబడ్డీ ఎన్నికల వాయిదాకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కబడ్డీ అసోసియేషన్‌కు ఆదివారం జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేసేందుకు హైకోర్టు నిరాకరించింది. స్పోర్ట్స్ కోడ్ నిబంధనలు పాటించడం లేదని, ఓటరు జాబితాలోనే అనేక అక్రమాలు చోటు చేసుకున్నందున ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ జాతీయ క్రీడాకారుడు హేమంత్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఎన్నికల వాయిదాకు ఆదేశాల్విలేమని పేర్కొంది. ఎన్నికల్లో అవకతవకలు జరిగినట్టు తేలితే, ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తామన్న కోర్టు.. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

సిరీస్ పాకిస్థాన్‌దే

రావల్పిండి: స్పిన్నర్లు నోమన్ అలీ (6/42), సాజిద్ ఖాన్ (4/69) ఇంగ్లండ్‌ను తిప్పేయడంతో ఆఖరి టెస్ట్‌లో పాకిస్థాన్ 9 వికెట్లతో విజయం సాధించింది. దాంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 24/3తో శనివారం, మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 112 రన్స్‌కే కుప్పకూలింది. అనంతరం 36 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని పాక్ 37/1 స్కోరు చేసి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 267, పాకిస్థాన్ 344 రన్స్ చేశాయి. పాక్ జట్టు స్వదేశంలో టెస్ట్ సిరీస్ నెగ్గడం 2021 తర్వాత ఇదే తొలిసారి.

తన్మయ్ సెంచరీ

హైదరాబాద్ 290/1

హైదరాబాద్: తన్మయ్ అగర్వాల్ (152 బ్యాటింగ్) శతకంతో.. పుదుచ్చేరితో శనివారం ఆరంభమైన రంజీ గ్రూప్-బి మ్యాచ్‌లో హైదరాబాద్ భారీస్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 290/1 స్కోరు చేసింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తన్మయ్‌తో పాటు రోహిత్ రాయుడు (62) క్రీజులో ఉన్నాడు. అభిరత్ (68) తొలి వికెట్‌కు 111 రన్స్ జోడించిన తన్మయ్.. రోహిత్‌తో రెండో వికెట్‌కు అజేయంగా 179 రన్స్ భాగస్వామ్యం నెలకొల్పాడు. ఇక, హిమాచల్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర తొలిరోజు మొదటి ఇన్నింగ్స్‌లో 295/6 స్కోరు చేసింది.

పేదల భూములను లాక్కుంటే ఊరుకోం

» ఎంపీ ఈటల.. దుండిగల్‌లో రైతులకు మద్దతు



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, పక్కనే తహశీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్

దుండిగల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దుండిగల్‌లో పేదల భూములను ప్రభుత్వం లాక్కోవాలని చూస్తోందని, దీన్ని అడ్డుకుంటామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సర్వే నంబరు 453, 454ల్లో ఉన్న 515 ఎకరాల అసైన్డ్ భూమిని రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ)కు అప్పగించడానికి రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. సర్వేయర్లను రైతులు అడ్డుకుంటూ వస్తున్నారు. శనివారం దుండిగల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ ఈటల, బీజేపీ నాయకుడు మల్లారెడ్డితో వచ్చి రైతులకు మద్దతు తెలిపారు. ఈటల మాట్లాడుతూ రైతులు అసైన్డ్ భూముల్లో కూరగాయలు, ఇతర పంటలు పండించుకొని జీవిస్తున్నారని, ఇప్పుడు భూములను అర్ధాంతరంగా లాక్కోవడం అన్యాయమన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరించి పుట్టగతులు లేకుండా పోయిందన్నారు. అప్పట్లో కూడా అసైన్డ్ భూములకు రూపాయి ఇవ్వకుండా గుంజుకుంటానంటే రాజశేఖర్‌రెడ్డితో కూడా కొట్లాడామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎకరా భూమి కోట్లల్లో ధర పలుకుతున్న తరుణంలో ప్రభుత్వం ఏమీ ఇవ్వకుండా గుంజుకుంటానంటే సహించేది లేదన్నారు. కాగా, దుండిగల్ తహశీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్ రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజావసరాల కోసం అసైన్డ్ భూమిని వెనక్కితీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. ఇప్పటికీ 500 ఎకరాలకు పైగా ఉన్న భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉందన్నారు. అసైన్డ్ భూమిలో రైతులు వ్యవసాయం చేసుకోవాలి కానీ విక్రయించే అధికారం లేదన్నారు. భూమి సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకోవడం పద్ధతి కాదని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేసి తీరుతామన్నారు.

చేతికి వైర్ చుట్టి.. కరెంటు షాక్ పెట్టుకొని!

» ఆర్థిక ఇబ్బందులతో కూతురితో సహా భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

» భార్య మృతి, భర్త పరిస్థితి విషమం..

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భార్యాభర్తలిద్దరూ తమ కూతురితో సహా ఆత్మహత్యకు యత్నించారు. ఇంట్లోనే చేతి మణికట్టుకు వైర్ చుట్టుకొని.. కరెంట్ షాక్‌తో ప్రాణాలు తీసుకోబోయారు. ఈ ఘటనలో భార్య మృతి చెందగా.. భర్త పరిస్థితి విషమంగా ఉంది. చివరి నిమిషంలో తేరుకున్న కూతురు ప్రాణాలతో బయటపడింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మునిసిపాలిటీ ప్రతాప్‌సింగారంలో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. యాదాద్రి-భువనగిరి జిల్లా ఆలేర్‌కు చెందిన రామకృష్ణ చారి వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య విజయలక్ష్మి (35) ఇద్దరు పిల్లలతో కలిసి గత మూడేళ్ల నుంచి ప్రతాప్ సింగారంలో అద్దెకు ఉంటున్నారు. అయితే కొద్దిరోజులుగా వారు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం మధ్యాహ్నం కరెంట్ లేని సమయంలో భార్యాభర్తలిద్దరూ ఇంట్లోని పడక గదిలో చేతి మణికట్టుకు కరెంట్ వైర్‌తో చుట్టుకొని, కూతురు చేతికి సైతం వైర్ చుట్టి స్విచ్ ఆన్ చేసి పడుకున్నారు. కరెంట్ రాగానే భార్య విజయలక్ష్మి మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా మారింది. కూతురుకు షాక్ తగలడంతో వెంటనే తేరుకుని బయటకు వచ్చి ప్రాణాలను కాపాడుకుంది. ఆ బాలిక స్థానికులకు విషయం చెప్పడంతో 108, పోలీసులకు సమాచారం ఇచ్చారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న రామకృష్ణను ఆస్పత్రికి తరలించారు.

ప్రజా సంక్షేమానికే మూసీ ప్రక్షాళన

» ప్రజలే ప్రతిపక్షాల నోరు మూయించాలి

» మూసీ పునరుజ్జీవం ప్రజా చైతన్య యాత్రలో..

» ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం




ప్రజా చైతన్య యాత్ర సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, పక్కన ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి, నకిరేకల్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం అన్నారు. మూసీ నది ప్రక్షాళనకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలంతా మద్దతు పలకాలని, ప్రతిపక్షాల నోరు మూయించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మూసీ పునరుజ్జీవన కార్యక్రమానికి ప్రజల మద్దతు కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా మక్తానంతారం, పిలాయిపల్లి వద్ద శనివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. వందలాది మంది ఆయకట్టు రైతులు, సమీప గ్రామాల ప్రజలతో కలిసి మూసీ నది వంతెనపై పాదయాత్ర చేశారు. అనంతరం కత్వ వద్ద ప్రజలతో కలిసి మూసీలో పారుతున్న నీటిని పరిశీలించారు. అనంతరం వారు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మూసీ నది పూర్తిగా కలుషితమైందన్నారు. రసాయన వ్యర్థాలు నదిలో కలుస్తుండడంతో సమీప ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూసీ కాలుష్య రక్కసి నుంచి ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజలకు విముక్తి కలిగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన చేపడుతున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి చేపట్టిన ఈ మహత్కార్యానికి అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుండగా ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయ దురుద్దేశంతో ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయని విమర్శించారు. ఎవరు అడ్డుకున్నా సీఎం రేవంత్ మూసీ ప్రక్షాళన చేపట్టడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, యాదాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన ఆగదు: చనగాని దయాకర్

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూసీ అభివృద్ధి బావి తరాలకు అవసరమని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా మూసీ ప్రక్షాళన ఆగదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ అన్నారు. ఈ యజ్ఞంలో యువత కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చనగాని మాట్లాడారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్నది ప్రతిపక్ష నేతలు మాత్రమేనని, బాధితులు కాదని తెలిపారు. మూసీ ప్రక్షాళనతో ఉమ్మడి నల్లగొండ జిల్లా తలరాతే మారుతుందని పేర్కొన్నారు. మూసీపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైదరాబాద్ వాసులూ స్వాగతిస్తున్నారన్నారు.





ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు కుమార్తె గాయత్రి సోనాక్షి వివాహం ఐపీఎస్ రుత్విక్‌సాయితో శనివారం శంషాబాద్ సమీపంలోని సిటాడెల్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి ఏపీ సీఎం చంద్రబాబు, ఏబీఎన్ డైరెక్టర్ కె.భానుప్రకాష్ (రెండో ఫొటోలో చివరి వ్యక్తి) హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. - శంషాబాద్ రూరల్

రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ టాప్

» స్థిరాస్తి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

» మూసీ నిర్వాసితుల కోసం ప్రత్యేక టవర్లు

» నరెడ్కో ప్రాపర్టీ షోలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో హైదరాబాద్ దేశంలోనే ముందంజలో ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు ఇటీవల విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నరెడ్కో(నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రాపర్టీ షోను డిప్యూటీ సీఎం భట్టి శనివారం సందర్శించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. హైడ్రా కూల్చివేతలపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతుందన్నారు. అన్ని అనుమతులు ఉన్న నిర్మాణాల జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. ఇక, మూసీ నిర్వాసితులకు మెరుగైన జీవితం ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మూసీ నిర్వాసితుల కోసం వారు ప్రస్తుతమున్న ప్రాంతంలోనే టవర్లు నిర్మించి ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు, నిర్వాసితుల పిల్లల కోసం ఇంటి గ్రేటేడ్ పాఠశాలలు కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.10వేల కేటాయించామంటే నగరాభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యం అర్థం చేసుకోవాలని అన్నారు. మూసీ పునరుజ్జీవం, రీజినల్ రోడ్డు, 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ వస్తున్నాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలు, క్రికెట్ స్టేడియం, ఏఐ ప్రాజెక్టులు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో నరెడ్కో అధ్యక్షుడు మేక విజయసాయి, ప్రతినిధులు కిరణ్, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1లో 67.4 శాతం హాజరు

పేపర్-5 కఠినంగా వచ్చిందన్న అభ్యర్థులు

నారాయణమ్మ కాలేజీలో కాపీయింగ్‌కు యత్నం

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 పరీక్షలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 46 కేంద్రాల్లో శనివారం పేపర్-5 నిర్వహించారు. 21,181 మంది హాజరయ్యారని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. హాజరు 67.4 శాతంగా నమోదైంది. నారాయణమ్మ కాలేజీలో చేతిరాత చీటీలతో ఓ అభ్యర్థి పట్టుబడ్డాడు. ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో అతడు రాసుకొచ్చిన సమాధానాలు సరిపోలేదని గుర్తించిన వెంటనే పరీక్ష కేంద్రం నుంచి పంపించేశారు. అతడు భవిష్యత్తులో పరీక్షలు రాయకుండా చర్యలు తీసుకుంటామని కమిషన్ తెలిపింది. శనివారం జరిగిన సైన్స్ అండ్ టెక్నాలజీ - డేటా ఇంటర్‌ప్రిటేషన్(డీఐ) పేపర్-5 ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని అభ్యర్థులు తెలిపారు. గ్రూప్-1లో తొలిసారి ఈ పేపర్‌కు 50 మార్కులు కేటాయించారు. 30 ప్రశ్నలకు 25 రాయాల్సి ఉంటుంది. ప్రతీ ప్రశ్నకు రెండు మార్కులు. ఒక్కో ప్రశ్న చదివి అర్థం చేసుకోవడానికే 5నిమిషాలకు పైగా పట్టిందని అభ్యర్థులు పేర్కొన్నారు. రెండు మార్కుల సమాధానాన్ని కూడా 5 మార్కుల స్థాయిలో రాయాల్సి వచ్చిందని వివరించారు.

తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలను త్వరలోనే ఆమోదిస్తాం

» 2 నెలల్లో టీటీడీ కొత్తబోర్డు..: ఏపీ మంత్రి సుభాష్

» యాదగిరి లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న వాసంశెట్టి

భువనగిరి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కొత్త పాలక మండలి ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలను స్వీకరిస్తామని ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. శనివారం ఆయన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనానికి రాగా.. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వాసంశెట్టి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ఈవో భాస్కర్‌రావు ఆయనకు లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుభాష్ మీడియాతో మాట్లాడుతూ.. మరో రెండు నెలల్లో కొత్త పాలకమండలి ఏర్పడనుందన్నారు. ఆ వెంటనే తెలంగాణ నుంచి వచ్చే సిఫారసు లేఖలను ఆమోదించి, దర్శన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

మూడు డీఏలు తక్షణమే విడుదల చేయాలి

» ఉపాధ్యాయ సంఘాల జేఏసీ

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ప్రభుత్వాన్ని కోరింది. సంఘం సమావేశం శనివారం కాచీగూడలోని ఎస్టీయూ భవనంలో జరిగింది. జ్యాక్టో చైర్మన్ సదానందం గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జ్యాక్టో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జి.సదానందంగౌడ్, కార్యదర్శిగా కృష్ణుడు, కోశాధికారిగా హేమచంద్రుడు, ప్రచార కార్యదర్శిగా అబ్దుల్లా, కోచైర్మన్లుగా ఎం.రాధాకృష్ణ, డి.వెంకటేశ్వరరావు, చైతన్య, జయబాబు, అంజయ్య, అలీబాబా, డిప్యూటీసెక్రటరీ జనరల్‌గా విఠల్, నజీరుద్దీన్, నగేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జ్యాక్టో శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్మెంట్‌కు అవకాశం ఇవ్వాలి

సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, సహాధ్యక్షుడు రవీందర్ గౌడ్ కోరారు. ఈ మేరకు వారు శనివారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహ రెడ్డికి వినతిపత్రం అందించారు.

నామినేషన్‌పైనే డీపీఆర్ పనులు

నాటి ఇరిగేషన్ మంత్రి వల్లే ఇచ్చాం.. వరద ప్రవాహ వేగానికి అనుగుణంగా కాళేశ్వరం బ్యారేజీల డిజైన్లు జరగలేదు

» జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు తెలిపిన రామగుండం చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పన పనులను టెండర్లు పిలవకుండా నామినేషన్‌పైనే అప్పగించామని రామగుండం చీఫ్ ఇంజనీర్ కె.సుధాకర్‌రెడ్డి.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు తెలిపారు. అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావే ఇందుకు కారణమన్నారు. బ్యారేజీల డిజైన్లు.. వరద ప్రవాహ వేగానికి అనుగుణంగా జరగలేదన్నది వాస్తవమని చెప్పారు. కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ శనివారం సుధాకర్‌రెడ్డిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఈ సందర్భంగా నిర్మాణ పనులు జరిగాయో, లేదో చూసుకోకుండానే సబ్‌స్టాన్షియల్ కంప్లీషన్ సర్టిఫికెట్(ఎస్ఎస్‌సీసీ)పై కౌంటర్ సంతకాలు చేస్తారా? ఏయే కాంపోనెంట్‌లలో ఏ మేరకు పని జరిగిందనే వివరాలు చూసుకోకుండా, బ్యారేజీలను కూడా పరిశీలించకుండా సంతకాలు చేస్తారా? అంటూ ప్రశ్నించింది. స్పృహ కోల్పోయి రబ్బరు స్టాంపులా వ్యవహరించారా? పనులు సంపూర్ణంగా జరిగాయో, లేదో పరిశీలించుకోవాల్సిన బాధ్యత లేదా? అని కమిషన్ నిలదీసింది. దీనికి సుధాకర్‌రెడ్డి బదులిస్తూ, "నాకున్న స్పృహతో పనులన్నీ జరిగాయనే కౌంటర్ సంతకం చేశాను. జీవో 94 ప్రకారం కౌంటర్ సంతకం చేసే ముందు తనిఖీలు చేయాలని ఎక్కడా లేదు. ఆ జీవోను అనుసరించే ఎస్ఎస్‌సీసీపై కౌంటర్ సంతకాలు చేశాను" అని చెప్పారు. దాంతో కమిషన్ జోక్యం చేసుకుంటూ, 'మీకు మీరుగా ఉచ్చులో పడుతున్నారు' అని చురక అంటించింది.

కమిషన్: మేడిగడ్డ బ్యారేజీ పూర్తయిన తర్వాత కాఫర్ డ్యామ్, సంబంధిత షీట్‌పైల్స్ పూర్తిగా తొలగించకపోవడంతో వరద ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి బ్యారేజీ దెబ్బతిన్నది. ఇది నిర్లక్ష్యం కాదా?

సుధాకర్‌రెడ్డి: 'పాక్షికంగా నిజమే.

కమిషన్: నిర్మాణసంస్థ కాఫర్ డ్యామ్‌ను ఎందుకు తొలగించలేదు? ఆ పనులకు తొలి సవరణ అంచనాల్లో 61.21 కోట్లు కేటాయించారా?

సుధాకర్‌రెడ్డి: కొన్నిచోట్ల కాఫర్ డ్యామ్ కోసం వినియోగించిన షీట్‌పైల్స్‌ను పూర్తిగా తొలగించలేదు.

కమిషన్: 2019లో వచ్చిన వరదలతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలకు నష్టం జరిగిందా? నిర్మాణ సంస్థలు మరమ్మతులు చేశాయా?

సుధాకర్‌రెడ్డి: అన్నారం, సుందిళ్లకు మరమ్మతులు జరిగినా.. మేడిగడ్డలో మరమ్మతులు జరగలేదు.

కమిషన్: దేశంలో జలాశయాల నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వినియోగించడం లేదు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో వాటిని ఎందుకు వాడాల్సి వచ్చింది?

సుధాకర్‌రెడ్డి: ఆర్‌సీసీ కటాఫ్ లేదా సీకెంట్ పైల్స్ వాడాలని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) సిఫారసు చేయగా.. ఆర్‌సీసీ కటాఫ్ వాల్ కన్నా ఖర్చు తక్కువ అని సీకెంట్ పైల్స్‌ను వినియోగించాం. బ్యారేజీల వైఫల్యంపై ఎన్‌డీఎస్‌ఏ ఇంకా ఏకాభిప్రాయానికి రాలేదు.

కమిషన్: కోల్‌బెడ్‌పై మేడిగడ్డ నిర్మాణం జరిగిందా? జాదవ్‌పూర్ వర్సిటీ నివేదికలో ఉంది కదా?

సుధాకర్‌రెడ్డి: బ్యారేజీ కోసం వేసిన పలు బోర్‌హోల్స్‌లో ఒక్కదాంట్లోనే చిన్న మోతాదులో బొగ్గు లభ్యమైంది. ఇతర హోల్స్‌లో దొరకలేదు.

కమిషన్: గేట్ల ఆపరేషన్ షెడ్యూల్‌కు విరుద్ధంగా గేట్లు ఎత్తడంతోనే బ్యారేజీ దిగువ భాగంలో అప్రాన్, సీసీ బ్లాకులు దెబ్బతిన్నాయా?

సుధాకర్‌రెడ్డి: బ్యారేజీల్లో పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉన్న సమయంలో గేట్లను ఎత్తే క్రమంలో వరద ప్రవాహ వేగం పెరిగి.. దిగువ భాగంలో అప్రాన్, సీసీ బ్లాకులు దెబ్బతిన్నాయి. వరద ప్రవాహానికి అనుగుణంగా డిజైన్లు జరగలేదనేది వాస్తవం.

కమిషన్: సబ్‌స్టాన్షియల్ కంప్లీషన్ సర్టిఫికెట్‌కు కంప్లీషన్ సర్టిఫికెట్‌కు ఉన్న తేడాలేంటి?

సుధాకర్‌రెడ్డి: ఇంజనీరింగ్ ఇన్‌చార్జి(ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) తృప్తి మేరకు పనులు జరిగి.. వినియోగానికి సిద్ధంగా ఉండేలా పనులు జరిగితే సబ్‌స్టాన్షియల్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇస్తారు. ప్రాజెక్టులోని అన్ని కాంపోనెంట్ల పనులు పూర్తిగా, అగ్రిమెంట్‌కు అనుగుణంగా జరిగితే కంప్లీషన్ సర్టిఫికెట్(సీసీ) ఇస్తారు. 2019లో మేడిగడ్డకు ఎస్ఎస్‌సీసీ ఇస్తే, 2021లో సుందిళ్లకు సీసీ ఇచ్చాం. మేడిగడ్డకు ఈఈగా ఉన్న బీవీ రమణారెడ్డి జారీ చేస్తే.. నేను కౌంటర్ సంతకం చేశాను. సుందిళ్లకు ఈఈ తిరుపతిరావు సీసీ ఇస్తే.. కౌంటర్ సంతకం ఎస్ఈగా ఉన్న బీవీ రమణారెడ్డి పెట్టారు.

కమిషన్: కాళేశ్వరం కార్పొరేషన్‌ను ఎప్పుడు ఏర్పాటుచేశారు? ఆ సమయంలో మంత్రి ఎవరు?

సుధాకర్‌రెడ్డి: కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఎస్పీవీగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశాం. ఆ సమయంలో నీటిపారుదల శాఖ మంత్రిగాహరీశ్‌రావు ఉన్నారు.

కమిషన్: బ్యారేజీల వాస్తవిక నిర్మాణ అంచనా వ్యయం ఎంత? ఎవరు ఆమోదించారు?

సుధాకర్‌రెడ్డి: బ్యారేజీల అంచనాలను రెండుసార్లు సవరించారు. సవరణ అంచనాలను స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీలో చర్చించిన తర్వాత ప్రభుత్వానికి పంపిస్తే.. అప్పటి నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆమోదం తెలిపారు.

39 మంది కానిస్టేబుళ్ల సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

పోలీసు శాఖ గుర్తించింది. తీవ్రమైన క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడుతున్న 39 మందిని గుర్తించి సస్పెండ్ చేసింది. వీరిలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు. పోలీస్ యూనిఫాం క్రమశిక్షణకు మారుపేరని, యూనిఫాం సర్వీస్‌లో ఉండి నిరసనలకు దిగడం సరికాదని డీజీపీ జితేందర్ అన్నారు. టీజీఎస్పీ విధులు కొన్ని దశాబ్దాల నుంచి అమల్లో ఉన్నాయని తెలిపారు. పోలీస్ నియామక సమయంలోనే కానిస్టేబుళ్లను సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీస్‌గా ఎంపిక చేస్తారని వివరించారు. విభాగాల వారీగా సిబ్బంది పనితీరు ఉంటుందన్నారు. తెలంగాణ పోలీస్‌లకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వేతనాలు ఎక్కువగానే ఉన్నాయని, ఆరోగ్య భద్రత, ఇతర అనేక సంక్షేమ పథకాలు అమల్లో ఉన్నాయని డీజీపీ చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే బెటాలియన్లలో నిర్వహించే 'దర్బార్'లో ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. యూనిఫాం సర్వీస్ సిబ్బంది ఆందోళనలు నిర్వహించడం తీవ్రమైన విషయమని తెలిపారు. టీజీఎస్పీ సిబ్బంది సమస్యలను పోలీస్ శాఖ సానుభూతితో పరిశీలిస్తుందని డీజీపీ తెలిపారు. ఆందోళనలకు దిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వెట్టి నుంచి విముక్తి కల్పించండి..

"పోలీస్ జాబ్ అంటే ఎంతో ఇష్టంతో.. కష్టపడి సాధించుకున్నాం. అందరికీ ఒకే రకంగా శిక్షణ ఇచ్చారు. స్పెషల్ పోలీస్ అంటూ మమ్మల్ని బెటాలియన్‌లో కానిస్టేబుళ్లుగా మార్చి వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. బెటాలియన్‌లో మట్టి పనులు చేయించడంతోపాటు నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్నారు. పోలీస్ డ్యూటీలకు సంబంధం లేకుండా వాగులో ఇసుక తేవడం, మిషన్ భగీరథ పైపులు తేవడం వంటివి చేయిస్తున్నారు" అని సిరిసిల్లలోని 17వ పోలీస్ బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. బెటాలియన్‌లో తమతో చేయిస్తున్న పనుల వీడియోలను చూపించారు. శనివారం బెటాలియన్‌లో కమాండెంట్ పోలీస్ కార్యాలయం ఎదుట కానిస్టేబుళ్లు ధర్నా చేశారు. తమిళనాడు, కర్ణాటకలో ఉన్న పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రా అధికారులు తమపై పెత్తనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్ బెటాలియన్‌కు చేరుకుని కానిస్టేబుళ్ల ఆవేదన విన్నారు. ఈ క్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు ఎస్పీ కాళ్ల మీదపడి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని, ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని కోరారు. ఎస్పీ ఎదుట పోలీసులు కంటతడి పెట్టడం అందరినీ కలచివేసింది. మరోవైపు, హనుమకొండ జిల్లా మామునూరులోని టీజీఎస్పీ 4వ బెటాలియన్‌కు చెందిన 260 మంది బెటాలియన్ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఒకే రాష్ట్రం, ఒకే పోలీస్ వ్యవస్థ అమలు చేయాలని కోరారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. నల్లగొండ సమీపంలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇటీవల బెటాలియన్ పోలీసుల సెలవుల విషయంలో వారి కుటుంబసభ్యులు ధర్నా చేయడంతో అధికారులు ఆరుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం బెటాలియన్‌లో పోలీసులు ఆందోళనకు దిగారు. సస్పెన్షన్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేయడంతో పాటు ఇటీవల నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు తమ కుటుంబ సభ్యులతో వ్యవహరించిన తీరుపై వారు నిరసన తెలిపారు.



మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో నిరసన తెలుపుతున్న పోలీసు కానిస్టేబుళ్లు



ఇబ్రహీంపట్నంలో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యుల ర్యాలీ

కొనసాగుతున్న కుటుంబ సభ్యుల ఆందోళనలు..

'ఒక రాష్ట్రం.. ఒకే పోలీస్' నినాదంతో తెలంగాణ స్పెషల్ పోలీసు కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. మంచిర్యాల జిల్లా గుడిపేటలోని 13వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు శనివారం మంచిర్యాలలో రాస్తారోకో చేశారు. ఆదిలాబాద్ జిల్లా యాపల్‌గూడలోని రెండో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ కలెక్టరేట్ చౌరస్తాలో బైఠాయించారు. కొత్తగూడెం జిల్లా చాతకొండకు చెందిన ఐఆర్ 6వ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు లక్ష్మీదేవిపల్లి ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. సుమారు 800 ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అంతకు ముందు వీరంతా లక్ష్మీదేవిపల్లి ప్రధాన రహదారిపై ప్రదర్శనగా కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ఎంజీ రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని 3వ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు ఇబ్రహీంపట్నం బస్టాండు ఎదుట రాస్తారోకో చేశారు. ఆందోళనకారులను అరెస్టు చేసేందుకు యత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు డీసీపీ సూచన మేరకు రాస్తారోకో విరవింపజేసిన ఆందోళనకారులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు.

స్కిల్స్ యూనివర్సిటీకి 'మేఘా' రూ.200 కోట్ల విరాళం

హైదరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు.. 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి మరో భారీ విరాళం అందింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీ ఇటీవలే రూ.100 కోట్లు అందించగా శనివారం అంతకు రెట్టింపు విరాళాన్ని 'మేఘా' ప్రకటించింది. 150 ఎకరాల్లో ఫోర్త్ సిటీలో నిర్మించబోయే స్కిల్స్ యూనివర్సిటీ క్యాంపస్ భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి బాధ్యతను ప్రముఖ నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) తీసుకుంది. దీనికి అవసరమయ్యే రూ.200 కోట్లను తాము భరిస్తామని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఫౌండేషన్ పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. స్కిల్స్ యూనివర్సిటీలో తమవంతుగా.. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనాల నిర్మాణం చేపడతామని ఎంఈఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో శనివారం సచివాలయంలో జరిగిన ఎంవోయూ కార్యక్రమం జరిగింది. మేఘా ఫౌండేషన్‌ను ముఖ్యమంత్రి అభినందిస్తూ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటులో మరో ముందడుగు పడిందన్నారు. వర్సిటీ అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్, లేబొరేటరీ బ్లాక్‌లు, గ్రంథాలయం, కంప్యూటర్ హబ్, విద్యార్థి, సిబ్బంది వసతి భవన సముదాయాలను మేఘా ఫౌండేషన్ నిర్మించనుంది. వీటి డిజైన్లను సీఎం సమక్షంలో ప్రదర్శించారు. వారంలో డిజైన్లకు తుదిరూపు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను నవంబరు 8న ప్రారంభించనున్నారు. వర్సిటీ నిర్మాణానికి ఇప్పటికే సీఎం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకే!

» ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరింది అందుకే: మధుయాష్కీ

జగిత్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు తమ అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు, రాజకీయ భవిష్యత్తు కోసమే కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. అంతే తప్ప. కాంగ్రెస్ పార్టీపై ప్రేమతో కాదన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతామంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బెదిరింపులకు పాల్పడటం వల్లనే తాము ఆ ఎమ్మెల్యేలను చేర్చుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అయినా.. వారికి తాము ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. శనివారం జగిత్యాలలో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని కలిశారు. ఇటీవల హత్యకు గురైన జీవన్‌రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యం వల్లే గంగారెడ్డి హత్య జరిగిందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫిరాయింపుల నిరోధక చట్టం అమల్లోకి తీసుకొస్తామన్నారు. పార్టీ మారిన ప్రజాప్రతినిధులు వెంటనే పదవులు కోల్పోయేలా చట్టం అమలు చేస్తామన్నారు.

దీపావళి పటాసుల కన్నా ముందే రాజకీయ బాంబు పేలుతుంది: పొంగులేటి

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ బాంబు పేలబోతోందంటూ దక్షిణ కొరియా పర్యటనలో వ్యాఖ్యానించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆ విషయాన్ని మరోసారి ప్రస్తావించారు. శనివారం విలేకరుల సమావేశంలో దీనిపై మాట్లాడుతూ.. దీపావళి పటాసుల కన్నా ముందే రాజకీయ బాంబు పేలుతుందని చెప్పారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పొంగులేటి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే యాప్‌ను రూపొందించామని, వారంలో దీన్ని అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. ఎలాంటి వివక్షకు తావులేకుండా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు.

4 నుంచి కులగణన

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి ఎంపిక చేయనున్నారు. రూ.24,269 కోట్లతో హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వీటితోపాటు మరికొన్ని కీలక అంశాలను క్యాబినెట్‌లో చర్చించి ఆమోదం తెలిపారు. ఆ వివరాలను రెవెన్యూ సమాచారశాఖ మంత్రి పొంగులేటి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు.

స్పౌజ్, పరస్పర బదిలీలకు ఆమోదం..

స్థానికత ఆధారంగా ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన జీవో నెం.317తోపాటు జీవో 46పైనా మంత్రివర్గం చర్చించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కొత్త నియామకాలకు జీవో నెం.46 వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పటికే ఉద్యోగాలు పొందిన వారు జీవో నెం.317తో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘం 13 సార్లు సమావేశమై చర్చించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో జీవో 317లో భార్యాభర్తలు(స్పౌజ్), ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకున్నవారిని బదిలీ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అయితే జీవో 317తోపాటు జీవో 46 విషయంలో చట్ట రీత్యా, న్యాయస్థానాల రీత్యా కొన్ని అడ్డంకులున్నాయన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై చర్చించి, మిగిలిన కొన్ని అంశాలపై క్లియరెన్స్ కోసం రాష్ట్రపతి ఆమోదానికి పంపించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

మూడు కేటగిరీలుగా మిల్లర్లు..

రాష్ట్రవ్యాప్తంగా 6వేలకు పైగా ధాన్యం సేకరణ కేంద్రాలకుగాను కొన్ని ఏర్పాటు చేశామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. గత ప్రభుత్వం మిల్లర్ల వద్ద భారీగా ధాన్యం నిల్వ చేసిందని, దాదాపు రూ.20 వేల కోట్ల విలువ చేసే ధాన్యం మిల్లర్ల వద్ద మిగిలిపోయిందని చెప్పారు. దీనిపై క్యాబినెట్‌లో చర్చ జరిగిందన్నారు. పొరుగు రాష్ట్రాల్లో ఏ విధంగా నిర్ణయాలు తీసుకున్నారో క్షుణ్ణంగా పరిశీలించి, ఆ రాష్ట్రాల కంటే మెరుగైన విధానం అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. క్లీన్ ఇమేజ్ ఉన్న మిల్లర్లను ఒకటో కేటగిరీలో, ప్రభుత్వం నోటీసులు ఇచ్చిన తర్వాత చెల్లింపులు చేసిన వారిని రెండో కేటగిరీలో, నోటీసులు ఇచ్చినా ముందుకు రాకపోవడంతో రికవరీ చర్యలు తీసుకున్న మిల్లర్లను మూడో కేటగిరీలో చేర్చినట్లు వివరించారు. ఇక డిఫాల్టర్లను పూర్తిగా ధాన్యం సేకరణకు దూరంగా పెట్టాలని నిర్ణయించామన్నారు. కాగా, రూ.24,269 కోట్లతో హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. నాగోల్-శంషాబాద్, రాయదుర్గం- కోకాపేట, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్బీనగర్-హయత్‌నగర్ మార్గాల్లో మొత్తం 76.4 కిలోమీటర్ల మేర రెండో దశను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో పీపీపీ విధానంలో చేపట్టాలని నిర్ణయించిననట్లు వెల్లడించారు. డీపీఆర్‌కు ఆమోదం తెలిపి, కేంద్ర ప్రభుత్వ సహాయం కోసం పంపించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

పూడిక తీతకు కడెం ప్రాజెక్టు ఎంపిక

రాష్ట్రంలో రిజర్వాయర్‌లలో పేరుకుపోయిన పూడికను ప్రయోగాత్మకంగా తీయడానికి వీలుగా కడెం ప్రాజెక్టును మంత్రివర్గం ఎంపిక చేసింది. ప్రాజెక్టుల్లోని పూడికతో ఆదాయం సమకూర్చుకోవడానికి వీలుగా కేంద్ర జల శక్తి శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించింది. పూడిక తీసిన మట్టిని రైతుల పొలాల్లో, ఇసుకను వాణిజ్య అవసరాలకు వినియోగించాలని నిర్ణయించారు. ప్రాజెక్టుల్లో పూడికకు పర్యావరణ అనుమతి అక్కర్లేదని కేంద్ర పర్యావరణ శాఖ మార్గదర్శకాలు జారీ చేయడంతో ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా కడెం ప్రాజెక్టులో పూడికను తీయనున్నారు. ఈ ప్రాజెక్టులో పూడిక తీత వల్ల వచ్చిన ఫలితాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని తీర్మానించారు.

పీపీపీ విధానంలో రోడ్ల నిర్మాణం..

రానున్న నాలుగేళ్లలో 16 వేల నుంచి 17 వేల కిలోమీటర్ల మేర పంచాయతీ, ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం పీపీపీ విధానంలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి తెలిపారు. ఇదివరకే వేసిన రోడ్లను మళ్లీ వేయడంతోపాటు కొత్తగా రోడ్లు వేయాల్సి ఉందని గుర్తు చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు నాలుగు లేన్ల రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. పాత జిల్లా యూనిట్‌గా దీని కోసం ఇంజనీరింగ్ శాఖ ముఖ్యఅధికారులతో కమిటీ వేసి, డీపీఆర్ తయారు చేయించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి రూ.28 వేల కోట్ల దాకా కానుండటంతో ఏ విధానంలో రోడ్లు వేయాలనే దానిపై కమిటీ తగిన నిర్ణయం తీసుకొని, ప్రభుత్వానికి సిఫారసు చేయనుందన్నారు.

మంత్రివర్గం మరికొన్ని నిర్ణయాలు..

- ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవన నిర్మాణాన్ని గోషామహల్‌లో నిర్మించేందుకు నిర్ణయం. ఇందుకోసం పోలీసుశాఖకు చెందిన భూములు వైద్య ఆరోగ్యశాఖకు కేటాయింపు.
- ములుగు గిరిజన యూనివర్సిటీకి 211 ఎకరాల భూమి కేటాయించాలని నిర్ణయం.
- హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు నిర్ణయం.
- మధిర, వికారాబాద్, హుజూర్‌నగర్‌లో స్కిల్ వర్సిటీకి అనుబంధంగా ఐటీఐల మంజూరు.
- 8 చోట్ల కొత్త కోర్టుల్లో ఉద్యోగాల మంజూరు. రెండు కాలేజీలకు ఉద్యోగుల మంజూరు.

28న కలెక్టర్లతో సీఎం కాన్ఫరెన్స్

రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ, సామాజిక, ఆర్థిక పరంగా అన్ని కులాల సర్వే చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని, ఇందుకు సంబంధించిన ప్రశ్నావళికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. దీనిపై ఈ నెల 28న కలెక్టర్లతో సీఎం కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని తెలిపారు. ప్రయోగాత్మకంగా పలు జిల్లాల్లో 50 ఇళ్లలో ఇప్పటికే సర్వే చేసినట్లు, ఆ ఫలితాల ఆధారంగా కులగణనలో ముందుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం సమగ్ర కుటుంబసర్వే చేసినా.. ఆ వివరాలను అధికారికంగా బయటపెట్టలేదన్నారు. కులగణన చేపట్టాలని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టామని, నవంబరు 30లోపు ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. ఈ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలకుగాను ఒక డీఏ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 2022 నుంచి డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. ఈ నిర్ణయంతో ఏటా రూ.3 వేల కోట్ల ఆర్థిక భారం పడుతున్నా.. ముందుకే వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు.

భూ ఆక్రమణలపై కఠిన చర్యలు: సీఎం రేవంత్

భూ ఆక్రమణలపై మరింత కఠినంగా వ్యవహరించాలన్న అంశంపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తున్నా.. కొందరు అవినీతి అధికారులు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని, అలాంటివారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యాబినెట్ భేటీ నుంచి అధికారులను పంపించివేశాక.. సీఎం, మంత్రులు దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.600 కోట్ల లిడ్‌క్యాప్ భూములను ఇటీవలే రిజిస్ట్రేషన్ చేసిన రంగారెడ్డి జిల్లా బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ అంశం చర్చకు వచ్చింది. దీనిపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. భూముల నుంచి భవన నిర్మాణాల అనుమతుల వరకు మరింత పారదర్శకంగా వ్యవహరించాలని, మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అధికారుల అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక రూ.2లక్షల్లోపు రుణమాఫీకి అర్హులైన వారందరి రైతుల రుణమాఫీ క్లియర్ చేద్దామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అది పూర్తయ్యాక ఆపైన ఉన్న రైతుల రుణమాఫీకి షెడ్యూల్ ప్రకటిద్దామన్నారు.

డీఏ మంజూరుపై ఉద్యోగుల జేఏసీ హర్షం

పెండింగ్‌లో ఉన్న డీఏ విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంపై తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నిరాశజనకంగా ఉన్నప్పటికీ డీఏ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ప్రజాపాలనపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు.



మద్దూర్‌లో సతీశ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నాయకుల మృతి పార్టీకి తీరని లోటు

వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కొడంగల్, మద్దూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించిన నాయకుల అకాల మృతి బాధాకరమని, వారు లేకపోవడం పార్టీకి తీరని లోటని సీఎం రేవంత్ అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం పరిధిలో మద్దూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు కల్లప్ సతీశ్, బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నర్సిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ శనివారం కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించి వారి కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మద్దూర్‌కు చేరుకున్న సీఎం రేవంత్ మొదట సతీశ్‌కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్కడి నుంచి బొంరాస్‌పేట్ మండలం రేగడిమైలారానికి రోడ్డు మార్గంలో చేరుకుని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు నర్సిరెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సిరెడ్డి భార్య యాదమ్మను, కుటుంబసభ్యులను ఓదార్చారు.

నాటి నేతలపై నజర్!

(మొదటిపేజీ తరువాయి)

విచారించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. కేసు నమోదైనప్పటి నుంచి విదేశాల్లో తలదాచుకున్న ప్రభాకర్‌రావును వీలైనంత త్వరగా రప్పించడంపై అధికారులు దృష్టి సారించారు. అందుకు అవసరమైన అన్ని మార్గాల్లో ముందుకెళ్తున్నారు. గతంలో కీలక కేసుల్లో విదేశాల్లో నక్కిన వారిని వెనక్కు రప్పించడంలో అనుసరించిన విధానాలపై అనుభవం ఉన్న అధికారులు ఇప్పుడు అదే పద్ధతిలో ముందుకెళ్లనున్నట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ తర్వాత కీలకమైన భూ బదలాయింపుల కేసులో ఇప్పటికే ఈడీ దూకుడుగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా విచారణకు ఆదేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహేశ్వరం పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ జరుపుతోంది. ఈ కేసుతో సంబంధం ఉన్న రాజకీయ నాయకులపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. వందల కోట్ల అక్రమాలకు సంబంధించి సీనియర్ ఐఏఎస్‌కు ఈడీ సమన్లు జారీ చేసి సుదీర్ఘంగా విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఈ కేసులో ప్రస్తుత, మాజీ ఐఏఎస్‌ల పేర్లు బహిర్గతమయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటి నాయకులపై సైతం కేసులు పెట్టే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. న్యాయనిపుణులు, ఇతర ముఖ్యుల సలహాల మేరకు త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఈ కేసుల్లో మరికొద్ది రోజుల్లోనే కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయా కేసుల్లో ఇప్పటివరకు అధికారుల చుట్టూ తిరిగిన దర్యాప్తు ఇకపై నాయకుల చుట్టూ తిరగనుంది.



అమోయ్‌పై ఫిర్యాదులకు క్యూ

సీనియర్ ఐఏఎస్ అధికారి, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్‌పై ఈడీ అధికారులకు వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. అవినీతిపై నిగ్గుతేల్చి తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు బషీర్‌బాగ్‌లోకి ఈడీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. మొన్న తట్టిఅన్నారం బాధితులు ఈడీకి ఫిర్యాదు చేయగా తాజాగా గండిపేట్ మండలం వట్టినాగులపల్లి నుంచి బాధితులు ఫిర్యాదు చేశారు. మహేశ్వరం మండలంలో భూ బదలాయింపుల కేసులో ఈడీ అధికారులు అమోయ్ కుమార్‌కు సమన్లు జారీ చేశారు. వరుసగా మూడు రోజులు విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. శుక్రవారం ఈడీ కార్యాలయంలో అమోయ్ కుమార్‌ను అధికారులు విచారిస్తున్న సమయంలోనే అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారం గ్రామంలోని సర్వే నెంబర్లు 108, 109, 110, 111లోని 70 ఎకరాల 39 గుంటల భూమి విషయంలో అక్రమాలు జరిగాయని బాధితులు ఈడీకి ఫిర్యాదు చేశారు. దాన్ని ఈడీ అధికారులు పరిశీలిస్తున్న క్రమంలో తాజాగా శనివారం మరో ఫిర్యాదు అందింది. వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ ప్లాట్స్ పర్చేజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈడీకి ఫిర్యాదు చేశారు. అసోసియేషన్ సభ్యులు లక్ష్మీకుమారి, కృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 1983లో వట్టినాగులపల్లిలోని 460 ఎకరాల్లో 3,333 వరకు ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. ఇందులో 3,228 మంది యజమానులను వారు కొన్న ప్లాట్ల దగ్గరికి వెళ్లనీయకుండా వ్యవసాయ భూమిగా చిత్రీకరించారని తెలిపారు. తమ పేరుతో ఉన్న భూముల్ని బడా రియల్ ఎస్టేట్ సంస్థలకు కట్టబెట్టారని, అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే కలెక్టర్ అమోయ్‌కుమార్ స్థలాల బదలాయింపు చేశారన్నారు. ఇలా వరుసగా రోజుకొకరు చొప్పున బాధితులు ఈడీ కార్యాలయానికి వస్తుండటంతో ఈ కేసుల్లో ఎప్పుడు, ఎవరికీ ఈడీ నోటీసులు అందుతాయోననే పరిస్థితి నెలకొంది. మూడు రోజులు సుమారు 20గంటల పాటు అమోయ్‌ను విచారించిన ఈడీ విచారించగా.. త్వరలోనే కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు!

» హైదరాబాద్‌లో రేపటి నుంచి షురూ

» త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా సేవలు

» రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంచుకునే ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) వినియోగదారుల ఇళ్ల వద్దకే లాజిస్టిక్స్ (కార్గో) సేవలను విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా దీన్ని మొదట ప్రయోగాత్మకంగా రాజధానిలో అమలు చేయనుంది. ఆదివారం (అక్టోబరు 27) నుంచి రాజధాని హైదరాబాద్‌లోని 31 కేంద్రాల నుంచి హోం డెలివరీ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ సెంటర్ల నుంచి హైదరాబాద్‌లో ఎక్కడికైనా హోం డెలివరీ చేయవచ్చని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో ఇంటి నుంచి ఇంటి వరకు సేవలు అందించేలా ఈ విభాగాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు.

పార్శిళ్ల హోం డెలివరీ చార్జీలు ఇలా..

0 నుంచి 1 కేజీ పార్శిల్‌కు రూ.50

1.01 నుంచి 5 కేజీలకు రూ.60

5.01 నుంచి 10 కేజీలకు రూ.65

10.1 నుంచి 20 కేజీలకు రూ.70

20.1 నుంచి 30 కేజీలకు రూ.75

30.1 కేజీలు దాటితే.. పైన పేర్కొన్న స్లాబ్‌ల ఆధారంగా ధరలు ఉంటాయి.

'ఇరుముడి'తోనే విమాన ప్రయాణం

- అయ్యప్ప స్వాములకు ప్రత్యేక వెసులుబాటు
- మకరజ్యోతి దర్శనం వరకు: రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప మాల ధరించే స్వాములకు పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తీపికబురు చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి కేరళలోని శబరిమలకు విమానాల్లో రావాలని భావించే మాలధారులు ఇరుముడితోనే విమానాల్లో ప్రయాణించవచ్చని తెలిపారు. అయ్యప్ప భక్తుల వినతి మేరకు నిబంధనలను సడలించినట్లు చెప్పారు. సడలించిన నిబంధనలకు అనుగుణంగా పౌరవిమానయాన భద్రతా విభాగం డైరెక్టర్ జనరల్ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. మంత్రి శనివారం ఓ వీడియో సందేశం విడుదల చేశారు. భద్రతా కారణాల రీత్యా విమానంలో కొబ్బరికాయతో కూడిన ఇరుముడిని ఇన్నాళ్లు అనుమతించలేదన్నారు. దీంతో స్వాములు రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేదని తెలిపారు. అయ్యప్ప భక్తుల విజ్ఞప్తి మేరకు నిబంధనలు సడలించామని, ఈ సౌలభ్యం మకరజ్యోతి దర్శనం ముగిసేవరకు(జనవరి 20) ఉంటుందని తెలిపారు. ఎయిర్‌పోర్టు సిబ్బంది స్కానింగ్ చేసిన తర్వాత భక్తులు నేరుగా ఇరుముడితో విమానాల్లో ప్రయాణం చేయవచ్చన్నారు.

గుస్సాడీ కనకరాజు మృతిపై ప్రధాని సంతాపం

న్యూఢిల్లీ, జైనూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గుస్సాడీ నృత్యకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు మృతి పట్ల ప్రధాని మోదీ ప్రగాఢ సంతాపం తెలిపారు. గుస్సాడీ నృత్యానికి కనకరాజు చేసిన సేవలను మోదీ శనివారం 'ఎక్స్' వేదికగా కొనియాడారు. "ప్రముఖ నృత్యకారుడు, సాంస్కృతిక మణిదీపం కనకరాజు మరణం చాలా విచారం కలిగించింది. గుస్సాడీ నృత్యాన్ని పరిరక్షించేందుకు ఆయన చేసిన కృషి రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకం" అని ట్వీట్ చేశారు. కాగా, గుస్సాడీ మృతదేహానికి మార్లవాయిలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, వెడ్మ బొజ్జు, మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, తదితరులు నివాళులర్పించారు.

మునిసిపాలిటీ అనుమతి ఉంటేనే నిర్మాణాలు

- వాటి అధికారాల్లో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శాశ్వత నిర్మాణాలైనా తాత్కాలికమైనవైనా మునిసిపాలిటీ అనుమతి ఉంటేనే చేపట్టాలని హైకోర్టు స్పష్టం చేసింది. మునిసిపాలిటీకి ఉన్న ఆ అధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. అమీన్‌పూర్ వద్ద తమ వ్యవసాయ భూమిలో తాత్కాలిక ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భార్య ఉమామహేశ్వరమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తొమ్మిది ఎకరాల వ్యవసాయ భూమిలో తాము వేసుకున్న షెడ్లు, ప్రహరీని హైడ్రా కూల్చివేయడం చెల్లదని పేర్కొన్నారు. ఇవి ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని పేర్కొంటూ 45 రోజుల కింద హైడ్రా కూల్చేసిందని, అందువల్ల తాత్కాలిక ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం.. స్థానిక మునిసిపాలిటీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టలేరని తెలిపింది. నిర్మాణాలు చేపట్టబోయే స్థలాన్ని పరిశీలించిన తర్వాత మునిసిపాలిటీ అనుమతులు జారీచేస్తుందని, అందులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషనర్ విజ్ఞప్తిని తిరస్కరించింది.

సెక్స్ వర్కర్లపై వివక్ష చూపొద్దు

- వారికీ హక్కులున్నాయ్: హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్‌పాల్

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సెక్స్ వర్కర్ల పట్ల వివక్ష చూపరాదని, వారి కూడా సమాజంలోని ఇతర పౌరులతో సమానంగా హక్కులు ఉంటాయని హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ, సాథి(ఎన్జీవో) సంయుక్త ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఎంసీఆర్‌హెచ్చార్డీలో శనివారం నిర్వహించిన సెక్స్ వర్కర్ల హక్కుల రాష్ట్రస్థాయి సంప్రదింపుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్స్ వర్కర్లకు పునరావాసం, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని తెలిపారు. జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ రూపొందించిన పథకాల ద్వారా అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి అథారిటీ మెంబర్ సెక్రటరీ సీహెచ్ పంచాక్షరి వివరించారు.

ముగిసిన అక్రిడిటేషన్ల ప్రత్యేక కమిటీ సమావేశం

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరుకు అనుసరించాల్సిన విధి విధానాలు, మార్గదర్శకాల రూపకల్పనకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సమావేశం హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవనంలో శనివారం జరిగింది. మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా రాష్ట్రాల్లో అమలులో ఉన్న నియమ నిబంధనల గురించి కమిటీ చర్చించింది. నూతన మార్గదర్శకాలపై జర్నలిస్టు యూనియన్లు/అసోసియేషన్లు, ప్రెస్‌క్లబ్బులు, వ్యక్తులు రాతపూర్వక సలహాలు, సూచనలను ఇవ్వొచ్చని కమిటీ తెలిపింది. నవంబరు 15లోగా సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్‌కు సలహాలు అందించాలని కోరింది.

ఆన్‌లైన్ అంగడి.. ఆర్డర్ చేస్తే దోపిడీ..

కూరగాయల ధరలు మూడింతలు అధికం.. బెంబేలెత్తుతున్న కొనుగోలుదారులు

- ధరలపై నియంత్రణ లేని ప్రభుత్వ యంత్రాంగం
- తమ పరిధి కాదంటున్న విభాగాలు
- ఇష్టానుసారంగా నిర్ణయిస్తున్న కంపెనీలు



హైదరాబాద్ సిటీ, బోయిన్‌పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గ్రాసరీల్లో కూరగాయల రేట్లు జనాల్ని హడలెత్తిస్తున్నాయి. హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లతో పోల్చితే భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. శనివారం హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో టమాటా రూ.32-35 ఉండగా.. ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు చెందిన జెప్టోలో రూ.94, బ్లింకిట్‌లో రూ.92, స్విగ్గీలో రూ.88, బిగ్ బాస్కెట్‌లో రూ.72 ధర ఉంది. నాణ్యత పరంగా ఆన్‌లైన్‌లో మంచివి దొరుకుతాయనుకున్నా.. ఇంత వ్యత్యాసం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక మోస్తరు రకానికి, నెంబర్‌వన్ రకానికి మధ్య ధరలో గరిష్ఠంగా 15 శాతం కంటే ఎక్కువ తేడా ఉండే అవకాశం లేదు. కానీ, ఇక్కడ ఏకంగా 200 శాతం అధికంగా ధరలు ఉండటం గమనార్హం. దీంతో ఆన్‌లైన్‌లో కూరగాయలను కొనేందుకు వివిధ వర్గాల ప్రజలు వెనకంజ వేస్తున్నారు.

రోజుకు 14 వేల క్వింటాళ్ల విక్రయం

హైదరాబాద్ నగరంలోని బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్‌లో భారీ కూరగాయల మార్కెట్లు ఉన్నాయి. వీటితోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో 11 రైతు బజార్లు ఉన్నాయి. వీటన్నింటిలో రోజుకు సగటున 14 వేల క్వింటాళ్ల కూరగాయలను విక్రయిస్తుంటారు. సాధారణ ప్రజల కంటే హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కూరగయాలు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. భారీవర్షాల వంటి సందర్భాల్లో కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. అయితే కొంతకాలంగా హోల్‌సేల్ మార్కెట్లలో దళారుల రాజ్యం నడుస్తోంది. హోల్‌సేల్ మార్కెట్లకు వచ్చే కూరగాయలను దళారులు టన్నుల కొద్దీ కొనేసి, ఆ తర్వాత వాటి ధర 50 శాతానికిపైగా పెంచి రిటైల్ వ్యాపారులకు అమ్ముతున్నారు. రిటైల్ వ్యాపారులు ధరలను 50-60 శాతం పెంచి నగరవాసులకు అమ్ముతున్నారు. దీంతో రైతుల దగ్గరి నుంచి ప్రజల వద్దకు చేరేసరికి కూరగాయల రేట్లు రెట్టింపునకుపైగా పెరుగుతున్నాయి. ఇది సరిపోదన్నట్లుగా ఆన్‌లైన్ అమ్మకాలు చేస్తున్న పలు సంస్థలు వాటిని మరింత భారీగా పెంచి డోర్ డెలివరీ చేస్తున్నాయి.

ఆన్‌లైన్ ధరలపై నియంత్రణ ఏది?

ఆన్‌లైన్ ద్వారా కూరగాయల విక్రయాలు చేపడుతున్న పలు (క్విక్ కామర్స్) కంపెనీలు మార్కెట్ రేట్ల కంటే దాదాపు మూడింతల చార్జీలతో అమ్మకాలు సాగిస్తున్నాయి. మార్కెట్‌లో పచ్చి మిర్చి కిలో రూ.60-65కు లభిస్తుండగా జెప్టో, స్విగ్గీ వంటి సంస్థలు ఆన్‌లైన్‌లో కిలో రూ.140-150 ధరతో విక్రయిస్తున్నాయి. రైతుబజార్‌లో 5 రకాల కూరగాయలకు కిలో చొప్పున రూ.205 ఖర్చయితే ఆన్‌లైన్‌లో వాటికి రూ.574 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ధరల ప్రక్రియను పలువురు వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఒక హేతుబద్ధత అంటూ లేకుండా ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించటమేమిటని నిలదీస్తున్నారు. ఆన్‌లైన్ కూరగాయల ధరలపై వినియోగదారులు.. ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. తూనికలు కొలతల శాఖ, మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల సంస్థ.. ఇలా ఎవరికి వారే తమ పరిధి కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో భారీ ఎత్తున రేట్లు పెంచి ఆన్‌లైన్‌లో అమ్మకాలు జరుపుతుంటే ప్రభుత్వం తరఫున పర్యవేక్షించే వారు లేకుండా పోయారు. ఈ పరిస్థితి మారాలని, ధరల నిర్ణయంలో పారదర్శకత, హేతుబద్ధత ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని రైతు బజార్లలో బోర్డుపై ఓ ధర కన్పిస్తే అమ్మకాల్లో మరో ధర ఉంటోంది. అదేమని అడిగితే బోర్డుపైన పెట్టిన ధరకు మంచివి రావు.. నాణ్యత లేనివైతే వస్తాయి.. కావాలంటే అవి తీసుకోవచ్చంటారు. అటు హోల్‌సేల్ మార్కెట్ల నుంచి ఇటు రైతు బజార్ల వరకూ.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ధరలపై నియంత్రణ ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు.

మార్కెట్లను శాసిస్తున్న దళారులు

బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్ మార్కెట్లను, రైతు బజార్లను కొంతమంది దళారులు శాసిస్తూ కూరగాయల వ్యాపారం సాగిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్లకు తాండూరు, వికారాబాద్‌లతోపాటు ఏపీలోని అనంతపురం, కర్నూలు, మదనపల్లి, ప్రకాశం జిల్లా మార్టూర్ మొదలైన ప్రాంతాల నుంచి కూరగాయలు వాహనాల్లో వస్తుంటాయి. వాటిని గంపగుత్తరేటు కట్టి దళారులు హోల్‌సేల్‌గా కొంటారు. శనివారం బోయిన్‌పల్లి మార్కెట్లో టమాటను సగటున కిలోకు రూ.16 చొప్పున కొనుగోలు చేశారు. ఆ తర్వాత అదే టమాటను రూ.26-32 మేర రిటైల్ వ్యాపారులకు విక్రయించారు. రైతుబజార్లలో కిలో టమాటను రూ.35-45 వరకు అమ్ముతుండగా, ఆన్‌లైన్ మార్కెట్లకు చేరేసరికి ధర రూ.72-94కు పెరిగింది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

- మహా ఎన్నికల తర్వాత పీసీసీ కమిటీల నియామకం
- చిట్‌చాట్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ కేటీఆర్ పక్కనే ఉండి సలహాలిచ్చే ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. తామెవ్వరినీ పార్టీలోకి రావాలని ఆహ్వానించడం లేదని, వారే అక్కడ ఉండలేక వస్తానని అంటున్నారని చెప్పారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. సెమీస్‌లో గెలిచామని అయితే తమకు ఫైనల్ 2028లో రాబోయే ఎన్నికలేనని చెప్పారు. అప్పుడు దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎంగానే కాదని, చివరికి ప్రతిపక్ష నేతగానూ ఫెయిల్ అయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, భూ ఆక్రమణలు, విద్యుత్ కొనుగోలు, కాళేశ్వరం.. ఇలా అన్ని అక్రమాలపై ప్రభుత్వం సీరియస్ గానే ఉందని, అన్నింటిపై సమగ్ర విచారణ జరుగుతోందని తెలిపారు. కేటీఆర్ చేసిన తప్పులకు రెండు, మూడేళ్ల జైలుశిక్ష సరిపోదని, కనీసం పదేళ్లయినా జైలులో ఉండాలన్నారు. విద్యుత్ చార్జీలు పెంచుతారనేది అసత్య ప్రచారమేనని కొట్టి పారేశారు. తెలంగాణలో కాంగ్రెస్ కొత్త కమిటీలకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మహేశ్‌గౌడ్ తెలిపారు. పాత, కొత్త కలయికలతో, సమన్వయంతో ముందుకెళతామని, సమర్థులకే పీసీసీ, డీసీసీ కమిటీల్లో అవకాశం కల్పిస్తామని చెప్పారు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత కొత్త కమిటీలను ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సన్నిహితుడి హత్యతో మనస్తాపానికి గురయ్యారని, అందుకే అలా మాట్లాడుతున్నారని చెప్పారు. భవిష్యత్తు తరాల కోసమే హైడ్రా, మూసీ పునరుజ్జీవం కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రజలకు అన్ని విషయాలు వివరించి, జీహెచ్ఎంసీ ఎన్నికలకు వెళతామని చెప్పారు. మంత్రి పొంగులేటి ఏ పొలిటికల్‌బాంబు పేలుస్తారో చూడాలన్నారు. ఆయన ఎందుకు అలాంటివ్యాఖ్యలు చేశారో తెలియదని, కానీ.. ఆయన మంత్రిత్వ శాఖలకు సంబంధించి ఏమైనా అవినీతిని బయటికి తీస్తారేమోనని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేలను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

మాటలు మొరటైనా.. నేను, సీఎం రేవంత్ మంచోళ్లం

- కేటీఆర్, హరీశ్‌రావులు డబుల్ లుచ్చాలు
- బీఆర్ఎస్ సోషల్ మీడియా రెచ్చగొడుతోంది.. దాని కోరలు పీకేస్తం
- మాపై తప్పుడు రాతలు రాస్తే.. ఖైరతాబాద్‌లో ముక్కు నేలకు రాయిస్త
- రేవంత్ చిట్టి నాయుడు కాదు.. గట్టి రెడ్డి
- ఆయన్ని బీఆర్ఎస్ నేతలు పది నెలలకే భరించలేకపోతున్నరు
- ఇంకా నాలుగేళ్లు భరించాలి.. ఆ తర్వాత ఐదేళ్లూ అధికారం మాదే: జగ్గారెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): "మా మాటలు మొరటైనా నేను, సీఎం రేవంత్‌రెడ్డి మంచోళ్లం. కేటీఆర్.. నీ సోషల్ మీడియాను అదుపులో పెట్టుకో. నీకు కొంచెం గౌరవం ఇస్త. కాదని మాపై తప్పుడు రాతలు రాయిస్తే.. రాసినవాడిని ఖైరతాబాద్ సెంటర్‌కు తీసుకువచ్చి పీజేఆర్ విగ్రహం వద్ద ముక్కు నేలకు రాయిస్తా. నిన్ను, హరీశ్‌రావును నడి బజారులో నిలదీస్తం" అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ వాళ్లను లుచ్చాలంటూ మాట్లాడుతున్న కేటీఆర్, హరీశ్‌రావులే డబుల్ లుచ్చాలని దుయ్యబట్టారు. అధికారం పోయేసరికి వారికి పిచ్చిపట్టినట్టుందన్నారు. కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్ రెడ్డిని ఎప్పుడు బద్నాం చేద్దామా? నాలుగేళ్లు ఎప్పుడు గడుస్తాయా? అని ఎదురు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం బ్యాచ్‌లా తయారైందని.. తమపై బుస కొట్టి రెచ్చగొడుతున్న దాని కోరలను పీకేస్తామని హెచ్చరించారు. గాంధీభవన్‌లో శనివారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఒకరిద్దరు కలెక్టర్లకు పది సార్లు ఫోన్లు చేసినా ఎత్తలేదని, దాంతో వారిని తిట్టానని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడున్న మహిళా కలెక్టర్‌ను తాను తిట్టినట్లుగా బీఆర్ఎస్ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అనని మాటలను అన్నట్లుగా పోస్టులు పెడితే మాకు కోపం



రాదా? కోపం వచ్చి నేను హరీశ్, కేటీఆర్‌ను తిట్టనా? అందుకే బేవకూఫ్ కథలు చేయవద్దని చెబుతున్న. పోస్టు పెట్టిన వాడు దొరికితే ఖైరతాబాద్‌లో బట్టలూడదీసి కొట్టేవాడిని' అని జగ్గారెడ్డి అన్నారు. పోస్టు పెట్టిన వాడి ఫొటో బయట పెడుతున్నానని, వాడు ఎక్కడున్నా.. తీసుకురావాలని కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు. అమెరికా, లండన్, దుబాయిలో ఉండి.. కేటీఆర్ ఫొటోలు పెట్టుకుని బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తమను ట్రోల్ చేస్తున్నారని జగ్గారెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ఎన్నారైలు వారిని ఇండియాకు ఎత్తుకురావాలని, విమానం చార్జీలు పెట్టుకుంటానని అన్నారు. 'సీఎం రేవంత్, జగ్గారెడ్డి, మంత్రులు ఎట్లా కనపడుతున్నరు వాళ్లకు? మాతో కుస్తీ పట్టలేరు. కొట్లాడలేరు. రాజకీయం ఎట్లా చేయాలో తెలియదా? అది చేతకాక.. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నరు' అని మండిపడ్డారు.

నేను.. రేవంత్ ఫైటర్స్!

సీఎం రేవంత్‌రెడ్డి.. చిట్టినాయుడు కాదు గట్టి రెడ్డి అని జగ్గారెడ్డి అన్నారు. రేవంత్ తొడ కొడితే కేటీఆర్‌కు కాళ్లు వణుకుతాయన్నారు. ఉద్యమం ముసుగులో నాడు ఆంధ్రావాళ్ల పేరు పెట్టి తిట్టారు కానీ.. కేటీఆర్, హరీశ్‌కు తిట్టే ధైర్యం కూడా లేదన్నారు. "నేను, సీఎం రేవంత్ ఫైటర్లం. ధైర్యంలో కేటీఆర్, హరీశ్ మాతో పోటీ పడలేరు. వారిలాగా ఆంధ్రోళ్ల పేరు అడ్డం పెట్టుకుని తిట్టం. కేటీఆర్, హరీశ్ పిల్లచేష్టలు మానుకుంటే మంచిది" అని హితవు పలికారు. సీఎం రేవంత్‌ పని మొదలుపెట్టి పది నెలలే అయినా బీఆర్ఎస్ వాళ్లు తట్టుకోలేక పోతున్నారని, ఇంకా నాలుగేళ్లు వాళ్లు భరించాలని పేర్కొన్నారు. ఆ తర్వాత ఐదేళ్లూ తామే అధికారంలో ఉండేందుకు ప్లాన్ చేస్తున్నమని చెప్పారు.

కుమిలిపోతున్న అమ్మ!

- కన్న కొడుకే కేసు పెట్టి కోర్టుకు లాగేసరికి... ఇంకా ఎందుకు బతికున్నానా అని రోదిస్తోంది
- జగన్ ఆదేశిస్తే సూర్యుడిని కూడా తాకుతా!
- నా కోసం ఒక్క మేలైనా ఆయన చేశారా?
- నా పిల్లలపై ప్రమాణం చేసి ఇదంతా చెబుతున్నా
- సుబ్బారెడ్డి ప్రమాణం చేయగలరా?: షర్మిల



అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): "ఆస్తి కోసం.. స్వీయలాభం కోసం కోర్టుకు ఈడ్చి, కేసు పెట్టడంతో అమ్మ కుమిలిపోతోంది. ఇదంతా చూసేందుకే నేను ఇంకా బతికి ఉన్నానా అని రోదిస్తోంది" అని వైఎస్ విజయలక్ష్మి కుమార్తె, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. బెయిల్ రద్దు అవుతుందని తల్లిపై కేసు పెట్టానని జగన్ అనడం దుర్మార్గమని, తన ప్రయోజనం కోసం తల్లిని కోర్టుకు లాగే దౌర్భాగ్యుడు ఎవరైనా ఉన్నారా అంటూ మండిపడ్డారు. శనివారం విజయవాడ కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. జగన్‌కూ .. తనకూ మధ్య ఏర్పడిన ఆస్తుల వివాదం మీడియా ప్రస్తావించగానే... షర్మిల కన్నీరు పెట్టుకున్నారు. "అన్నగా జగన్ ఆదేశించిన వెంటనే ఆనాడు పాదయాత్ర చేశాను. సమైక్యాంధ్ర కోసం పోరాటం చేశాను. కానీ, నాకు ఒక్క మేలైనా జగన్ చేశాడా? " అని గద్గద స్వరంతో ప్రశ్నించారు. జగన్ కోసం అమ్మ ఎంతో చేశారని, మోకాళ్ల నొప్పులు ఉన్నా .. జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడం కోసం ఆ నొప్పులకు ఐస్ రుద్దుకుని మరీ తిరిగారని గుర్తు చేశారు. అలాంటి అమ్మ మీద ఆస్తికోసం జగన్ కేసు పెట్టారని ఆగ్రహించారు. ఆస్తుల వ్యవహారానికి సంబంధించి వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులకు రాసిన లేఖలో ఉద్దేశపూర్వకంగానే, బాబాయ్ వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పేర్లు రాశానని షర్మిల అన్నారు. "జగన్ మోచేతి నీళ్లు తాగుతున్నారని తెలిసే ఆ లేఖలో వైవీ పేరు ప్రస్తావించాను. నా లేఖకు వైవీ స్పందించిన తీరుతోనే ఆయన నైజం.. అమ్మకు తెలిసిపోయింది. నేను చెబుతున్నదంతా నిజమని నా పిల్లలపై ప్రమాణం చేసి చెబుతున్నాను. సుబ్బారెడ్డి ప్రమాణం చేయగలరా?"అని ప్రశ్నించారు. జగన్ పేరిట ఆస్తులున్నందునే ఆయన జైలుకు వెళ్లారని వైవీ అంటున్నారని.. అదే నిజమనుకుంటే.. తన పేరు మీద ఇవే ఆస్తులు ఉన్న భారతి ఎందుకు జైలుకు వెళ్లలేదని షర్మిల నిలదీశారు. ఆస్తులున్నందుకు ఎవరూ జైలుకు వెళ్లరని, చేసిన పనుల వల్ల వెళతారని ఆమె వ్యాఖ్యానించారు. ఆస్తుల బదలాయింపు జరగకపోవడంపై ఒకరోజు జగన్‌ను తన తండ్రి రాజశేఖరరెడ్డి పిలిచి ఆరా తీశారని షర్మిల తెలిపారు. "నీ తరువాత పాప (షర్మిల) మేలు కోరేది నేనేనని నాన్నతో జగన్ చెప్పారు" అని గుర్తు చేసుకున్నారు.

సీఎం రేవంత్‌ను ప్రజలే తరిమికొట్టే పరిస్థితి

- కమీషన్ల కోసమే కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టు
- మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణలు

హైదరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే కాంగ్రెస్‌పై తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కమీషన్ల కోసమే కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారని ఆరోపించారు. కొడంగల్‌కు చెందిన కాంగ్రెస్ నేత దయాకర్ రెడ్డి, వంద మంది కార్యకర్తలు, బీఎస్పీ కొడంగల్ ఇన్‌చార్జి నర్మద.. తదితరులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా సిటీని తీవ్రంగా వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కొడంగల్‌లో ఫార్మా కంపెనీ ఏర్పాటుకు సిద్ధం కావడంతో స్థానిక ప్రజలే తరిమికొట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. పాలమూరు ప్రాజెక్టులో భాగంగా కొడంగల్ నియోజకవర్గాన్ని తక్కువ ఖర్చుతో సస్యశ్యామలం చేసే ప్రణాళికలు పక్కనపెట్టి, కమీషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టారని విమర్శించారు. మొన్నటిదాకా రేవంత్ రెడ్డి తిట్టిపోసిన ఓ ఇంజనీరింగ్ కంపెనీకి, మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీకి కాంట్రాక్టు కట్టబెట్టడం వెనక ఉన్న మతలబు అర్థం చేసుకోవాలన్నారు. పదేళ్లు ప్రగతిపథంలో పరుగులు పెట్టిన తెలంగాణ రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే, కాంగ్రెస్ నేతల ఆదాయం పెరుగుతోందని ఆరోపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.